కనువిప్పు

దాహమడిగితే నోట్లో మూత్రం పోసినా
కలకత్తా పోలీసు స్టేషన్‌లో
స్త్రీ ఖైదీల మర్మావయవాల్లో ఇనుప కడ్డీలు దూర్చినా
రాజకీయ ప్రత్యర్థులకు ఎమర్జెన్సీలో
హైదరాబాదు గోలీ రుచి చూపినా
అంధులమీద లాఠీచార్జ్ జరిపినా
పోలీసు స్టేషన్‌లను రేప్ సెంటర్లుగా మార్చినా
ప్రజా రాజకీయాల మీద కుట్ర కేసులు పెట్టినా
ప్రజా కార్య కర్తలను, సానుభూతి పరులను పట్టుకొని
ఎదురు కాల్పుల పేరుతో ప్రాణాలు ఎగుర గొట్టినా
నీకు చీమ కుట్టలేదు.
ఇంకేం
దేశంలో నేర చికిత్స చేయడానికి
సూదులు, యాసిడ్ పట్టుకొని భగల్పూర్‌లో బయల్దేరాడు
డాక్టర్ పోలీస్;
బీహార్ ప్రభుత్వ నేత్రవైద్య గౌరవ సర్జన్!
ఈ కంటి ఆపరేషన్ అయినా
మన ఇంటి వ్యవస్థ గురించి నీ కళ్ళు తెరిపిస్తుందా ?

110

సృజన

డిసెంబరు
1980

ఆధునిక సాహిత్యవేదిక మాసపత్రిక

ఈ సంచిక
రు. 2

ఈ సంచికలో......

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyd. Vide Ref. No. 182/A4/67. Dated 22-9-1967.

Edited Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'. Printed at Natyakala Press Hyderabad for Venkataramana Mudranalayam, Warangal.

Working Editor : **Varavara Rao**

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

110 మాసపత్రిక డిసెంబర్ 1980

ఈ సంచిక

కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్

సంస్మరణలో

పౌరహక్కుల, ప్రజాస్వామిక హక్కుల

పోరాటానికి

సంఘీభావం ప్రకటిస్తూ........

(కవరు కవిత : కనువిప్పు)

వికసించే బతుకు కొరకు...

శబ్దం నిశ్శబ్దంలోకి బలవంతంగా నొక్కబడ్డప్పుడు వచ్చే శబ్దం కొండ కింద డైనమైట్ పేలిన సంచలనాన్ని సృష్టిస్తుంది ఉరితీయబడ్డ శిరస్సు చెప్పిన రహస్యం కోట్లాది ప్రజల జీవన్మరణ పోరాటాలను వ్యక్తీకరిస్తుంది.

బ్రిటిష్ ఇండియా శిక్షాస్మృతి స్వభావాన్ని భగత్‌సింగ్, రిపబ్లిక్ ఇండియా శిక్షాస్మృతి స్వభావాన్ని భూమయ్య కిష్టాగౌడ్‌లు ప్రతి మార్చి 23 న ప్రతి డిసెంబరు 1 న మన నాగరిక ప్రపంచ చరిత్రపుటల్లోంచి మన సజీవ స్మృతిలోకి తెస్తున్నారు.

అధికారము, బలము వున్నచోట - ఈ రెండూ ప్రజల నుంచి సంక్రమించక, ప్రజల నిరంతర జాగరూకతతో నియంత్రించబడనిచోట అధికారం దోపిడీకి, బలం పీడనకు దుర్వినియోగం కావడం సహజమే. శిక్షను శిక్షణ (instruction) గా, సంస్కరణ (correction)గా కాకుండా (దండించుట) persecution గా, నాశనంచేసే (destruction) సాధనంగా వాడుకోవడానికి ఒక ప్రభుత్వం సామూహిక అణచివేత స్వభావాన్ని, హంతక ప్రవృత్తిని చట్టబద్ధం చేయడానికి ఒక శిక్షాస్మృతి - ఇవి నాగరికతలుగా చలామణి అవుతున్నాయి.

ఈ వ్యవస్థ ఎంత అనాగరికమయిందో, ఎంత పాశవికమైందో సూర్యుని వెలుగును వెతకడానికి ప్రవహించిన భూమయ్య, కిష్టాగౌడ్‌ల కంఠనాళాల్లోని రక్తంఎరుపు చీకటిముసుగులో బిగిసిపోయినపుడు ఎమర్జెన్సీనిశ్శబ్దం

స్పందించే ప్రతి గుండెలోనూ ప్రాణం పాతాళంలోకి నెట్టబడిన విసురుతో విని పించింది. పోలీసు లాకప్పులలో, జైళ్ళలో ఉరికొయ్యలపై, 'ఎన్ కౌంటర్' లలో హక్కుల గురించి ఈ ప్రభుత్వం జాగ్రత్త తీసుకుంటున్నది! ఆ విషయాన్ని నోరున్న "మేతావు"ల కన్న ఊపిరి కూడాలేని భూమయ్య కిష్టాగౌడ్ లు, వేలాది తెలంగాణా, నక్సల్బరీ మృతవీరులు ఎంత స్పష్టంగా చెప్తున్నారు!

బంధనాల్లోంచి స్వేచ్ఛలోకి, కటకటాల్లోంచి ఆకాశంలోకి, చెమటలోంచి పంటలోకి చూసే చూపులను నిర్దాక్షిణ్యంగా పెరికివేసే ఈ జైలు వ్యవస్థను భగల్పూర్ ఖైదీలు చూసినంత నిశితంగా మనం చూడగలుగుతున్నామా? భూమయ్య, కిష్టాగౌడ్ లు ఇప్పుడు పేర్లు కావు. పౌరహక్కుల ఉద్యమానికి పర్యాయపదాలు. వ్యక్తులు కారు, ప్రజాతంత్ర ఉద్యమానికి సంకేతాలు. భూమయ్య కిష్టగౌడ్ ల చరిత్ర భూమికోసం, ప్రజలకు యిష్టమైన వ్యవస్థకోసం తెలంగాణ కాలంనుంచి శ్రీకాకుళ కాలం దాకా ప్రవహించిన గోదావరి దారి. ఇవ్వాళ ఆదిలాబాదు కరీంనగర్ రైతాంగ పోరాటాల్లో వాళ్ళ ఊపిర్లు వెదురువనంలో వేణువులై వీస్తున్నాయి.

భూమయ్య పుట్టూరుకు పొరుగునవున్న కుక్కలగూడూరులో భూమయ్య' కిష్టాగౌడ్ లకు, వాళ్ళ వారసులైన కరీంనగర్ రైతాంగ పోరాట మృతవీరులకు స్మారకంగా గత డిసెంబర్ లో ప్రజలు స్థూపం నిర్మించుకున్నారు. మృత వీరుల ఆశయాలను సాధించడానికి ముందుముందుకు సాగుతామని ప్రతిజ్ఞ తీసు కున్నారు. భూమయ్యది, భూమయ్య రెండెకరాల నేలచెక్కది జంగమ స్వభావమే కాని స్థావర ప్రవృత్తి కాదు. ఆయనభూమి దానిమీద నాగలి మోపి దున్నలేనివాని దురాక్రమణకు గురయ్యింది. ఆయన "దున్నేవానికే భూమి'' ఉద్యమంలో ముప్పయ్యేళ్లు సంచలించాడు. మొదటిసారి ఉరిశిక్షకు తేదీ నిర్ణయమై వచ్చినపుడు జైల్లో ప్రశాంతంగా ఆకాశంలోకి చూసిన ఆయన కళ్ళలో శూన్యం కాదు చెరబడ్డ నేలతల్లి కనిపించింది. ఆ నేలతల్లి చెరను విడిపించడానికే ఆయన చెరసాలలో ఉరికొయ్య పాలయ్యాడు.

తొడకు కాటా తగిలిన తోటారాముడు కిష్టాగౌడ్. తెలంగాణ నుంచి నక్సల్బరీ దాక భుజంమీద తుపాకీ మోస్తూ ఎక్సైల్ లో వున్న గెరిల్లా యోధు నిలా తన తొడలో శత్రువు తూటాలను తన వారసులకు వర్గకసిని పెంచ

డానికా అన్నట్లు పదిలంగా దాచుకున్నవాడు. తెలంగాణ రైతాంగ పోరాటం ఆయనకు బులెట్ల రుచి చూపింది. నక్సల్బరీ ఉరికొయ్య రుచి చూపింది. తుపాకులు, జైళ్ళు, ఉరికొయ్యలూ లేని ఉజ్జ్వల ప్రపంచం కోసం తమ ఊపిర్లతో ఊహాల ఊయలలు కట్టారు ఈ కామ్రేడ్స్.

మనం బానిసలుగా బతకవద్దని తమ ప్రాణాలు బలిపెట్టారు స్పార్టకస్, భగత్‌సింగ్‌లు. మనం వెట్టివాళ్ళుగా మట్టిలో కలిసిపోవద్దని పోరాడి ప్రాణాలు విడిచారు బందగీ, కొమురయ్యలు. మనం పోడుచేసుకున్నఅడవిలోనే, మనం కంబార్లుగా మారి గింజకు, గంజికి కరువై బతకకూడదని మరణించాగు కోరన్న, మంగన్నలు. ఎల బతుకులు బతక వద్దని, కాళ్ళ కిందిమట్టి దొరల కంట్లో ఎగిసి పడక తప్పదని ఎదురు తిరిగి ప్రాణాలు యిచ్చారు పోచయ్య భూమిరెడ్డిలు.

కష్టాన్ని దానం చేయడం కాదు, అదనపు విలువగా గుర్తింపచేయాలని జాలన్‌లు. బొగ్గు బావి బతుకులను రగుల్కొనే నిప్పుకణికలుగా మార్చాలని పెద్దిశంకర్‌లు ప్రాణాలు బలిపెట్టారు. ఉరిశిక్షలు, కాల్పులు విప్లవాన్ని భయపెట్టలేవు. నోరున్నవాని మౌనం, చేయున్నవాని క్రియాశూన్యత, బుద్ధున్నవాని పిరికితనం మాత్రమే ఉరిశిక్షలకు, 'ఎన్‌కౌంటర్'లకు, అత్యాచారాలకు లైసెన్సుల నిస్తుంది. భయంకరంగా ప్రజలను నేరస్తులుగా చిత్రించి ఖైదీలుగా, అంధులుగా మారుస్తున్న వ్యవస్థను బయటి జైల్లో వున్న మనం భయం అనే సంకెళ్ళు తగిలించుకొని చూడడానికి, చూసి చెప్పడానికి, చెప్పి మార్చడానికి సాహసించని, గుడ్డివాళ్ళుగా, మూగవాళ్లుగా ఉరితీయబడ్డ శిరస్సు చెప్పిన రహస్యం బహిరంగం చేయలేని జీవచ్ఛవాలమై మిగులుదామా' వద్దు. వద్దు. భూమయ్య కిష్టాగౌడ్‌ల సంస్మరణలో మనం ధారపోసే అశ్రువు విశ్వసృష్టికి దోహదం చేసేలా, ప్రపంచాబ్జపు తెల్లరేకై పల్లవించేలా బతుకుదాం.

1-12-80

—వరవరరావు

ఏం దినేటట్ల లేదు

వి. బి. గద్దర్

ఏం గొనేటట్ల లేదు నాగులో నాగన్నా
ఏం దినేటట్ల లేదు ,, ,,
ధరలిట్లా మండబట్టె ,, ,,

అమ్మ దిగి అయ్యెక్కె
అయ్య దిగి అమ్మెక్కె నాగులో నాగన్నా
ధరల మీద ధరలెక్కె ,, ,,
ధరలిట్లా పెరుగబట్టె ,, ,,

జర మొచ్చి నోరంత
పెండ పెండ అయిపోతె
తొక్కు నూరుకుందమాని
చింతపండు కొనబోతె
చింత పిక్క ధరజూడు నాగులో నాగన్నా
సూరెక్కి ఎక్కిరించె ,, ,,

పచ్చి బాలింత కింత
పప్పు కాసి పోద్దమాని
చెయిసంచి తీసుకోని
సేరు పప్పు గొనబోతె
సేరు పప్పు వచ్చెకాడ నాగులో నాగన్నా
సెటాకంత రాకపాయె ,, ,,

పండుగ దినంగోలె
పాళమొండు కుందమాని
సుక్క తెగి పడ్డట్టు
శక్కర నే గొనబోతె
శక్కర ధర ఇనగానె నాగులో నాగన్నా
చెక్కరొచ్చి నట్లాయె ,, ,,

దసరగోలె సంటోళ్ళకు
సైను బట్ట గొనబోతె
బారెడంత పన్నబోయి
మూరెడంత పన్నాయె
సైనుబట్ట ధర యింటె నాగులో నాగన్నా
నను రైను బెట్న రాకపాయె ,, ,,

కట కట రాజ్యంలో
పెట పెట పెట పేగుమాడె
కట కట రాజ్యాన్ని గూల్చ నాగులో నాగన్నా
పట పట పట పండ్లు గొరుకు ,, ,,

బ్లాకు జేసె బాడుకావు
బంగ్ల మీన బంగ్ల గట్టె
మన బతుకులు బొందకాయె నాగులో నాగన్నా
మన మెతుకులు కాకికాయె ,, ,,

గ్యాసు నూనె కోసమేమొ
కోసంత లైను గడితె
డబ్బుల సప్పుడు జేసి
దర్వాజ మూసుకునె
దొడ్డి దర్వాజ నించి
దొరలకు సప్లయి జేసె

ధరలో.........

" ఏం గొనేటట్ల లేదు..."

"ఒక్కోసారి అతిశయోక్తులు వాస్తవాలవుతాయి" ధరలు చుక్కలనంటుకోవడం అనే అతిశయోక్తి భారతప్రజల జీవితంలో వాస్తవమే అయింది. గత సంవత్సర కాలంలో ధరలు విపరీతంగా పెరిగినయి. బియ్యం గోధుమల ధరలు 16 శాతం, పప్పు ధరలు 25 శాతం, చక్కెర ధర 128శాతం వంట నూనెల ధరలు 41 శాతం, కిరసనాయిలు ధరలు 29 శాతం పెరిగినయి. ఇవి టోకు రేట్లు మాత్రమే. చిల్లర ధరలు పరిశీలిస్తే మళ్ళీ ప్రతి వస్తువుపైనా ఇంకో 25 శాతం పెరుగుదల వుంటుంది.

ఆర్థిక శాస్త్రవేత్తల లెక్కల ప్రకారమే జీవనవ్యయం 1980 లో రు. 100 అనుకుంటే అది 1980 నాటికి రు. 371కి, ఆగస్టు'80 నాటికి రు. 397కు పెరిగింది. టోకు ధరలు 1970-71లో రు. 100 అనుకుంటే జనవరి 80 నాటికి రు. 224కు, అక్టోబర్ '80 నాటికి రు. 265-70 కి పెరిగినయి.

ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా బ్లాక్ మార్కెట్ బూచిని చూపుతూ ప్రభుత్వం ఎన్నో అణచివేత చట్టాలను ప్రవేశపెడుతోంది. కాని

నీ గుడ్డి దీప మారిపాయె నాగులో నాగన్నా
గుడిసంత చీకటాయె ,, ,,

దోపిడి దొరలంత గల్సి
గద్దెలెక్కి కూసుండ్రు
దొరల గద్దె దించెదాక
ధరలు దిగేటట్ల లేవు
దొరల గద్దె దించనీకి నాగులో నాగన్నా
యుద్ధం జేద్దాం రారా ,, ,,

బ్లాక్ మార్కెటింగ్ వల్లనే ధరల పెరుగుదల సమస్య వస్తున్నదా?

కాదు - మొత్తం సమస్యల్లో బ్లాక్ మార్కెటింగ్ భాగం చాలాతక్కువ. అది కూడా ప్రభుత్వం తలుచుకుంటే- మొత్తం వ్యాపారాన్ని తన చేతుల్లోకి తీసుకొని, ప్రజాపంపిణీ విధానం సక్రమంగా అమలయ్యేట్టు చూస్తే చాలా సులభంగా తొలగించ గలిగిందే. ధరల పెరుగుదలకు ముఖ్యకారణాలు వేరే ఉన్నాయి. అవి—

1. గుత్త పారిశ్రామికవేత్తల మధ్య ఒప్పందాలు

గుత్తపరిశ్రమల యజమానుల్లో కొందరు తాము ఉత్పత్తిచేసే వస్తువులకు ఒక ప్రత్యేక ధరను నిర్ణయించాలని అనధికారికంగా ఒప్పందాలు చేసుకుంటారు గుత్తపరిశ్రమల, వ్యాపార వ్యవహారాల పరిమితులచట్టం కింద ఇలాంటి ఒప్పందాలను ప్రభుత్వం చట్టవ్యతిరేకమయినవిగా ప్రకటించింది. ఇలాంటి ఒప్పందాల విషయంలో విచారణకు కూడా ఆజ్ఞాపించింది. అయితే ఈ ప్రకటనలు విచారణలు పెరగుదలను ఏ మాత్రమూ అడ్డుకోలేకపోయాయి ఈ ఒప్పందాలు అనధికారికంగా జరుగుతాయి గనుక వీటిని నిరూపించడం సాధ్యంకాదు. గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో సబ్బుల ధరల విషయంలో ఇదే జరిగింది. హమామ్, 501, జై వగైరా సబ్బులు తయారుచేసే టాటా ఆయిల్ మిల్స్, లక్స్, సన్‌లైట్ వగైరా సబ్బులు తయారుచేసే హిందుస్తాన్ లివర్ కంపెనీలు ఒకేసారి తమ ఉత్పత్తుల ధరలను పెంచాయి. ఇట్లా ఒకేసారి ధరలు పెంచడం అనధికారిక, చట్ట వ్యతిరేక ఒప్పందం ఆధారంగానే జరిగిందని ప్రభుత్వం విచారణను ప్రారంభించింది కాని ఈ సంవత్సరం జూన్‌లో "ఒప్పందాలు జరగలేదని సంతృప్తి చెంది" విచారణను ఆపేసింది.

అయితే ఈ విచారణను ప్రారంభించడానికి కొద్దిరోజుల ముందే లోక్ సభలో పరిశ్రమల మంత్రి ఈ విషయంపై ఒక ప్రశ్నకు జవాబుగా "సబ్బుల ధరలకు పరిమితి ఏమీలేదు" అన్నాడు. ఆగస్టు 76 నుంచి సబ్బుల ధరలు ఐదు సార్లు పెంచబడినయి.

ఉత్పత్తి అయిన సరుకుల ధరలపై పరిమితి విధించడమే ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలో ఈ సమస్యకు సరైన పరిష్కారం. అట్లానే ముడి సరుకుల ధరలపై

కూడా పరిమితి విధించాలి. (ధరలు పెంచినప్పుడల్లా ఉత్పత్తిదార్లు ముడిసరుకుల పేరే చెపుతారు.) ఇలాటి చర్యను ప్రభుత్వం ఇంతవరకూ చేపట్టలేదు.

2. విదేశీ పెట్టుబడులు

ఇలా వచ్చే పెట్టుబడి డబ్బురూపంలోనో యంత్ర పరికరాల రూపంలోనో వుంటుంది. డబ్బురూపంలో వచ్చే సహాయానికి సాధారణ వాటాల రూపంలో ప్రతిఫలం చెల్లించవలసి వుంటుంది. అయితే ఈ సమయంలో విదేశాలు పెట్టే షరతులు ద్రవ్యోల్బణ స్థితికి ముఖ్యకారకమైనవీ, ఉత్పత్తుల ధరలను పెంచేవీ అయి వుంటాయి. ఆ దేశం నుంచో, ఆ దేశం చెప్పే దేశాల నుంచో మాత్రమే యంత్ర పరికరాలు సాంకేతిక సూత్రాలు కొనుక్కోవాలనే షరతు సాధారణంగా వుంటుంది.

రష్యాతోనూ, తూర్పు యూరప్ దేశాలతోనూ మనకున్న సహాయ వాణిజ్య ఒప్పందాలలో ఆ దేశాల నుంచే యంత్ర సామాగ్రి కొనుక్కోవాలనే షరతు సాధారణంగా వుంటుంది. ఉదాహరణకు రష్యా సహాయంతో చేపట్టిన బొకారో ఉక్కు కర్మాగారం నిర్మాణవ్యయం ప్రస్తుత ప్రపంచస్థాయితో పోలిస్తే రెండింతలయింది రష్యా తన యంత్ర పరికరాల ధరలను రెండింతలు పెంచింది

3. వ్యాపార ప్రకటనలు—అభివృద్ధి

పెద్ద ఉత్పత్తిదార్లు వ్యాపార ప్రకటనలమీద పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చుచేయడానికీ, ఆ ఖర్చును ఉత్పత్తులపై ధర నిర్ణయించే టప్పుడు దాంట్లో కలపడానికీ అలవాటు పడ్డారు. కాస్మెటిక్స్ ఇంటర్నేషనల్ సంస్థ అంచనాల ప్రకారం 'వికో' ఉత్పత్తుల ప్రకటన ఖర్చుఉత్పత్తి వ్యయంలో 15%వుంటుంది. ఈ నిష్పత్తి అలంకరణ సామగ్రి విషయంలోను, మందుల విషయాలోనూ ఎక్కువగా వుంది ఒక ప్రపంచ ఆరోగ్య నివేదిక ప్రకారం మందులకు సంబంధించిన ముఖ్యసమ్మేళనాలు 200 మాత్రమే ఉన్నప్పటికీ భారతదేశంలో 15,000 రకాల సమ్మేళనాలు అమ్మబడుతున్నాయి హాథీ కమిటీ నివేదిక ప్రకారం భారతదేశంలో అవసరమయ్యే ముఖ్య సమ్మేళనాలు 44 మాత్రమేనని తెలిసింది. ప్రభుత్వం ఈ రెండు నివేదికల సలహాలనూ పట్టించుకోనేలేదు.

4. ఎగుమతులు

ద్రవ్యోల్బణంలో ఎగుమతులు ఎంత ముఖ్యపాత్ర పాత్రవహిస్తాయో ఈ మధ్యనే కూరగాయలు, పళ్ళ విషయంలో బాగా రుజువయింది. మే 79లో కేంద్ర ప్రభుత్వం కూరగాయల ఎగుమతిపై నిషేధం ఎత్తివేసిన తరువాత బెండకాయలు, వంకాయలు మొదలైన వాటి ధరలు చుక్కలంటుకున్నవి. ఉల్లిగడ్డల విషయం ఇంకా విచిత్రంగా ఉంది. ఉల్లిగడ్డల ధర బొంబాయిలో 5-6 రు.కు కలకత్తాలో 12 రూపాయలకూ పెరిగింది. ఒకవైపు జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య (NAFED) రైతుల దగ్గర 30 నుంచి 50 పైసలకు కిలో చొప్పునకొని దేశంలో అమ్మనే అమ్మదు. (నిజానికి ఈ సమాఖ్య దేశంలో మాత్రమే అమ్మకాలు సాగించాల్సివుంది.) ఇంకోవైపు ఉల్లిగడ్డల ఎగుమతి సాగిస్తూనే ఉంది.

5. పన్నులు - సబ్సిడీలు

ప్రభుత్వం ఉత్పత్తి దార్లకు పెద్ద మొత్తాల్లో ఇచ్చే సబ్సిడీల భారం అంతిమంగా మామూలు కొనుగోలుదారు మీదనే పడుతున్నది. ప్రభుత్వం వివిధ పన్నులు విధించినప్పుడు మామూలు మనిషే వాటిని చెల్లించవలసి వస్తుంది. పెద్దఎత్తున సబ్సిడీలు పొందనప్పటికీ ఉత్పత్తిదార్లు లాభదాయకమైన ధరలు నిర్ణయించినప్పుడూ ఆ భారాన్ని మామూలు మనిషే భరించవలసి వస్తుంది.

ఈ మధ్యనే ప్రభుత్వం అలంకరణ సామగ్రిపై ఎక్సైజ్ పన్నులో విపరీతమైన తగ్గింపు ఇచ్చింది. కాని కొన్ని సబ్బుల ధరలు మాత్రమే కొద్దిగా తగ్గించబడినయి. (అదీ తగ్గింపు దొరికిన నిష్పత్తిలో కాదు.) ప్రభుత్వం ఈ మధ్యనే చెరుకు ఉత్పత్తిదార్లకు కొత్త సబ్సిడీలు ప్రకటించింది. దేశపు మొత్తం చెరుకు ఉత్పత్తిలో సగంకంటె ఎక్కువ వాటా కలిగివున్న సహకార సంఘాలు ఈ సబ్సిడీలవల్ల లాభపడ్డాయి. (నిజానికి ఈ సబ్సిడీల అవసరం వున్నవాళ్ళు చెరుకును చిన్న పెట్టుబడితో ఉత్పత్తి చేస్తున్నవాళ్ళు కాని వాళ్ళకు చాలా తక్కువ సబ్సిడీలు అందినయి.) ఐనా ఈ సహకార సంఘాలు ఉత్పత్తి చేసే చక్కెర ధర రోజురోజుకూ పెరిగిపోతున్నది.

ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలకు, భూస్వాములకు ఇచ్చే సబ్సిడీలు 1950-51 నుంచి ఇప్పటికి 45 సార్లు పెంచబడ్డాయి. ఈ సబ్సిడీలు 1950-51లో 26కోట్ల 10 లక్షల రూపాయల నుంచి 1977-78 లో 1171 కోట్ల 60 లక్షలకు పెరిగాయి.

6. లోటుబడ్జెట్

పైన చెప్పబడిన సబ్సిడీలు, తదితర వృధాఖర్చులన్నిటినీ ప్రజలు పన్నుల రూపంలో భరించ వలసివస్తోంది. ఆ ఖర్చులో కొంత భాగం అసలు పూడ్చ బడడం లేదు కూడా. దీనితో ప్రభుత్వం ఏ రకమైన మదుపు లేకుండానే ఎక్కువనోట్లు ముద్రిస్తోంది. లేదా అప్పులు చేస్తోంది. దీని వల్ల ప్రభుత్వానికి ఏ బ్యాంకులో గానీ ఏ దేశ, విదేశ ఆర్థికసంస్థలో గానీ అప్పు పుట్టని పరిస్థితి ఏర్పడింది. ఇక అది వివిధవర్గాల ప్రజలపై పడి డబ్బుకోసం వేధించడం ప్రారంభించింది. నిర్బంధపొదుపుపథకం (సిడిఎస్) ప్రవేశ పెట్టినప్పుడూ, బోనస్‌లో, కరువుభత్యంలో కోత విధించినప్పుడూ ఇదే జరిగింది. ఇందువల్ల చిన్న పారిశ్రామిక వేత్తలకు ధరలు పెంచడం జబ్బుగా ముదిరిపోయింది. వాళ్ళు డబ్బుకోసం వెతికే ప్రయత్నంలో రెండు మార్గాలనెంచుకుంటారు. శ్రామికుల జీతాల్లో కోత విధించడమూ, ఉత్పత్తుల ధరలు పెంచడమూ.

7. వ్యాపారం - ప్రజాపంపిణి

ద్రవ్యోల్బణం ఏర్పడ డానికి గల కారణాలలో వ్యాపారం ప్రధాన పాత్ర వహిస్తుంది. ఒక్క బ్లాక్‌మార్కెటింగ్ మాత్రమే కాదు వ్యాపార వ్యవస్థా నిర్మాణంలోనూ సరియైన పంపిణీ విధానం లేకపోవడం లోనూ ఈ మూల కారణముంది

65 కోట్ల ప్రజలకు పంపిణీ చేసేందుకుగాను దేశం మొత్తం మీద రెండున్నర లక్షల ప్రభుత్వ చౌకధరల దుకాణాలు పనిచేస్తున్నాయని అంచనా వేయబడింది అంటే ప్రతి 2600 మంది ప్రజలకు ఒక దుకాణం చొప్పున పనిచేస్తున్నాయన్నమాట. ఈ విషయం వాస్తవంలో ఇంత సాధారణంగాలేదు. పట్టణ ప్రాంతాల్లో ప్రతి దుకాణమూ కొద్దిమంది కొరకే ఉంటుంది, పటిష్టమైన నిర్మాణం కలిగి ఉంటుంది. కాని గ్రామీణ ప్రాంతాల్లో దుకాణంలేని ప్రాంతా

లెన్నోవున్నాయి. పట్టణప్రాంతాల దుకాణాల్లో కూడా 80శాతం దుకాణాల్లో వుండవలసిన సరుకుల్లో 10 శాతం కూడా ఉండటంలేదని కనుకొనబడింది. మిగిలిన దుకాణాలు తమకుతోచి ట్టు పనిచేస్తాయి. కంట్రాక్టర్లకు అద్దెకివ్వబడిన ఈ దుకాణాలలో అన్ని సరుకుల ధరలు సరిగా వుటున్నాయో లేదో చూసేందుకు సరియైన నిఘా లేనేలేదు. ఫలితంగా బ్లాక్ మార్కెటింగ్ విస్తృతంగా జరుగుతోంది

ప్రభుత్వ అధీనంలోని పంపిణీవ్యవస్థ అసమర్థత మాత్రమే కాకుండా మొత్తం స్వేచ్ఛావిపణిలోని వ్యాపారవ్యవస్థే ఈ విధంగా వున్నది. ఉదాహరణకు ఉల్లిగడ్డల వ్యాపార లో 300 మైళ్ళ దూరంలో వున్న నాసిక్ కూ బొంబాయికీ మధ్య ఐదు మారకపు స్థాయిలున్నాయి. ఫలితంగా ఉల్లిగడ్డలధర నాసిక్ నుంచి బొంబాయి చేరేసరికి 200% పెరుగుతున్నది. నాసిక్‌లోనేమో ఉల్లిగడ్డల ధర పండించిన రైతుకు కన్నీళ్ళు తెప్పిస్తున్నది.

పై విషయాలవల్ల తెలిసేదేమిటంటే ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలు ప్రత్యక్షంగా ప్రభుత్వం కల్పించినవో లేదా ప్రభుత్వ విధానాల లై సెన్సు వున్న ఇతరుల చర్యలు కల్పించినవో అయివున్నాయి. కనుక తేలేదేమిటంటే ధరల పెరుగుదలకు మూలం ప్రభుత్వ స్వభావంలో, విధానాల్లో వున్నది.

"పనిచేసే" ప్రభుత్వాన్ని ఎన్నుకోండి. అనే నినాదంతో ప్రజల ముందుకొచ్చి, ఎన్నికైన ఇందిరాగాంధీ ప్రభుత్వం పదవిలోకి వచ్చిననాటి ధరలు, వారం కింది ధరలుపరిశీలిస్తే పదకొండు నెలల్లో ఇందిరా గాంధీ ప్రభుత్వం ఏవర్గ ప్రయోజనాలకు అనుకూలంగా "పనిచేసిందో" తెలుస్తుంది.

ఈ కింద ఇచ్చిన ధరలు టోకు ధరలు-చిల్లర ధరలతో పెద్దగావిభేదిస్తూ వుండవచ్చు. ఈ ధరలన్నీ 100 కిలోలకు ఇవ్వబడినాయి. ఇక్కడ ఇచ్చిన ధరలు కనిష్ట, గరిష్ట ధరల ఆధారంగా సగటుగా ఇవ్వబడ్డాయి.

వస్తువు	ఇందిరా గాంధీ అధికారంలోకి వచ్చిన 9-1-80న ధర	22-11-80న ధర
బియ్యం-మసూరి	202-50	262-50
బియ్యం-సాంబార్లు	220-00	272-50

వస్తువు	9-1-80న ధర	12-11-80న ధర
కందిపప్పు	385-00	507-50
పెసరపప్పు	420-00	457-50
మినపపప్పు	362-50	440-00
శనగపప్పు	285-00	577-50
శనగ నూనె	935-00	1100-00
నువ్వుల నూనె	1032-50	1210-00
రిఫైన్డు నూనె	1052-00	1240-00
కొబ్బరి నూనె	1605-00	2200-00
మిర్చి	512-00	575-00
చింతపండు	375-00	742-50
బెల్లం	255-00	375-00
నువ్వులు	550-00	687-50
చక్కెర (స్వేచ్ఛా విపణిలో)	500-00	1600-00
చక్కెర (ప్రభుత్వపు దుకాణాల్లో)	285-00	780-00

(చివరి చక్కెర ధర 27-11-80 నాటి ప్రభుత్వ ప్రకటన ప్రకారం)

ధరల పెరుగుదలకు తాను వ్యతిరేకమని ప్రభుత్వం ఎన్నోసార్లు ప్రకటించింది ధరలు పెంచుతున్న వ్యాపారస్తులపై ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాన్ని ఉపయోగిస్తానని కూడా ఎన్నోసార్లు చెప్పింది. ధరల పెరుగుదల నరికట్టడం అనే ముసుగులో అణచివేత చట్టాలనెన్నిటినో ప్రవేశపెడుతూ, ఇంకోవైపు ఆ ముసుగు కూడ లేకుండా ధరల పెరుగుదలకు నిరసన తెలుపుతూ జరిగే ఉద్యమాలను అణచడానికి ఇంకా కొన్ని అలాంటి చట్టాలనే ప్రవేశపెడుతోంది. ఈ ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాలన్నీ ఉగాది కానుకలుగా కాంగ్రెస్ పార్టీకి పెద్ద మొత్తాలలో చందాలిచ్చిన బ్లాక్ మార్కెటీర్లను విడుదల చేయడంగా, ధరలకు వ్యతిరేకంగా పోరాటంచేసే కార్మికనాయకులను, విద్యార్థినాయకులను, తదితర ప్రజాకార్యకర్తలను నిర్బంధించడంగా కొనసాగడం మనకు కొత్తకాదు. జాతీయ భద్రతాచట్టం ఆర్డినెన్స్‌గా వుండగానే లక్షలాది ధన్‌బాద్ కార్మికుల ప్రియతమ నాయకుడు ఎ. కె. రాయ్ ఎందుకు అరెస్టు అయ్యాడో, నాసిక్, అహ్మదాబాద్ మొదలైన ప్రాంతాలలో రైతాంగంపై దమనకాండ, కాల్పులు ఎందుకు జరుగుతున్నాయో ఈ ప్రభుత్వ స్వభావం తెలిసిన ఎవరైనా సులభంగానే అర్థంచేసుకోగలరు. ధరలు దించడానికి కాదు, దించమని ఆందోళనచేసే ప్రజలపై ప్రయోగించడానికి మాత్రమే ఈ ప్రభుత్వందగ్గర చట్టాలూ, ఆయుధాలు వున్నాయి.

(రథా, బిజినెస్ ఇండియా, ఫాక్ట్స్ ఫర్ యు, ఈనాడు పత్రికల ఆధారంగా.

మళయాళీ కవిత

స్వేచ్ఛ

సచ్చిదానందన్

వార్తా పత్రికలు చదివే వాళ్ళందరూ
ఇక మనం నిర్భయంగా తిరగొచ్చునంటారు;
ఫైళ్ళ కిందా, బడ్జెట్ల కిందా
దాగివున్న రక్కసి వికారపు తోకను వాళ్ళింకా చూడనేలేదు.
అదే సమస్య

తెల్ల షేర్వానీల మనుషులు
కవిత్వం నిషేధించబడని నూతన యుగం వచ్చిందంటారు;
కవిత్వం గొంతు ఊపిరాగి పోయేదాకా నులిమేయబడ్డవాళ్ళ
అక్షరాకృతి ధరించని నిట్టూర్పులను వాళ్ళింకా విననేలేదు.
అదే సమస్య.

రంగుకళ్ళద్దాల మనుషులు ప్రజాస్వామ్య విజయోత్సవంచేసుకుంటారు
పూజారీ, జమీందారూ చేయీ చేయీ కలిపి నడుస్తారు
పోలీసులూ జడ్జీ కళ్ళు కలుపుకుంటారు.
గుత్త పెట్టుబడిదారు వడ్డీ వ్యాపారిని రాత్రి భోజనాని కాహ్వానిస్తాడు.
పిచ్చి స్త్రీ నిద్రలేకుండా వాడలు తిరుగుతూ వుంటుంది.
శవమూ, చుట్టూ ముసిరిన ఈగలూ పేవ్‌మెంట్ మీదనే వుంటాయి.
చెవులు మూసుకొని పక్కకు తొలగిపోతాయి.

ముసుగు సరిపోయింది, బాగుంది-
కాని ముఖం సంగతేమిటి ?
నీ తాబేదార్లందరికీ వాళ్ళ వాళ్ళ వాటాలందినాయి, బాగుంది-
కాని జనం సంగతేమిటి ?
నువ్వు రాసే స్వేచ్ఛను తిరిగి పొందావు, బాగుంది-
కాని, పాఠకులకు వాళ్ళ అక్షరాలు నేర్పే వాళ్ళెవరు ?
పోయిన ప్రతిష్టను నువు తిరిగి పొందావు, బాగుంది-

కాని చనిపోతున్న శిశువుకు ఆహారం దొరికేదెప్పుడు ?
అదీ సమస్య.

లెక్కలింకా అబద్ధాలాడుతూనే వున్నాయి.
భూతం ఇంకా మారు వేషంలో తిరుగుతూనే వుంది
ప్రశ్నించే ధైర్యం కలిగిన వాళ్ళింకా జైళ్ళలో మగ్గిపోతున్నారు.

ఇంకా నువు బ్రాహ్మణ న్యాయస్థానం
మహర్[1]కు న్యాయం కొలిచి ఇస్తుందనుకుంటావు.
ఢిల్లీ గాలికబుర్ల దర్బారు
ఆకలిగొన్న సంథాల్[2] కోసం విప్లవ బిల్లును
ఆమోదిస్తుందనే ఆశిస్తావు.

హర్యానా రైతులు, కాన్పూరు మోచీలు
బీర్భూం గిరిజనులు బీహార్ గనిపనివాళ్ళు
నీ ప్రజాస్వామ్యాన్ని నీ కిచ్చారు.
నువు వాళ్ళకు తిరిగి ఏం ఇవ్వబోతున్నావు ?
ఎద్దుల జతనా ?
వద్దు- వాళ్ళడిగేది మొత్తం భూమి.
బోనస్ పెంపుదలా ?
వద్దు - వాళ్ళడిగేది మొత్తం కార్ఖానా
పలక ముక్కనా ?
వద్దు - వాళ్ళడిగేది మొత్తం సంస్కృతి.
నువు వాళ్ళకు పాటలిస్తానంటావు
కాని పెట్టుబడేదీ ?
అదీ సమస్య.

పెరికి వేయబడ్డ రక్తసిక్త నేత్రాలు మనను కనిపెడుతున్నయ్.
కొరడా దెబ్బతిన్న వీపు మనముందు కొండలాగ నిలబడుతుంది
నరికి వేయబడ్డ బొటనవేలు
ఇంకా ట్రిగ్గర్ కోసం వెతుకుతోంది[3].

అయ్యా
స్వేచ్ఛ దుకాణం కాదు
ఒక 'మహాత్మాజీ' ప్రారంభించడానికీ
ఒక 'మాతాజీ' మూసివేయడానికీ
ఒక 'పితాజీ' మళ్ళీ తెరవడానికీ
స్వేచ్ఛ
దుకాణం కాదు
వర్గాల కావల విశాలాకాశం వినిపించే సంగీతం స్వేచ్ఛ
హిమాలయాల కంటె బరువైన మరణం స్వేచ్ఛ
పసిఫిక్ కంటె లోతైన బతుకు స్వేచ్ఛ

ఇది నీకసలే అర్థం కాదు
అదే సమస్య
స్వేచ్ఛ, అవును స్వేచ్ఛే సమస్య.

1. బీహార్‌లో హరిజనులు.

2. బీహార్ బెంగాల్‌లలో ఒక గిరిజన తెగ.

3. ఈ నాలుగు చరణాల్లో ప్రస్తావించబడిన మృతవీరుడు కామ్రేడ్ వర్గీస్.

ఎమర్జన్సీ తొలగిపోగానే 'దేశాభిమాని' అనే సి పి ఐ ఎం మలయాళీ సాహిత్య పత్రికలో ఈ కవిత ప్రచురించబడింది. 1980 ఆగస్టులో సి పి ఐ ఎం నాయకత్వంలో వున్న వామపక్ష ప్రభుత్వం పీపుల్స్ కల్చరల్ ఫ్రంట్‌కు చెందిన సచ్చిదానందన్‌ను, మరి ముగ్గురు కవులను అరెస్ట్ చేసింది. ఈ అరెస్టులను ఖండిస్తూ కేరళలోని ప్రముఖ కళాకారులు, రచయితలందరూ మళ్ళీ ఒకసారి 'అవును స్వేచ్ఛే సమస్య' అన్నారు. ఇంగ్లీషుఅనువాదం ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంఘం (సి పి డి ఆర్) బొంబాయివాళ్ళు వెలువరించే 'రక్షా' అక్టోబర్ '80 సంచికలో ప్రచురించబడింది. (ఇంగ్లీషు నుంచి : వేణు)

బెంగాలీ కవితలు

జైలు కటకటాలు పట్టుకొని

ధూర్జటి చటోపాధ్యాయ

బతుకు నుంచి అపహరించ బడిన
నీ కొడుకు ప్రియమైన ముఖాన్ని
ఆకారం లేని మాంసం ముద్దలో నుంచి,
మూలుగుల, ఎముకల, రక్తమాంసాల లోతుల్లోంచి
పోల్చుకోవడానికి
ఇంకా జైలు కటకటాలు పట్టుకు నిలబడ్డ తల్లీ !
అమ్మా !
నీ రక్త మాంసాలు పంచుకు పుట్టిన శిశువును గుర్తిస్తావా ?
నువు నవమాసాలు మోసిన నీ కొడుకు
శవమేదీ ?
అమ్మా !
నువు విడిగా ఎవరి నేరుకుంటావు ?
వాళ్ళందరిలోనూ ఒకే రక్తం ప్రవహిస్తున్నది.
వాళ్ళందరూ ఊపిర్లు పోసుకున్నదొక చే గాలితో
వాళ్ళందరి విశ్వాసమూ తుపాకి మందులో ప్రజ్వలిస్తున్నది.
వాళ్ళు ఒకే బతుకును పంచుకుంటున్నారు.
నెత్తుటి సముద్రంలో పడివున్న
వాళ్ళంతా
ఇంకా ఈ నేలతల్లి బిడ్డలు.
నిరుపేద తల్లీ !
జైలు కటకటాలు పట్టుకొని
ఎవరి ముఖాన్ని ప్రత్యేకంగా గుర్తిస్తావు ?

ధూర్జటి చటోపాధ్యాయ విద్యార్థిగా వుండగానే సి. పి. ఐ. ఎం. ఎల్. లో చేరి బీర్భూం జిల్లా గ్రామీణప్రాంతాల్లో పని చేసి 1972లో వీరమరణం చెందాడు.

(ఇంగ్లీషు నుంచి అను: వేణు)

నా స్వేచ్ఛ పిలుపు

ద్రోణాచార్య ఘోష్

ఆకాశంలో, గాలిలో
రైతులు, శ్రామికుల మధ్య
నా స్వేచ్ఛ పిలుపు ఎగురుతోంది.

నా స్వప్నపు రంగు ఎరుపు.
నా పెరుగుదల లోనే
అణచివేతను చీల్చి వేసే సమయం ధ్వనిస్తుంది.

నా జీవితం
ఈ బాటల్లో, కొండల్లో, పొలాల్లో
నిత్యమూ ఉజ్వలంగా వెలుగుతూ వుంటుంది.
పెరుగుదలతో మహోజ్వలమై
నా గుండెల్లో గూడు కట్టుకుంటుంది.

నిశ్చలమైన సంవత్సరాలను తోసిపారేస్తాను,
పాత అద్దాన్ని విసిరి పారేస్తాను-
ప్రప్రథమ విముక్త క్షణం
స్వచ్ఛమైన ఆకాశంలో, గాలిలో ప్రకాశిస్తుంది.

ద్రోణాచార్య ఘోష్ కవి, రాజకీయ కార్యకర్త కూడా. సిపిఐ ఎంఎల్ హుగ్లీ జిల్లా శాఖ నాయకుడు. ఘోష్ 1970లో హుగ్లీ జైలు సంఘటనలో వీరమరణం పొందాడు.

(ఇంగ్లీషు నుంచి అను : వేణు)

తిరుగుబాటు

పెద్దకథ

ఎస్. రాములు

"అయ్యా! దేశంగాని దేశం వచ్చినం. రాజ్జెంగాని రాజ్జెం వచ్చినం. మీరుగాదంటే మాకు దిక్కెవరిడ!

దండం బెడ్తం దొర! ఈ లచ్చిని దావకాన కన్న తోల్కపోన్రి, ఎన్ని పైసలయితె అన్ని పైసలు మాకిచ్చెటాంట్ల వట్టుకోన్రి. లేకపోతె గాడి కిరాయి మందమన్న పైసలియ్యున్రి. దాన్నింటి కాడికి తోలేత్తం" ఆవేద నగా అడిగిండు అయిలయ్య.

"ఎవరుగూడ సావు రావాలని ఒగలు పెడ్తరు సారు! అది మూన్నెల్ల పసిదాన్నెత్తుకోని మట్టి మోత్తె, నిన్న కాల్వల జారి అడ్డంబడ్డకాన్నుంచి దాన్నడుమిరిగినట్టున్నది కడుపంత పిసుకుతంది. మీరు సూసుకుంటగుడ గిట్ల దయలేకుంట మాట్లాడ్తున్నరు" కండ్లల్లో నీళ్ళు తిరుగంగ జాలిగా అడిగిండు సాయిలు.

"అరేయి! బాగా మాట్లాడుతున్నరేందిర! అది యింతగనం ఏపాటి పనిచేసిందిర. ఇప్పటి దాకా దాని మొగడు అదీ పనిచేసినయి కల్సి వాళ్ళ కిచ్చిన అడ్వాన్సు మందం గూడ కాలేదు.

అయినా! మీతోని వాదన నాకెందుకుర. నేను మిమ్ముల తోల్క రాలేదు. నేను మీకు అడ్వాన్సు యియ్యలేదు. మిమ్ముల తోలుక వచ్చిన ఎల్లయ్య మీ ఎదురుంగనే ఉన్నడుగదర ఆన్నే అడుక్కోన్రి." గర్జించిండు, ఏజెంటు.

"అయ్యా! నీ కాల్మొక్త! నన్నడుగుమంటున్రు మీకు తెల్వనిదే మున్నది. నేను ఈల్లతోటి ఈల్ల తీర్గనే పనిచెయ్యవట్టి. గరిబోన్ని దొర. మీరిచ్చిన అడ్వాన్సు పైసలు ఈల్లకే తోల్కరాంగ యింటికాన్నే యిచ్చేస్తి. ఇగ నాదగ్గరేడున్నయి దండం బెడ్త.

జతకు నాల్గు వందలు అడ్వాన్సిత్తి. ఈడికి తోల్కవచ్చిన బడికి రాయి నూరాయె. మీరిచ్చిన పదివేల రూపాలు నలుపై మందికి అడికాడికే ఆయె. ఇగ నాదగ్గరేడున్నయి పైసలు. ఇపుడు అల్లకేమయిన కర్సయితే పెట్టుర్రి. నా ఖాతాల రాసుకోర్రి సారు. నాకు పగారిచ్చేటప్పుడు పట్టుకుందురుగని." మేస్త్రి ఎల్లయ్య అశక్తతతో ఉసూరు మన్నడు.

"నీకు బియ్యం ఉద్దెర యిప్పిచ్చుకుంట, బీడీ కాడీ లిప్పిచ్చుకుంట, అడ్వాన్సు లిచ్చుకుంట జేస్తె యిప్పటికే నువు లేబరుతో చేయించిన పనికంటె ఎక్కువ తీసికొన్నవు.

పదిహేను వేల రూపాల దాక నీ పేరు మీద ఖాతా అయింది ఇంతగనం ఎన్ని యూనిట్ల పనిచేయించినవుర నువ్వు? అంతగోస్తె నువు జేయించింది పన్నెండు వేల రూపాల పనిగాదు ఈడికే నీ పేరిట మూడు వేల రూపాయ లెక్కువ ఉన్నట్టు ఇంకేడికెల్లి వస్తయిర!

అల్లతోటి పని చేయించుకొంటున్నవు లాభం వచ్చినప్పుడెవరికిస్తవుర? లాభం తినేటోనివి కొద్దిగనన్న స్వంతం కర్చుపెట్టుకోవాలె. ఏమ్నించన్న తీస్కొచ్చి కర్చుపెట్టుకోవాలె. ప్రతిదానికి నన్నడుగుతే యిదేమన్న ఖజానను కున్నవ?" అన్నడు ఏజెంటు.

"మీరే గట్లంటె ఎట్ల సారు? మీరు చెప్పింది పెద్దొర కాదనడు. మీరడుగుతె పెద్దొర తప్పక యిస్తడు. మీరు తలుసుకున్నంక పైసలకు కొదు వెక్కడిది సారు? మళ్ళీ అన్నడు ఎల్లయ్య మేస్త్రి.

"అరేయి మీరు గిట్లనే అనుకుంట కూర్చుండుర్రి. నేనీడ మీకు చెప్పు కుంట కూచుంటే ఆడ పని వంటది, పెద్దొరకు తెలిస్తె అందరి పనైతది. సప్పుడు జేక పనిజెయ్యి పోండి" అంటూ షెడ్డులోపలికి వెళ్ళిపోయిండు ఏజెంటు.

కాల్వ మీద ఇటువంటి ప్రమాదాలు జరగడం, వాళ్ళకేమీ సాయం అందకపోవడం మామూలుగా జరిగే పనే. టిప్పర్ డ్రైవరు సురేందర్ నిస్స హాయంగా, సానుభూతితో జరుగుతున్నదాన్ని చూస్తున్నాడు.

★ ★ ★ ★

"అడ సక్కగ పన్దొరుకుతలేదని ఈడికత్తె వానియవ్వ కొంగపియి కోసం కాసికచ్చినట్టాయె నేంర ?"

"వానియవ్వ అదేదో సర్కార్ వోపిత్తన్న కట్టని కూలెక్కువని ఆరం పదిరోజు లెనుకెనుక దిరిగి తోల్కచ్చెగదర మేస్త్రిగాడు."

"బాకీలు బాగున్నయి అంటె అడ్మాసిత్త బాకీలు గట్టుకోని రాన్రి అని తోల్కచ్చి గిట్ల జేసెనేంర."

"తోడేలు పంజనుంచి పులిపంజా కిందకచ్చినట్టాయె."

"మనూళ్లె మట్టిపని కోతె, బాయిలు దవ్వవోతె ఏమన్నయితె దొర లెట్ల మాట్లాడ్తరో అంతకన్న కడయానం మాట్లాడెనేంర?"

"ఆడి కంటె జులుం ఎక్వ. మనూళ్లె కంటె ఎక్వ దోత్తాన్రు ఈడ" మనూళ్లె బాయి దవ్వవోతె రోజుకాన్రూపాలు. ఆడోల్లకు రోజు మూన్రూపాలు. ఈడ రోజెనిమిది మా లెక్క గట్టిత్తరట గని అయితే ఏందె? అక్కన్నే మొ పదిగొట్టంగ పనికోయి నడుమ అద్దగంట సద్ది దిని అయిదు గొట్టం గనే యింటికత్తిమి."

"ఈన్నే మొ పొద్దున లెవ్వంగ పని కెక్కుతె పొద్దు గూకె దాక పని మీది కెల్లి దిగేది లేదాయె వాని యవ్వ"

"ఈడ ఆడి కంటె గూడ కూలి గిట్టుబాటు గాదు. ఈ మొరం బూములు దవ్వాలె. అడ రెండ్రోజులు జేసే పని ఈడ ఒక్క రోజులనే చెయ్యమంటున్రి."

"తిండేమొ తొమ్మిది గొట్టంగోసారి, పగటీలి రెండు గొట్టంగోసారి పొద్దుగూకి పనిమీది కెల్లి దిగినంకోసారి మూడుసార్లు మావెట్టవట్టిరి గని ఏం తిండే అది? పసులుగూడ దినయి. పేరుకు పెట్టేది అన్నమేగని గోదుమల గుడా లోలె మొద్దులకు మొద్దులుంటయి మెతుకులు. అసలు గంత దొడ్డు బియ్యం యాడ వండిత్తరో గని ఈ జన్మల జూల్లేదే అవి మనకోసం పెశాకం సర్కారు బందర్ల వడ్ల యిత్తునలదీసినట్టున్నదే" అన్నడు నర్సయ్య పొగ పీల్చుకుంట.

"వాని యవ్వ ఈ అన్నం కన్న జొన్న కూడు నయం. థు!" అన్నడు అయిలయ్య కాల్చిన బీడి ముక్క బూకేసిరాసి కాండ్రిచ్చి తుపుక్కున ఊంచుకుంట.

"మరి యిగ దాంట్ల వోసె కూర గొంత కమ్మగుంటందా వానియవ్వ కూరంటే ఏం కూరనే అది బానెడు నీల్లల్ల చింత పండు పులుసు పిసికి ఉప్పు

కారం గల్పి రోజదే మూడు పూటలు బొయ్యవట్రి. తాలింపా యేమన్ననా!" అన్నడు సాయిలు.

"పది యేను రోజులకో సారి పని బందు వెట్టి "మానుకం" అని కల్లు గుడాలు మాంసం మా వెట్టవట్రి. ఈడు ఎల్లయితే ఆనాడో గొర్రె పిల్ల గోత్తడు గని, అయితే ఏందె. పదిహేను రోజులు వేళ్క ఎందుక పోయెటంక ఏడ దినత్తది. ఏడ వత్తది."

"అయినా ఆ మాంసం పులుసుగూడ చింతపండు పులుసోలె ఉప్పుకారం వాసన దప్ప మసాల వాసన్నా యేమన్ననా?"

"గీ తిండికి మనిషికి మూర్రూపాలు కూలిపైపల్ల కెల్లి కోసుడేంది? రూపాయి తిండి గూడ గాదిది అంటె యింక సూర్రాదు! ఆకానికి రెండుసార్లు కూరగాయలు వెడ్తలేనా అంటడు."

"రోజ్జేసే బానెడు చింతపండు పులుసుల కిల బీరకాయలో టమాటలో ఏసి యిదేంది పెడ్తలేవా? అంటడు వానియవ్వ"

"ఈడు మనమచ్చెదాక ఎంతమంచిగ బుదిరి కిచ్చిండుర. మంచిగ పారవోపిచ్చె వత్తననెదాక మనెంబడిదిరిగె తోల్కచ్చేలారి ఆలిసెమైతె ఆ మూర్రోజులు రోజో గొర్రెను గోసి మంచిగ తినవెట్టె. ఈడగూడ గట్లనే తిండి వెడ్తనని.

ఆడ మనం పారదాగి పంకలుగొడ్తె ఆడు ఈడికిదెచ్చి ఆడ వెట్టిందానికి డబలుకు శబలు మనమీద తియ్యవట్టె అన్నాడు బాలయ్య.

"ఎహె! అసలు సంగతటువెట్టి పక్క ముచ్చట్లు మాట్లాడుతున్నరేంర. ఆ పనిదాన్ని లచ్చిని ఏంజేత్తామన్నది ముందు మాట్లాడుర్రి. పొద్దుగాల ఆడేమొ గట్లనె" అన్నది కనుకవ్వ.

"ఆరేయి! మెల్లగ మాట్లాడుర్రి. ఎల్లిగాడు గిట్ల, ఏజెంటు బంటుగాల్లు గిట్ల యిని ఆనికి జెప్పితె బొక్కలిరుగ దంతరు.''

అంతటితో ఆ గుంపు సంభాషణ గుసుసుడుగా మారింది. వెన్నెల గుంకింది. చుక్కలు మినుకు మినుకు మంటున్నై. వాల్ల ముచ్చట చుక్కలోలె అస్పష్టంగా మారింది.

* * * *

"ఏందిరా ! లం...కొడక ! బాగ మాట్లాడుతున్నవట.

మంచిగ ఎవల పని వాళ్ళు చేసుకొనేటోళ్ళకు ఏమేమొ జెప్పి పని చెడగొడుతున్నవేందిర కూసేగాడిదచ్చి మేసేగాడిదను చెడగొట్టినట్టు. మంచోల్లను చెడగొడ్తున్నవేందిర వచ్చి మూన్నెల్లు కాలేదుగని లావు మాట్లాడుతున్నవేందిర ఏండ్ల తరబడి నుండి గా పాలమూరోల్లు ఎట్లపని చేస్తుంద్రో సూడ్రి. అల్లుగూడ ఎనుకటి నుంచి మీ తీర్గగిట్ల మాట్లాడ్తె ఇగ కెనాల్సు కట్టిచ్చినట్టె. వాళ్ళు ఏండ్ల తరబడి నుంచి ఎవలు కిక్కురమనలేదు గని, మీరు నిన్న మొన్నచ్చి బాగ మాట్లాడుతున్న రేందిర? పాలమూరోన్ని ఒక్కొక్కన్ని తన్ను డెగాదు సంపుతె గూడ ఎవడడ్డం రాడు. ఎవరు కిక్కురుమనడు. 'అని తప్పేంలేంది అన్నెందుకు సంపుతరని సోంచాయించుకొని సప్పుడుజెయ్యకుంట తప్పుచేసినోని దగ్గరకే పోవద్దని ఊరుకుంటరు''

"ఇగ మీతీర్గ అల్లుజేత్తె ఈ ఖాక్రానంగల నుంచి నాగార్జునసాగర్ దాక ఎవరు కదుదుర్రా!

మీరు గత్తె అవి యింక నూరేండ్లైన పూర్తిగాకపోవు. పాలమూరు లేబరు ఎక్కువ దొరుకుత లేరని మిమ్ముల పిలిపిస్తే పని తక్కువై మాటలెక్కువైనయి మీకు! ఎన్నడులేంది ఏందేందో గూడుపుఠాని గడుతున్నరు. మిమ్ముల జూసి పాలమూరోల్లు నేర్చుకునేటట్టున్నరు.

దానికి గింతంత దెబ్బతాకిందో లేదోగని పార్టీలు గడుతున్నర్ర!

లం...కొడుకుల్లార! బాగదిను కుంట బలిసిపోయిందిర. మీకు అరేయి! మల్లయ్యా ఈ లం...కొడుకును పెడ్డులేసి తన్ను!"

బంట్లు చెరొక రెక్క పట్టుకున్నరు. ఏజెంటు ఈ చెంప ఆచెంప తన చెయ్యి నొప్పి పుట్టేదాక కొట్టిండు, ఎటు దొరికితే అటు తన్నిండు. వాళ్ళకప్ప జెప్పిండు.

ముక్తాయింపు విన్నంక తన్నడంలో మస్తు పొందనేర్చిన బంట్లు పెడ్డు లోపలికి తీసుకపోయి పొట్టుపొట్టు గొట్టిన్రు.

ఒకరి తర్వాత ఒకరికి వరుసగా అదే శిక్ష పడ్డది. అయిదుగురికి.

నర్సయ్య పండ్లల్లకెల్లి, చిదిమిపోయిన చిగుర్లలకెల్లి నెత్తురు కారికారి నోరంతా సార్కలైనయి.

కొంరయ్య నడుంబొక్క లిరిగినయి.

సాయిలు కడుపునొప్పితోటి గిలగిల తన్నుకున్నడు. గడ్డపారతోటి

పురుసోల్ల మీద పొడిసినట్టయి సోయిదప్పి వేయిండు సాయిలు.

అయిలయ్య తొంటి కదిలింది నిలబడలేక అడ్డంబడితే తల పగిలింది.

ఇంత జరిగిందానికి సాక్ష్యంగా ప్రకృతితోపాటు టిప్పరు నానుకొని సురేందరూ మవునంగ ఊరుకున్నడు చూసుకుంటగూడ.

మేస్త్రి ఎల్లయ్య జైలర్‌లా సైటుకాడ నిలబడి ఒకరి తర్వాత ఒకర్ని షెడ్డువైపు పంపించింది గమనించుకుంటనే ఉన్నడు సురేందర్.

మిగతోల్లను పనిమీది కెల్లి కదిలితె తంత అన్నట్టు మెలికలు తిరిగిన కండలతో మీసాలు మెలేసి గుడ్లెర్రజేసి సైటు మీద నిలబడితె దోపిడిదారు కావలి కుక్కోలె కనిపించిండు ఎల్లయ్య సురేందరుకు.

మిగతా యూనిట్ల లేబరు రోజూవలె తమకేమి పట్టనట్టు పనిచేస్తుండడం చూసి, వాల్లు తెలిసినా మరో కన్నీరుబొట్టు విడవడం తప్ప ఏంచెయ్యలేదు గదా అనుకొన్నడు సురేందరు మళ్ళీ.

"డ్రైవరు సారు! మీకు పుణ్యముంటది! మీరు టిప్పరు మీద తాలుకకే పోతున్నట్టున్నరు గద! కొంచెం మమ్ముల్ల గూడ తోల్కపో రాదుర్రి"

"మీరు కొంచెం తొవ్వ ముంగటికి సాగి గాతుమ్మచెట్టు కాడ నిలబడండ్రి. అక్కడ మిమ్ముల్ల నెక్కించుకుంటను దావకానకు కూడ తీస్కపోత! ఎట్లన్న జేసి కొంచెం ముంగట నడువుర్రి. ఏజెంటుకు తెలిస్తె బాగుండదు"

"అట్లనె! అయ్య"

"నేను షాకాయిల్ కోసం పైసలు దీస్కాని వస్త. ముందుగాల నడువుర్రి మీరు."

"సరె మంచిదయ్య!"

రాత్రిపూట సర్కారు దావకాన బందున్నది. సురేందరు బొయిల కట్టెలు జోకి టిప్పర్ల వేయమని చెప్పి, ఉదయం గాయపడ్డవారిని ప్రయివేటు డాక్టరుకు చూపించిండు.

ఇంజక్షన్లు యిచ్చిండు డాక్టరు. బయట కొనుక్కొమ్మని రాసిస్తె మందులకు పైసలు లేవన్నరు లేబరు.

తన వద్ద ఉన్న పన్నెండ్రూపాలు గాక యింకా ఎనిమిది రూపాలెక్కువ అయింది మొత్తం బిల్లు

ఎనిమిది రూపాల మందం 'షాకాయిల్' తక్కువ తీసికొన్నడు సురేందరు

టిప్పరు నడుస్తూనే ఉన్నది. క్యాబిన్లో కూర్చోబెట్టుకుని సురేందర్ వాళ్ళతో మాట కలిపిండు.

"ఏం జెయ్యమంటరు సారు! నిన్న గీ పసిదాన్ని దవాకానకు తోల్క పొమ్మంటే గట్ల మాట్లాడె యియ్యాల పొద్దుగాల మమ్ముల గిట్ల యిష్ట మున్నట్టు గొట్టె

ఇగ యింక మీదికెల్లి దావకానకు తోల్కపోన్రని అని ఎట్లడుగు మంటరు! మీరె జెప్పున్రి.

"ఏమనలేక నోరు మూసుకున్నం. ఏ జెయ్య త్తది"

"గిట్ల దెబ్బలకు భయపడ్తె ఎట్ల! కొంచెం దైర్యం దెచ్చుకోవాలె.

అడు మీరు గిట్ల భయపడాల్ననే కొట్టె. మీరు భయపడి ఊకుంటె వాడనుకున్నది జరిగినట్టెగద. వాడు మీ మీద యింకింత జులుం చూపిస్తడు గిట్ల ఊకుంటె

అసలు మీరు గీ చుట్టుపక్కల పల్లెలు చూల్లేదా! ఒక్కొక్క పల్లెల ఎట్ల జరుగుతాంది. ఏం జరుగుతాంది, యిన్లేదా.

అవన్ని యింటె అయ్యో! మేం పడే కట్టం ఏ పాటి అనుకుంటరు గావచ్చు మీరు.

ఈ సుట్టు పక్క ఊల్లల్ల దొరలు గిట్లనే జులుం చెలాయించిన్రు మొన్న మొన్నటి దాక.

కూలీలు, పాలేర్లు అందరు ఏకమై పనులు బందు వెట్టిన్రు. పనులు బందు వెట్టినని కోపంతోటి పెద్దరైతులు దొరలు, వాళ్ళ గుడిసెలు గాల వెట్టిన్రు.

రౌడీలకు బాగా దాగిచ్చి రాత్రికి రాత్రి పట్నం నుంచి పిలిపిచ్చి కూలీల కొట్టిచ్చిన్రు.

వాళ్ళను పోలీసులకు వట్టిచ్చిన్రు. దొంగతనాలు నేసిన్రని కేసులు బనాయిచిన్రు ఆఖరికి ఊల్లెనే పోలీసు క్యాంపులు వెట్టిచ్చుకున్నరు.

సిన్నది సేనోసెలుకో ఉంటె అండ్లకు గొడ్లను దోలిచ్చి మేపిచ్చిన్రు. అల్లు దెంకపోతె అల్ల గొర్లమ్ముకున్నరు పోలీసులు దిన్నరు. దెంకపోయి నోల్ల ఆడోల్లను చెరవట్టిన్రు.

అయితె మాత్రం వాళ్ళు ఊకున్నరా!

దొరలకు, పోలీసులకు చాకలి, మంగలి పని బందు వెట్టిచ్చిన్రు

మీరు ఎంతనన్న మొత్తుకోన్రి. ఏమన్న జెయిన్రి. మమ్ములను మర్యాదగ సూడకుంటె వాకు కూలీలు పెంచకుంటె తెడ్డన్న పని జెయ్యం" అని పట్టిన పట్టు యిడువకుండ నిలబడ్డరు.

దొరలసేన్లు, సెలుకలు పొలాలు సూసెటోడులేక సేసెటోడులేక పాడయి తాంటె దేవుడానుకుంట దిగివచ్చిన్రు దొరలు.

రచ్చబండ కాడికి పిలిపిచ్చి మాట్లాడిన్రు. పడికో ఓకాడికి కూలీలు పెంచిన్రు. గిపుడుగిపుడే జులుం యిడిసి వెట్టిత్తున్నరు.

"మీరు గూడ గట్లనే భయపడద్దు నిన్నటోలె ఎదురుబడి అడ్గాలె" అన్నడు సురేందరు.

"కాని రాజైమ త్తిమి! యిక్కడ మా కెనలేర్పాటు ఏదన్నగిట్లనే ఆపద త్తె దిక్కులేని పచ్చులమైతిమి ఎవలకు చెప్పుకునుడు" అన్నరు వాళ్ళు

"అట్ల అనుకోవద్దు అ కూలీలు. పాలేర్లు అంతా మీ అసోంటోల్లె గదా మీకు మద్దతుగ ఉంటరు ఏదన్న జరిగినట్లు తెలిస్తే"

"అదీగాక అల్లకే యింక ఎక్కువ కష్టం మీకేంది. మీకు ఈడ యిల్లా! ఈర్వాటమా! మాపోతె పనిపోతది. యింతపని యింకోకాడ దొరకదా! మనరెక్కలు సల్లగుంటె ఏడైనా చేసుకోవచ్చు"

"మీరన్నది నిజమేననుకోండ్రి కాని..." అలా అరగంట గడిచింట్లుంది. మాటలోనె టిప్పరు సైటు పొలిమేర చేరింది. తుమ్మచెట్టుకాడ వాళ్ళను దింపి ఏమీ తెలియనట్లె టిప్పరు షెడ్డుకేసి దూసుకుపోయింది

సురేందరు మాటలు మనుసున నింపుకున్న లేబరు అక్కణ్ణించి తమ గజంనర ఎత్తున్న తడుక గుడిసెలవైపు నడిసిన్రు సీకట్లో మెలమెల్లగ.

విశేషాల్లేని రోజులను వారం కొలబద్దతో కొలిస్తే ఒకసారికే మరొక మరక వంటి సంఘటన జరిగింది

రాళ్ళకు బత్తీలు పెట్టుటానికి పొక్కలుగొట్టంగ పాలమూరోళ్లిద్దరికి ఎదురు తిరిగిన గడ్డపార పొదంలోకి దిగింది.

పైకి లేసిన లావాలా రక్తం విరజిమ్మింది. నిలువెత్తు నల్లని విగ్రహాలు శవాల్లా పడిపోయిన్రు.

ఏజెంటు బంట్లు ఈ వార్త తేంగనే షెడ్డుబయట కుర్చీలో కూర్చుండి యింగ్లీషు పత్రిక చూస్తున్నాడు ఆమాత్రం లేసి షెడ్డులోపలికి పోయి మంచం మీద ఏందెల్వనోనోలె ఒరిగి పన్నడు.

"ఒరేయి మల్లయా! అయిడిన్ సీసా అవుతలనే ఉంది. నన్ను లేపకు" అన్నడు

అయిడిన్‌తో ఆగేదా? ఆ గాయం!

ఏజెంటుకు తెల్వకుండ అందుకే సురేందరు సాయం కోరిన్రు.

సురేందరు ప్రభుత్వ దావకాన్ల పట్టిగట్టిపిచ్చి, యింజక్షన్లు, కొన్ని తెల్లి గోలీలిప్పిచ్చి ఏకో పనిమీద వోయిన అదే టిప్పర్ల క్యాబిన్ల కూర్చుండవెట్టుకోని మాటగలిపిండు.

రాయలసీమ వాల్లతో లాగనే వీల్లతో గూడ మాటల్ల కల్సిపోయిండు.

"అహాఁ! మీరు గదేం బెట్టుకోకున్రి. నేను వాని చేతి కింద పనిచేత్తున్నది నిజమే గని నన్ను వాని మనిషనుకోకున్రి.

నేను గూడ మీ తీర్గనే కడుపు చేతవట్టుకోని దిక్కులేక ఇక్కడ జీతమున్న." వేగంగ వెళ్ళుతున్న టిప్పరు చప్పుడులోనే మాటలు కలిపి మాట్లాడిండు సురేందరు.

"ఏం చదువు కున్నరు"

"ఏంజదువుతె మాత్రం ఏమున్నది. ఎంత చదివినా డబ్బున్నవాని చేతి కింది శానిస కొడుకులం."

"మీరు సూడవోతె బాగనె సదువుకున్నట్టున్నరు. ఏమనుకోకపోతె చెప్పరాదున్రి"

"అనుకునేదేంది గని చెప్పుకునుటానికి నాకే సిగ్గనిపిస్తాంది బియస్సే చదివిన"

"గంత సదువు సదివి మీరు సెప్పుకునుటానికి సిగ్గుపడవట్టిరి...మీరెందుకు సిగ్గుపడాలె.

మీకు గంత సదువు సదివినంక గూడ కొలువియ్యని ఆ సర్కారు సిగ్గు పడాలె...మరి యీ పని ఎప్పుడు నేర్సుకున్నరు."

"మా నాన్న లారీ డ్రైవరు పనిచేస్తుండె. అప్పుడప్పుడు నాన్న వద్దన్నా ఆటలా గమ్మతుగ నేర్చుకొన్న డ్రైవింగు మానాన్న లారీబోల్తా పడి చనిపోయినంక మానాన్న వద్దన్న పనే బ్రతకటానికి అక్కరకు వచ్చింది.

ఆర్టీవో ఆఫీసుల అయిదునూర్లు మామూలిచ్చి డ్రైవరు లెసెన్సు తీసికొన్న.'

"అయ్యో! పాపం! మరి మీ తండ్రి సచ్చిపోతె లారోడన్న, సర్కరోల్లన్న ఫండో అదేదో మీకేమన్న యియ్యలేదా ఇత్తె దాంతోటి ఏదన్న దంద చేసుకోవత్తుండె గద"

"లారోడు సర్కరోల్లు మనకెందు కిస్తరయ్యా! లారీ పాడైందని లారోడు యిన్సురెన్సు కంపెనీకి చెప్పుకుంటే వానికి కొత్తలారి కొనిచ్చింది పాతలారీ తీసికోని.

ఆ లారోడు పాతలారీని యిన్సురెన్సు కంపెనీ నుంచి తక్కువ ధరకు కొడుకుపేరు మీద కొని యిపుడు రెండు లారీలు నడిపించుకుంటాండు.

వాన్ని ఏమియ్యక పోతే మానెగని నన్ను డ్రైవరుగనన్న జీతముంచు కొమ్మంటె,

"మీ అయ్య జేసిన నిర్వాకం చాలు. ఇంక నిన్నుంచుకొని ఇగనేను బిచ్చమడుక్క తింట'' అని అన్నడు.

"నాయానికి కాలం లేదు సారు"

"... ... ..."

"మరి మీకు జీత మెంతిత్తుతున్నరు"

జీతం జోలిరాంగనే ఇన్నూట యాభై అన్నెప్పి మున్నూట యాభయికి సంతకం తీసికొని యిన్నూరు చేతిల పెట్టేది యాదికచ్చినట్టుంది సురేందరుకు.

"లంజకొడుకు తెల్లందాక పొద్దుందాక రికాంలేకుండ పని చేయించుకొని యిన్నూర్రూపాలిస్తడు. నానమ్మ తాత. మా అవ్వ, ముగ్గురు చెల్లెండ్లు

చిన్న తమ్ముడు గంపెడంత సంసారం ఏంజాల్తయి. ఈ ముసలితనాన గూడ మావ్వ బీడీలు జెయ్యవట్టె. పెద్ద చెల్లె యింట్లనే కుట్టుమిషను నేర్చుకుంట నెలకు అయిదో పదో సంపాయిత్తది ఈ కరువుకాలం ఎక్కడి పైసలు జాల్తన్నయి? ఓ పూటదింటె యింకోపూట ఉపాసమున్నట్లే గావట్టె''

"మీరే గట్లనవడితిరి. మాకైతె పసుల తిండివెట్టి దాన్కి సతెం పైసలు వట్టుకొని, చిల్లరకిచ్చినయి వట్టుకోని రోజుకు నాల్గు రూపాలే గద యిత్తన్నది.... ... ..."

వీరయ్య మాటపూర్తిగాక ముందే ఏజెంటుమీది కోపం యిటు దిప్పి అన్నడు సురేందరు.

"గిట్లంటున్ననని తప్పు వట్టకుం|డిగని, నిజంగ మీకు బుద్ధిలేదయ్యా! మొన్నగా రాయలసీమోల్లను ఏజెంటు, బంటుగాల్లు గంతగనం గొడ్తె మీరె వరు గూడ గిట్లేందని అడుగకపోతిరి. మీ పాలమూరోల్లను సావదన్నినా అడుగక పోతిరి ... ..." అంటూ సురేందరు పూర్తిగా కక్కక ముందే అందుకున్నడు గాలన్న.

"సదువు కున్నోల్లు అన్ని దెలిసినోల్లు మీరే సూసుకుంట సతెం ఏమనక పోతిరి. యిగ మామాలేంది చెప్పు|ని"

"నేనంటే నేను ... ..." తడబడిండు సురేందరు. తనలో తను సరాయించుకొని అన్నడు మల్ల.

"నేను ఎక్కువ తక్కువ మాట్లాడ్తె నన్ను నౌకర్ల కెల్లి తీసేయించి యింకోల్లను పెట్టుకుంటడు. మీ కట్ల గాదు గద. ఇపుడు చక్కగ లేబరే దొరుకుతలేదు. మీరు లేకపోతే వాని పనే బందువడె. మీరు జేస్తెనేగదా వాడు బతుకు తున్నది. గందుకోసం మీరేం మాట్లాడినా చెల్లది"

"... ... ..."

"వాడు మిమ్ముల నెంత దోస్తండో మీకే యేర్పాటు. |ప్రభుత్వం రోజుకు ఏడుగంటలే పని చేయించుకొని ఎనిమిది రూపాలియ్యాలంటె మీ తోటి రోజుకు పన్నెండు గంటలు పని చేయించుకొని నాల్గు రూపాలే యిస్తున్నడు."

"మాకు ఏజెంటుసారు కాదుగద పైసలిత్తున్నది. మేస్త్రి చిన రాజయ్య గద''

"చినరాజయ్యనే అనుకోని. అదంత చెప్తె పెద్దకత. అయినా మీకు కొంత తెలిసిందేగద. అసలు కంట్రాక్టరు వీడు గూడ కాదు. ఆ మధ్య నోసారి ఆకుపచ్చకార్ల రాలేదా! అగో వాడు. వాడు ఒక కిలోమీటరు కాల్వ దవ్వటానికి యాభైలక్షల రూపాయలకు గుత్త వట్టిండు. గుత్తవట్టిన పని చేయించుటానికని ఈ టెక్నికల్ ఏజెంటును జీతం బెట్టుకొన్నడు. వీడు యింజనీరు కోర్సు చదివిండని ఎనిమిది వందల జీతమిస్తున్నడు. ఇగ వీడేం జేస్తడంటే! లేబరు గుత్తెదారు మీ చినరాజయ్య మేస్త్రి అటువంటోల్లకు కంట్రాక్టరు తరఫున మీ లాంటి లేబరును తోల్కరమ్మని కొన్ని వేల రూపాయలు అడ్వాన్సు యిస్తడు"

"మరి అడ్వాన్సు పైసలు దీసికొని ఆడు రాకపోతెఎట్ల"

"అట్లగూడ ఒకోసారి జరుగుతదనుకో-అందుకే అడ్వాన్సు యిచ్చేటప్పుడు వెనకా ముందూ అన్నీ చూస్తరు. ఉత్తుత్తోల్లను నీలాంటోల్లను, నా లాంటోల్లను నమ్మడు. ఎట్ల నమ్మతరంటే మాటవరుసకు నువున్నవు. నువ్వీడపని చెయ్యంగ చెయ్యంగ మంచోనివని నమ్మకం గుదిరితె, నీకు పది మందిని మెప్పిచ్చే తెలివున్నదని అనుకొంటె నీకు తెల్వకుంటనే నీ ఊరు, చుట్టాలు, పక్కాలు, అన్నీ జాడదీసి తెల్సుకొంటడు. ఈ పనై పోయి యింకో కిలోమీటరు గుత్తవట్టినపుడు నిన్ను పిలిసి యాభయో నూరో లేబర్ను తోలుకురమ్మని గప్పుడు నీకు అడ్వాన్సు పైసలిస్తడు. నువ్వు నీకు తెలసిన ఊర్లు దిరిగి లేబరును తోలుకవస్తవు. ఆ లేబరు తోటి నువుగూడ పనిజేస్తవు. నీకు ఒక యూనిటు పనికి 150, 160 రూ॥లు లెక్కకట్టిస్తడు-ఇగ నువ్వు దాంట్లకెల్లి నీ లేబరుకు కూలిగట్టిస్తవు. గట్ల"

"గట్లనా! ఇగ గదంట్లనే పెద్దొర కొంచెమంత లాభం సూసుకుంటడన్నట్టు" అన్నడు వీరయ్య.

"కొంచెమంత అనవడ్తిరే దయ్యా! మొత్తానికి మొత్తం వాడేదింటడు. అన్నమంతదిని ఎంగిలి విస్తరిచ్చినట్టు, ఉన్న కాడికి నాకి మీకింత వాసన చూపిస్తున్నట్టు యిస్తడు. వీడు ఈ కిలోమీటర్ను యాభయిలక్షల రూపాలకు గుత్తవట్టిండు గదా! గుత్తెదారు ఈ కిలో మీటరు కాలువను నాలుగైదు రీచులుగ చేసిండు. ఒక్కొక్క రీచుకు భూమిగట్టిదనం, మెత్తదనం మీదికెల్లి యాభయి, అరువై వేలు అని లెక్కగట్టిండు. అంటె మొత్తం కిలోమీటరుకు నాలుగయిదు లక్షల కంటె ఎక్కువకర్చుగావు. ఇగ యాభయిలక్షల రూపాయల కెల్లి నాలుగయిదు లక్షలు! పోనీ పది లక్షలు కర్చయినయనుకున్నా నలభై లక్షలు మీదమీదనే మింగుతండు గుత్తెదారు. ఇది ఒక్క కిలో మీటరుకే."

"ఇగ ఈ ఏజెంటు ఈ రీచుల్ల యూనిటుపనికి యింతని కట్టిస్తడు. మీ చినరాజయ్య వంటి మేస్త్రీలు అయిదారుగురు కల్సి ఒక రీచు పని చేపిస్తరు. ఏజెంటు వీల్లకు లెక్కలుగట్టేటప్పుడు దొంగ లెక్కలు చేస్తడు. అదంత మింగుతడు. యూనిటుకు నూటరవయి అని రాసుకొని పదియిర్వై తక్కువ యిస్తడు. ఇట్ల చిన రాజయ్య అటువంటివాల్లు యిరువై మంది దాక ఉన్నరు. వాళ్ళందరి పేరు మీద ఎంతెంత మింగుతండో యిగ లెక్కెయ్యని''

"యూనిట్ల లెక్క చొప్పున పైసలు దీసికొని మీ మేస్త్రి మీకు కూలి గట్టిచ్చి మిగిలింది పని చేయించిందానికింద లాభమని ఉంచుకొంటడు."

"మరి పెద్దొరకు నలువై లచ్చలు ఎట్ల మిగులుతయి''

''ఆఁ! కరక్టే! అసలు మీరు ఒక రోజు పని చేస్తే గుత్తెదారుకు యిరువైదు రూపాయలనుంచి ముప్పయి రూపాయల దాక పనిచేసినట్టు. మీ మేస్త్రి లాభం కింద ఓ రెండు మీ కూలికింద ఎనిమిది కలసి బలికి పది రూపాయలు కర్చయితే మహా ఎక్కువ. ఇగ పదిహేను రూపాయలనుంచి యిరువై రూపాయలదాక ఒక్కొక్క లేబరు పేరుమీద ఒక్కొక్క రోజుకు సంపాదిస్తుండు. ఇపుడు ఈ కిలో మీటరు పనిమీద రోజు నాలుగు వందల మంది లేబరు పనిచేస్తున్నరు. అంటే వీల్లందరి పేరుమీద వాడు ఒక రోజుకే ఎనిమిదివేల రూపాయల దాక సంపాదిస్తాండు. ఇట్ల వానివర్కు రెండుమూడు చోట్ల నడుస్తాంది. అదేదో మంత్రట ఈ గుత్తెదారుకు చుట్టమట. ఆ మంత్రి వర్కు యిప్పిచ్చె పైరవి చేస్తే ఈ గుత్తెదారు ఎలక్షన్లప్పుడు ఆ మంత్రికి డబ్బు సాయం జేస్తడని వాళ్ళు వీళ్ళు అనుకోంగ విన్న.''

"అవ్వ...! అసలు పని చేసే మాకు ఆరు రూపాలు! కార్లకెల్లి కాలు కిందవెట్టకుంట అట్లచ్చి యిట్ల వోయెటోనికి గన్ని లచ్చల రూపాలు! హవ్వ! గిదేం సర్కారు! గిదేం నాయం!"

"గదంత గంగల వోనీరా! ఆడు మనం జేసిన కట్టం గంతగనం దినుకుంట గిట్ల దెబ్బలు దాకినపుడో, జరమచ్చినపుడో మందులన్న యిప్పియ్యడేందిర ఆడు? మందులిప్పితె యింతగనం ఎన్ని లచ్చలొడుత్తయిర! అని సంపాదన గాలిపోను,''

"నువ్వన్నది నిజమే. అసలు మీ కోసం ఒక డాక్టర్ను పెట్టుకోవాలని సర్కారు రూలున్నది. మీకు మందులు ఇప్పియ్యాలని కూడ ఉన్నది. కాని యిటువంటియన్నీ కాగితాల మీదనే ఉంటయి. మీకు మంచి తిండి వెదు

తున్నదీ లేందీ, మీ కోసం డాక్టరు ఉన్నదీ లేందీ, మందులిస్తున్నదీ లేందీ, సెలవులు యిస్తున్నదీ లేందీ యింజనీర్లు చూసుకోవాలె"

''ఇంజనీర్లంటే ఏదీ! మొన్న నల్ల జీబులచ్చి ఏజెంటు సారు తోటి మాట్లాడి సైటు జూసి పోయినోల్లు గాదు!'

"ఆఁ! వాళ్ళే"

"అల్లు మా దగ్గరి కన్న రాలేదు. ఎర్రోడున్నడు సూడు. అడు జీబు దిగిన కాన్నుంచి ముక్కుకాడ దత్తి అడ్డం పెట్టుకోని తాప తాపకు తుడుసుకున్నట్టు జేసిండు, మాదగ్గెర చెమట కంపు వాసనత్తున్నదనో ఏమో!''

"అల్లు పనెట్లా జరుగుతున్నదో అని సూసి అటు నుంచటే పోయిన్రు మమ్ముల మందలియ్యనన్న మందలియ్య లేదు.''

"వాళ్ళెందుకు మీ దగ్గర కత్తరయ్యా! వాళ్ళకేం పట్టి! వాళ్ళకు కూర్చున్న కాడికి వేలకు వేలు లంచాలు వత్తయి ఇగ వాళ్ళు అక్కన్నే కుర్చీల కూర్చుండి మీకు అన్ని సరిగ్గున్నయని రాసి సంతకం బెడ్తరు. అట్ల రాసి సంతకం బెట్టంది ఆ గుత్తెదారు బిల్లు పాసు కాదు. పైకం రాదు. మీకు మంచితిండి పెట్టినా పెట్టకున్నా లంచాలియ్యంది బిల్లు పాసు కాదు అందుకే యింకో వేయి రెండు వేలు ఎక్కువ లంచమిచ్చి అన్ని సరిగ్గున్నయని రాయించుకొంటడు గుత్తెదారు.''

''గిట్ల యింటోడే దొంగల్ల గలిస్తె యిగ ఎవలకు సెప్పుకునుడు''

"చెప్పుకునుటానికేది చాలా మందున్నరు. మీకు గిట్ల అన్యాయం జరుగుతున్నదని లేబరాఫీసరుకు చెప్పుకోవచ్చు కాని వాని ఆఫీసేడ ఉంటదో మీకేడ దొరుకుతది ఎట్లన్న జేసి జాడదీసి దొరికిచ్చుకున్నరనుకో! వాడుమాత్రం సత్తెపూసనా! వాని కింత లంచమిస్తె వాడుగూడ మంచిగనే ఉన్నదని రాసుకొని చప్పుడు జేక పోతడు"

''ఇగ ఎట్ల"

''గందుకనే మేం గిట్లవడి సత్తన్నం ఎవనికి జెప్పుకుంటె ఏమత్తదని.'' సమర్థించుకొన్నడు గాలన్న.

"అంహాఁ! గట్లనుకుంటె ఎట్ల! అడుగాలె కొట్లాడాలె. మీరందరు కలిసి కట్టుగ నిలబడాలె. మీరందరు కలిసికట్టుగ నిలబడితే మిమ్ముల నెవడేం బీక లేడు. మీరు పనిజేత్తున్న సైటు దగ్గర్ల ఉన్న పల్లెల్ల జూడున్రి... ... ..." ఇంక బొగ్గు బాయిలల్ల జూడున్రి - ఏవన్న అన్యాయం జరిగితె ఎట్ల పని బందు వెడుతరో? ఆ బొగ్గు బాయిలల్ల మీకు తెలిసినోల్లు గూడ ఎవలన్న పని జేస్తుండొచ్చు. వాల్లనుగూడ యింక అడిగి తెలుసుకోన్రి. మొన్న కొన్ని రోజుల కింద కూలీలు పెంచాలని, బొగ్గు గూలి బాయిల చనిపోయినోల్లకు నష్టపరిహారం పెంచాలని పని బందు వెట్టిన్రు. అట్ల వారం రోజులు పని

బందు వెట్టినో లేదో ప్రభుత్వం దిగివచ్చి వాళ్లు అడిగిన వాటికన్నిటికి సరే నని ఒప్పుకున్నది అటు మొకాన బీడీ కార్మికులు గూడ కూలీలు పెరుగాలె అని బందు వెట్టిన్రు. బీడి కార్మికులైతే చాలవరకు ఆడోల్లే ఉంటరు వాల్లు గూడ కొట్లాడి సాధించుకొన్నరు. అయిదు రూపాయలున్న కూలి యిప్పుడు వెయ్యి బీడీలకు ఆర్రూపాల డెబ్బయి పైసలకు పెంచుకున్నరు. ఇంకా ప్రావిడెంటు ఫండూ, బోనసూ ఎన్నో సాధించుకొన్నరు. అడుగంది అమ్మైన పెట్టదని సామెతనే ఉండె. ఈ కాలంల అడిగినా ఎవడు పెడుతడు. అందుకే కొట్లాడాలె. పని బందు వెట్టాలె అప్పుడు వాళ్లే దేవుడానుకుంట దిగివస్తరు. మీరే గనుక పని బందు వెడ్తె గుత్తెదారు నోట్ల మన్ను వడ్డచేనారె''

''పూటకు గతిలేనోల్లం పని బందు వెడ్తె ఎట్ల! రాజ్యంగాని రాజ్యంల దేశంగాని దేశంల దిక్కులేని సావు జావమా! అదీగాక గిట్ల జరమత్తెనే తన్ని పని జేపిత్తున్రని. గీదెబ్బలకు మందులిమ్మని అడుగుతెనే గా రాయలసీమోల్లను ఎట్ల గొట్టిన్రో మీకు తెల్వదా !

''అది నిజమేననుకోన్రి. కానిమీరు ధైర్యంగ ఉంటె ఏదైనా అయితది. మీరు వాల్లతోటి ముందుగాల తన్నులు వడుతరు గావచ్చు. మీరే ఎదురు తిరిగితె వాల్ల గతేంగావాలె? మీరు మనిషికో తన్ను దంతె పేరుకు లేకుంటై తరు ఇంతగనం వాల్లెంత మంది? అంత గొడ్తె ముగ్గురే గద."

''మీరేమనుకోక పోతె ఓ మాటడుగల్న"

''అడుగు" అన్నడు సురేందరు.

"మీదేవూరు''

"... ... వూరు"

"యిక్కడి కెంతదూరం ?''

"యిరువై మైల్లు''

'మీరు గింతగనం తెలిసినోల్లు, గింతదగ్గరూరోల్లు ఈ రాజ్యపోల్లు మీరే బయపడవత్తిరి. యిగ మా సంగతెట్ల చెప్పున్రి."

"నేను ముందుగాల్నే జెప్పిన నేనేమొ ఒక్కన్ని మీరేమో నూరు మందని. ఒక్కన్ని ఎన్ని దెబ్బలిస్తె ఏంజెయ్యొస్తది. మీరు కలిసి కట్టుగ ఏం జేసినా నడుస్తది''

"మీరు గట్లనే అంటరుగని మీతోటిగాంది మా తోటి ఏమైతది''

మాటల్లోనే చీకట్లోని తుమ్మచెట్టు టిప్పర్ వెల్తురుకు కన్పించింది.

టిప్పరు రొదలాగే వాల్ల చెవుల్లో గింగిర్లెత్తించిన సురేందరు మాటలతో ఆ చీకటోలె ఆలోచనలు ముసురుకొన్నయి.

(ఇంకా ఉంది).

★ ★ ★ ★

జగిత్యాల పల్లె

ఎ. ఎస్.

ఆకాశం అప్పుడోటి ఇప్పుడోటి ఉల్కల్ని రాలుస్తూ
మబ్బులు ఉరుకులు పరుగులతో-
వెన్నెల నురుగుల్లో-
మొక్కజొన్న కర్రలు మంచు బరువుకు తూగుతూ,
భూమి నిర్దయగా బీటలు, గెచ్చులు-
గుడిసెల కప్పులు నిశ్చలంగా, ఉసూరుమంటూ-
"బోఁయ్" మనే చల్లగాలి-
ఊరు మాటుమణగి అణిగి వుంటుంది.
కప్పు చిరిగిన గుడిసెలో గుండె చెదిరిన ముసలమ్మ-
ఎడతెగని నిట్టూర్పుల్లో రాత్రి ఎంతకూ ఒడవక-
ఊరకుక్క వాళి పెకిలించి మొరుగుతున్నది.
నిశ్శబ్దంలో పల్లె జోగుతూ...
అంతే అట్లా ఒక గంట...

నాలుగు వ్యాన్ల నిండా ముసుగు దొంగల్లాగా
వాళ్ళు లాఠీలు, తుపాకులు మోసుకుంటూ-
వీధులను విచ్చలవిడిగా తొక్కేస్తూ,
దొంగ రహస్యాలను బహిరంగ పరచే
అజ్ఞాత వీరుల కోసం గుడిసెల చూర్లకిందికి
గాజు కళ్లు చొప్పిస్తారు.
పందిళ్లు విరుగుతయ్
బీరపాదుల్తో సహా
గుడిసెలు కాలుతాయి
తిండి గింజలతో సహా-
సన్నిలు శరీరాల మీద దిగుతయి-
బట్టలు ఇగ్గెయ్య బడుతయి
ఎవరి ఒళ్లూ మిగలకుండ నెత్తురు కారుతది.

ఎవడో ఒక అభాగ్యుడు
పండ్లు గిలకరించి మూలుగుతడు
ముసలి వాడొకడు నెత్తురు వుముస్తూ తిడుతడు
ఊరు పీనుగల పెంట
ప్రతాపం చల్లారుతుంది ;
రాత్రి మన్నుదిన్న మండేరు గున్నలా
నిశ్శబ్దంగా - కదలక మెదలక వుంటుంది.
నక్షత్రస్థగిత ఆకాశం
బరువుగా వంగి రోదిస్తుంది తెల్లవార్లూ...
తెల్లవారుతుంది...
అజ్ఞాత సూరీడు
విరిగిన, పగిలిన
చిరిగిన, చిట్లిన గుడిసె కప్పుల మీదుగా
కిరణాలు ఝుళిపిస్తూ
తూర్పున రగులొకంటడు

దొంగ రహస్యాలు బహిరంగ పరిచే వాళ్లకోసం
ఇద్దరు యువకులు-
"చద్దులు" మోసుక పోతుంటరు -
తూర్పు దిశకేసి వడి వడిగా నడుస్తుంటరు.

భద్రత

ఎస్. కె.

ఒక్కొక్కప్పుడు
ఒంటరి తనం దిగులు చుట్టు ముడుతాయి
ఎగుడు దిగుడు శబ్దాలను శ్వాస మోస్తుంది
చూపు నిశ్చలమవుతుంది
ఎవరో తరుముకొస్తున్నట్లుగా
జీవితాన్ని భయం వూపేస్తుంది
ఏదేదో దృశ్యం కళ్ళముందు కడుతుంది.

అపరాహ్ణాల్లో, అర్ధరాత్రుళ్ళూ
ఏ సమయమైనా కానీ
వాడు వాకిలి తడతాడు
వాకిలి తెరిచి వుంటే
చదువుకుంటూన్న గది తలుపు తోసుకొని
మరీ వస్తాడు
వాడి నోటిలో చూపులో చేతిలో
యింటి యింటినీ తలకిందులు చేసేందుకు
పసిబిడ్డ కళ్ళల్లో ఎరుపు జీర గీసేందుకు
అయినదాని కేసి కాని చూపులు చూసేందుకు
'అధికార పత్రం' వుంటుంది
వాడు లైసెన్స్‌డ్ డెకాయిట్, 'ఆర్గనైజ్‌డ్ గూండా'
'ఎన్‌కౌంటర్' హంతకుడు
భద్రత లేదు, అవును నిజం
కాని ఒద్దు
వొణికి పోవద్దు
వెన్నులోంచి చలి పాకినట్టు
మృత్యువు బతుకును తినేసినట్టు
నిశ్చల మవొద్దు
విచారం తడుముకొస్తున్న వేళ
విషాదం కమ్ముకుంటున్న వేళ
కళ్ళు నీళ్ళు కారే తోళ్ళు కావద్దు
గుండె భూమిక మీద
కన్నీళ్ళు కసి నాగళ్లు దున్నాలి
అక్కడొక నిజం దొరుకుతుంది
మట్టి పైపొర కింది నించి
పెకిలి వచ్చిన సారం వలె
భయం తెర తొలిగి తెగింపు
కన్నీళ్ళ పొరచాటున మెరిసే కత్తి

నాది పూర్తిగా విచ్చుకోని త్యాగం
అప్పుడు మరో దృశ్యం
రూపు గడుతుంది

ఆకులూ కొమ్మలూ యూనిఫారాలు
కొండలు షెల్టర్లు
విజిల్ వూదే గాలియే సెంట్రీ
బాయినెట్ అంచు నదిలో చేపలా పదనెక్కుతుంది
అడవుల్లో రహస్యం దాగి నడుస్తుంది
పక్షులు గూళ్ళకి ఆహ్వానిస్తాయి
అల్లి దాచిన తియ్యదనం యిస్తాయి
కబుర్లాడుతాయి
కథలు చెబుతాయి
కళ్ళనీళ్ళు దీసుకుంటాయి
అతను కన్నీళ్ళు తుడుస్తాడు
చెక్కిళ్ళు తడుముతాడు
తల నిమురుతాడు

అతని వేళ్ళ కొసల్లో ఆశా సాహసాల వూపిర్లు ప్రవహిస్తాయి
'ఎదురు కాల్పుల' గుర్తుల మీద
అతడు అమరవీరుల నెత్తుర్లను తడుముతాడు
బిగిసిన పిడికిట్లో తుపాకి
ప్రతి హింసా ధ్యానాల ప్రతిజ్ఞలు తీసుకుంటుంది
ప్రకృతి పక్షుల రెక్కల్తో విప్పారుతుంది
విప్పారిన రెక్కల చప్పుళ్ళు
రాలుతున్న రెక్కలు అందించిన
సూర్యోదయ సందేశాన్ని స్పందిస్తాయి

మైదానాలు రహస్యాల్ని దాచి నడుపుతాయి
చంద్ర నగర్ సరిహద్దులు చెరిపిన మరో శంకర్
భూమిమీద పుడతాడు
ఈశాన్యాన్ని డార్జిలింగ్ సూర్యుడు ఆవహిస్తాడు
బ్రహ్మపుత్ర వరదలు శ్రీకాకుళ సముద్రం నుంచి
ఉప్పెన ఉప్పునందు కుంటాయి
కావేరీ నది వందలాది బాలన్ లను
గజ ఈత గాళ్ళను చేస్తుంది
ఏనాడు కావాలని కిన్నెరసాని
ప్రణయ గీతాలు పాడిందని !

పోరాటాల జలపాతాల ధ్వని
ఒకేచోట పుట్టిన నదులన్నీ
తప్పకుండా ఒకనాడు ఒకేచోట సంగమిస్తాయి
గోదావరి ప్రజలకు యివాళ్టి దారి


భద్రత లేదు
జనం వెంటలేని వాళ్ళకు భద్రత లేదు
భద్రత లేదు
జనం వెంట రానివాళ్ళకు భద్రత లేదు

పొదగడం తెలియాలి గాని
వెచ్చనైన జనం గుండెల్లో
అచ్చమైన భద్రత వున్నది
గోదావరి ప్రజాశత్రువులకు కడుతుంది గోరీ

నవల-సీరియల్

చౌ లి-పో

రెండవ భాగం



ఉప్పెన

(అక్టోబర్ సంచికతరువాయి)

అప్పుడే లీకీ-లాన్ గదిలోకి సుడిగాలిలా దూసుకొచ్చింది. ఆమెకి జడలు లేక పోయినా పాయి గుర్తుపట్టేడు. మెడవరకు కత్తిరించిన జుట్టు మసక చీకటిలో నల్ల సిల్కు దారాల్లావుంది. సిమెంట్ రంగు గౌను తొడుక్కుని కాళ్ళకి లేడితోలు చెప్పులేసుకుంది. వాటికి లేసులున్నాయి. పరుగెత్తుకొచ్చిందేమో బుగ్గలు ఎరుపెక్కేయి. కిలకిలా నవ్వుతూ,

"ఎప్పుడొచ్చేవ్? నీ నవ్వు కోసెడు దూరం ఇనిపించింది" అని పలకరించింది.

''అరగంటయింది. కాంగుమీద కూకుని సలికాసుకో" అని మర్యాద చేసేడు పాయి.

"నీ ఆడదాయి నీ మీద బెంగెట్టీసుకున్నాది. నిన్న రేతిరే" ఇంటికొత్తానన్నవాడు రానేలేదు, సరిగదా వుత్తరమ్ముక్కన్నా రాయనేదు. బైటి కడుగెడితే సాలు, నన్ను మర్సిపోతాడు'' అని ఓ ఇదయిపోనాది అంటూ పాయి భార్యవేపు తిరిగి,

"నీ కల నిజంవై పోనాదమ్మా" అని తృప్తి వెలిబుచ్చి, పాయితో "నీ ఆడదాయి ఎంత పనిసేత్తాదో నీ కెరికేనా? మయిలా సంఘంలో ఈవిడే పెద్ద. బూనోంవుల్ని పట్టీడంలో, ఎండీ బంగారం తవ్వడంలో, తుపాకులు పైకి తీయడంలో - అన్నిట్లోనూ ముందే వుంటాది. మంచి తెలివీ, దైర్నం బాగా వున్నాయని ఓల్డ్సన్ యీ విడిని తెగమెచ్చుకుంతాడు- "నాకేబై ఏల్లొచ్చేయి

గాని పాయి ఆడదాయి లాటి ఆడదాన్ని ఎక్కడా సూడనేదంతా"డు "పాయి భార్య అమ్మికి పెండట్లకి శానా సాయం సేత్తాది" అని చావో భార్య మురుసుకుంటాది కువో అయితే "మగాడు సేసేనంత పని సేత్తాది" అంతాడు అంది లీకీ-లాన్.

పాయి భార్య సిగ్గుపడుతూ, ఆమెని వారించి, "కోతిముండా, ఇంత వాగుడెక్కడొచ్చిందే నీకు!" అని గిచ్చబోయింది.

"ఓలమ్మో, నన్ను గిల్లకు. పాయికి ఏటొండినావ్? వూరెళ్లేప్పుడు బూరెలు. తిరిగొచ్చేక సేమ్యా ఎట్టాలంతారుకదా, మరి సేమ్యా తిన్నాడా?"

"అది నాకు సేమ్యా కూడా ఎడతాదేటి? ఒచ్చినకాడినుంచి దొబ్బులెడుతున్నాది'' అని నవ్వేడు పాయి

"ఈవిడ వుత్తుత్తినే తిడతాదిగాని నువ్వంటే ఎంత అభిమానమో తెల్సా?"

"ఆగు, నిన్ను - నిన్నేంసేత్తానో సూడు" అంటూ లీకీలాన్ వెంటబడింది. కాని ఆవిడ అప్పటికే పైకి పారిపోయింది.

''ఏం వమ్మో, సంబరంలో పడి రేపటి పని మరిసిపోనావు!'' అని అరిచింది లీకీ-లాన్.

'ఏడికి పోతున్నా?'

'చావో భార్య కాడికి. అక్కడే తొంగుంటా' నంది. పాయి భార్య లీకీ-లాన్‌కి ఓ దుప్పటి అందించి లోపలికొచ్చింది. గాలి తప్ప మరో గోలలేదు. గదిలో దీపం ఆరిపోయింది మరో గంటకి పాయి గురక వినిపిస్తోంది.

మర్నాడుదయం పాయి భార్య ఆఫీసుకెళ్ళింది అలవాటు ప్రకారం. కువో ఆమెనివారించి 'ఇంటికి పో. ఇక్కడున్నా నీ మనసంతా అక్కడే వుంటుంది. ఇక్కడ ఇయాల పనికూడా లేదులే' అన్నాడు

'నీ నోర్మూయ్' అన్నదేగాని, అప్పటికే ఇంటివేపు నాలుగడుగులేసింది!

'పాయిని కొంగుముడేసుకోకు. మాకాడిక్కూడా పంపు' అని అరిచేడు కువో వెనకనుండి.

పాయి భార్య ఇంటికి వెళ్ళేసరికి ఇంకా పాయి గురక పెడుతూనే వున్నాడు. ఆవిడ పొయ్యిని వెలిగించి పందిమాంసం వండింది. తను కూడా జుట్టు కత్తిరించుకుంది. నీలం గౌనుమీద నీలం జాకెట్టు వేసుకుంది. ఆవిడ

చాలా అందంగా అవుపిస్తోంది. భర్త లేనందుకు బాధపడినా వూరి విషయాల్లో చాలా బాగా పనిచేసింది - ఓర్పుగా, నేర్పుగా-పాయి తిరిగొచ్చేక ఆమెకి తృప్తిగా వుంది లయబద్ధకంగా వున్న అతని గురక వింటూ బూరెలొండుతూ కూనిరాగాలు తీస్తోంది.

పాయి లేచి ముఖం కడుక్కుని, రైతుసంఘం ఆఫీసుకెళ్ళేడు కవో.సో అన్ని విషయాలు మాట్లాడి భోజనానికింటికొచ్చేడు. కువో, చాంగ్ చి గ్-షి, ఓల్డ్‌సన్, మరికొంత మంది మిత్రులు అతన్ని చూసేదుకొచ్చేరు ఇల్లు ఇరుకయింది. పాయి భార్య, పాయి ఎంతో సఖ్యంగా, ప్రేమగా మెలిగారు ఇంతక్రితం పాయుని చూస్తే ఆవిడకు చులకనగా వుండేది పనీ పాటు లేకుండా బద్ధకంగా పడుకునే సోమరిపోతని ఆమెకి మంట కాని ఇప్పుడతను చాలా మారేడు. ఇప్పుడు కూడ ఆలస్యంగా నిద్ర లేచినా, పగలు నిద్రపోవడం లేదు. తను జాగ్రత్తగా మెలగడమే గాక, భార్యని కూడా విప్లవ ప్రతీఘాతక శక్తులకి దూరంగా వుండమని హెచ్చరించేడు ఇప్పుడందరితో కలుపుగోలుగా మాట్లాడుతూ, గ్రామ విషయాలు చర్చిస్తున్నాడు. అందరూ అతన్ని గౌరవిస్తున్నారు.

వచ్చిన వాళ్ళందరు వెళ్ళేక పాయి పెట్టె తెరిచి మావో బొమ్మ, మరో రెండు కొత్త సంవత్సరపు బొమ్మలు పైకి తీసేడు. ఆ రెండు బొమ్మల్లో ఒకదాని కింద 'యునైటెడ్ డెమోక్రటిక్ ఆర్మీ కౌంటర్ అఫెన్సివ్' అని వుంది. కాంగ్ పక్కగోడకి ఆ రెండు బొమ్మలు అతికించేడు మరో బొమ్మ కింద 'కష్ట ఫలితాన్ని పంచడం' అని రాసివుంది వంటింట్లో గోడకంటించి వున్న మసిబారిన బొమ్మని లాగేసి మంటలో వేసేడు దాని మీద 'ఇంటి యాజమాని' అని రాసివుంది మరేదో గుర్తొచ్చి లోపలిగదిలోకి పోయి అక్కడ 'మూడు తరాల పాయి కుటుంబదేవత' అని అంటించిన కాగితాన్ని కూడా లాగి పారేసేడు. ఆ జాగాలో చైర్మన్ మావో బొమ్మ అతికించేడు.

"మావో మూలాన్నే మనం నిలబడగలిగేం. అయనే మన సుట్టం ఆయన లేకుంటే మనం ఎదురు తిరిగేటోల్లంవేంకాదు. మనం మన సంస్కృతిని పెంచాలి. మన బుర్రలోని బూసోమ్య యిదానాన్ని మట్టుబెట్టాలి" అని భార్యకు వివరించేడు.

పాయి భార్య భర్త చెప్పిన విషయాలను ప్రచారం చేసింది. వంటింట్లో వున్న దేవత బొమ్మ పీకిపారేసి మావో బొమ్మ, కొత్త సంవత్సరపు బొమ్మలు కొనమని ప్రచారం చేసింది.

"మన సంస్కృతిని పెంచి, మన బుర్రలోని బూర్జువా యిదానాన్ని మట్టు బెట్టాల" అని చెప్పింది.

తర్వాత మహిళా సంఘం ఓ స్కూలు పెట్టి, వైద్యుడిని పతుబుచేసింది. అదంతా వేరే కథ.

14

లీకీ-లాన్ చావో భార్యతో కలిసి వుంటోంది. పగలు సంఘం పనులు చూసుకుని రాత్రుళ్ళు ఏదో ఒకటి చదువుతూండేది. అప్పుడప్పుడు పో-చుకి బొమ్మలు కత్తిరించేది. మొత్తానికి హాయిగా గడిపేస్తోంది కాలం.

మరో రెండు రోజుల్లో సంవత్సరాది పండగ. లీకీ-లాన్ మహిళా సంఘం క్లాసునుంచి వచ్చి చావో భార్యకి వంటలో సాయంచేస్తోంది. ఇద్దరూ కలిసి పండక్కి బూరెలొండుతున్నారు. ఇంతలో లీకీ-లాన్★ అత్త వచ్చి ఆవిడని యింటికిరమ్మంది రెండు గదులకీ మధ్య గడప మీద కూర్చుని పైపు కాల్చుకుంటూ.

"ఇంటికెళ్దాం రా. పండక్కి ఇంట్లో లేకపోతే ఎలా చెప్పు" అని అంటూనే 'తు' భార్య చావో భార్యని ఓరగా చూసింది.

"నాను రానుగాక రాను" అంది పట్టుదలగాలీకీ-లాన్. 'తు' భార్య నవ్వులు చిందిస్తూ,

"అలా అంటే ఎలామ్మా? నువ్వు పండక్కి రాకపోతే మనచుట్టాలంతా నవ్విపోరూ? విప్లవ కార్యక్రమాల్లోనూ వుండాలి. కుటుంబాలు చూసుకోవాలి కానీ ఈ ఒక్క పండక్కే ఇంటికిరావమ్మా సరిగ్గా నాలుగురోజులు చుంపని పంపేస్తా చాలా మంచిదానివి నా మాట వింటావుగదూ?" అని బుజ్జగిస్తూ. చావో భార్యని. "నువ్వన్నా చెప్పమ్మా యింటికి రమ్మని" అంది.

చావో భార్య ఏమీ మాట్లాడలేదు.

"ఈ తీపి కబుర్లు యింకెన్నాళ్ళు?" అనుకుంది లీకీ-లాన్ ఆ యింట్లో తన స్థానం, పదేళ్ళ భర్తగారి భర్త-అన్నీ గుర్తొచ్చేయి. ఆ బాలుడి కా పక్క తడుముతూనే వుంటాడు. ఓ సారి తను పొలంలో పని చేస్తుంటే అత్త పారతో కొట్టింది. తన ఆడబడుచు ఎప్పుడు దెప్పుతూనే వుంటుంది. తను 'తు' ఇంటి నుంచి పారిపోయిన రోజు తనకింకా బాగా గుర్తే... బైట జోరున

★ 'తు' భార్య. ఈ 'తు' కొంచెం చిన్న ఆసామి. దుష్టత్రయంలో 'తు' కాదితను.

వాన తను బయట దొడ్లోకి పారిపోయింది. నక్కలు వూళ లేస్తున్నాయి. తను గడ్డి వామి మీదకెక్కి ఆ చలిలో గుండెలు పగిలేటట్లు ఏడ్చింది. తన కసి యింకా చల్లారలేదు. ఎప్పటికీ చల్లారబోదు. ఆమె అడ్డంగా తలవూపి "వాను రానుగాక రాను, సచ్చైనా సత్తానుగాని ఆ కొంపకి నానురాను" అంది అత్తతో.

ఆ మొండి తనంచూసి 'తు' భార్య ముఖంమీద దొంగనవ్వు మాయమయింది. ముఖం కందగడ్డ చేసుకుని.

"అయినా నేను నిన్నడగడమేంవిటిలే? నువ్వు వస్తానన్నా రానన్నా నాకనవసరం. మేం నిన్ను డబ్బిచ్చి కొన్నాం. మధ్యవర్తులు, సాక్షులు కూడా వున్నారు. నేను నీ అత్తని- నీమీద నాకు హక్కుంది. న్యాయాన్నే ఎదిరిస్తావా?" అని బెదిరించింది.

"నాయాన్నెదిరించిందెవరు?" అనడిగింది లీకీ-లాన్ బూరె బుట్టలో వేస్తూ.

"ఏటమ్మా, ఏటంతన్నావ్? లీకీ-లాన్ మయిలా సంగం డిప్టీనీడరు. తన సొంతంవని సూసుకోకుండా ఎంతో పని సేత్తాది. ఈంవెకే నాయంతెల్దంతావేటి? బూసోంవుల నాయాన్నీవిడ ఎదిరించినమాట నిజవే" నంది చావో భార్య.

కాంగ్ మీద కర్రతో ఆడుకుంటున్న సో-చు 'తు' భార్య తన తల్లితో కూడా ఘర్షణకు దిగడం చూచి కర్ర పారేసి కాంగ్ దిగి "పైకి పోవే దొంగ ముండా" అంటూ ఆ ముసలి దాన్ని తోసేడు. కాని 'తు' భార్య ఒక్క అంగుళం కూడా కదలకుండా పైపు కాలుస్తూ మళ్ళా పాతపాటే పాడింది.

"ఇది మా యింటిది. పండగలకి దీన్ని మేం పిల్చుకు టాం" అంటూ.

"అప్పుడు దాన్నింటోంచి తరింవేసినారు. ఉప్పుడు మల్ల రమ్మంతన్నారు. అదేంవన్నా బొమ్మంతావా? దాన్ని సర్వనాసినం సేసిగాని ఒగ్గరేటి మీరు?" అంది చావో భార్య ధృఢ గా

లీకీ-లాన్ చేసిన బూరెలు నూనెలో వేస్తూ. "ఈ పండగ కాంగానే నేను యిప్లవంలో సేరిపోతన్నా, అప్పుడు నన్ను 'తు' కుటమానంలో దాన్నని అనలేవుగా?" అని అడిగింది.

"నన్ను భయపెట్టాలని చూస్తున్నావా? మేమూ భూమిచ్చేం గనక మేం కూడా విప్లవంలో చేరేంవన్నమాట"

లీకీ-లాన్ చర్రున తలెత్తి, "ఏటేటీ, నువ్వూ ఇప్లవంలో సేరిపోనా

నంతావా? మంచుకో రోజుల్లో మీరంతా పగాడి పక్కనజేరారు. తీరా జపా నోల్లు లొంగిపోవాక బూసోంఫల్లో కల్సిపోనారు. అప్పుడు మీరేటన్నారో, ఏటిసేసేరో మాకు ఎరికనేదంతావా? ఇంతవరకు నీగుట్టు మా సంగానికి బాగా తెల్నేదు నువ్ అప్పుడే ఇప్లవంలో సేరిపోనానంతావా?'' అని ఛడామడా అడిగేసింది.

"నేను ఏంవిటన్నానో, ఏంవి చేసేనో చెప్పు చూద్దాం" అంది 'తు' భార్య, తన పిరికి కోడలు నిజం చెప్పలేదన్న ధీమాతో, కోడలిని తీక్షణంగా చూస్తూ

ముందు పెద్ద కాంవందుల పనిచూసి తర్వాత చిన్న కాంవందుల పని చూడమన్నాడు సియావో తన మాంవ కూడా చిన్న కాంవందే కనక యిప్పటి దాకా అతన్ని బైట పెట్టలేదు. కాని తన అత్త ఏంవీ తెలియనట్టు నటిస్తోంటే, తనని సాధిస్తూ రెచ్చగొడుతోంటే సహించలేకపోయింది లీకీ-లాన్.

"పది నెలల క్రితం గాంవాల, నువ్వేటన్నావ్? "మీరుప్పుడినాగే తోకలు జాడించండి. మా 'సెంట్రల్ ఆర్మి' ఒచ్చి మీ తోకలు, పీకలు కోసే త్తాది అన్నావా, నేదా?"

ముసిల్దాని మొఖం పాలిపోయింది. పెదాలు వణక సాగేయి. 'సెంట్రల్ ఆర్మి' ఇక రాదని రూఢిగా తెల్సు. అందుకే తడబడుతూ "అబద్ధం" అని అరిచింది

తగువు విని ఇరుగు పొరుగు చేరేరు. వాళ్ళలో చు. ఓల్డ్‌సన్ కూడా వున్నారు. లీకీ-లాన్ ధైర్యం పుంజుకుంది

"నువ్వన్న మాట అనలేదని బుకాయించి నాబంనేదు. ఆ మాటలు నువ్వన్నవే వంటింట్లో పొయ్యంటిత్తా అన్నావ్. ఉప్పుడు నువ్వు మర్సిపోనా వేమో గాని నాను మర్సిపోనేదు''

'తు' భార్య జనం వేపు తిరిగి, "చూడండి బాబూ, మా కుటుంబ మంతా ఎనిమిదో దళ సైన్య మాట మీదే వుటాంవని మీకు తెల్సు గదా?" అని ప్రాధేయ పూర్వకంగా అడిగింది.

"అవునవును, నీ మాటలు సైన్యం వేపుంతాయి నీ మనసు బందిపోట్ల వేపుంతాది. నువ్వో పాలి రైతు సంగం ఆపీసర్లని ఏటన్నావో యాదస్తున్నాదా? 'ఆ గాడిదలు ఉప్పుడున్నట్టే వుంటే 'సెంట్రల్ ఆర్మి' అల్లని పూడ్చి పెట్టేత్తాది' అన్నావు కదా" అంద లీకీ-లాన్.

ఓల్డు సన్ మాట కలుపుతూ, "ఇది సూడాల్సిన యిసయమే దీని మాటలే ఇంత ఇదిగుంటే, యింక దీని బుద్దెలాగుండాల'' అన్నాడు.

"దిన్ని కట్టెయ్యండా!" అన్నాడు 'చు'

లీకీ-లాన్ తన కష్టాలు మరికొన్ని చెప్పింది : "అల్ల వుప్పు తిన్నాను కదాని యిన్నాల్లూరుకున్నా. ఉప్పుడది సూడు నన్నెలా దెప్పుతున్నాదో!" అంటూ గౌను పక్కకి తీసి తన భుజం మీద గాటు చూపించింది. "అయిదేళ్ళవుతాది. ఓ నాడు నాను కలుపు తీత్తా ఉంటే నా జబ్బ మీద పారతో కొట్టేసినాది. ఈ మచ్చ అప్పటిదే. ఎంత నెత్తురు కారి పోనాదో? నాను వారం రోజులు పక్క మీంచి నెగనేక పోనాను" అంటూ గౌను సరిచేసుకుని, "నాకు ముందు మాకు యివ్వనేను డాక్టర్ని పిల్నేదు. నా కన్నీలకి కాంగ్ తడిసిపోనాది. అప్పుడు కూడా 'అందరూ పనిపాటు సూసుకుంటే నువ్వీడ తొంగుంతావా? సిన్నవెత్తు పనిసెయ్యవ్. బుడి బుడి రాగాలెట్టేవ్. నువ్వెందుకూ పనికి రా'వన్నాది. దీనికి పెజలంటే సులకన" అని చెప్పింది

"ఉప్పుడెవరు సులకనో సెప్పమను" అన్నాడు ఓల్డు సన్.

"సియావో బాబు రెండో సుట్టు ఒచ్చేక నాను మయిలా సంగంలో సేరతానంతే ఇది నన్ను సేర నీనేదు సేరితే నా ఒంటి మీది గుడ్డలు ఒలిసేస్తానన్నది. ఇంకా శానా సెత్తా కారి మాటన్నాది. "ఏటే, నీకు మంచి గిరాకీవున్నాదేటి? సంగం ఆపీసర్లందరికి నువ్వు కావాలా? పోయి ఆల్లతోనే తిరగరాదా?'' అనేది దుష్టత్రయంలోని 'తు' అడ్డోల్లతో యిది మంతనాలాడుతూండేది. అన్నీ నాకు తెల్దనుకుని నన్ను పైకి పంపాలని సూసేది'' అంది లీకీ-లాన్.

జనంలో కొంతమంది 'తు' భార్యని కొట్టెయ్యడానికి సిద్ధపడ్డారు. కాని కువో వాళ్ళనాపి లీకీ-లాన్ చెప్పేది కడదాకా వినమన్నాడు. కువోని చూడగానే ఆమె బుగ్గలెరుపెక్కేయి.

"నాను మయిలా సంగానికి డిప్టీ నవ్వంగానే మా అత్త, ఆడబొట్టి నన్ను మరీ తేలిక సేసేరు. అల్ల కాల్లో ముల్లున్నట్టు నన్ను సూసేవోరు "అదేంపనే. సరసాలాడ్డంలాంటిదా ?" అని మా అత్త అడిగితే, "వూరుకో అదిప్పుడు పెద్ద ఆపీసరు. మన మీనసెప్పిగల్దు" అంది మా ఆడబొట్టి ఓ మారు తలపోటొచ్చి మీటింగు మధ్యలో నానింటికొచ్చేసినాను గదంతా సీకటి. కాంగుమీన తొంగున్నా ఇంతలో పైనించి అడుగులసప్పుడు, మరెవరో కాదు, తల్లీ కూతుల్లే. నన్నుసూడక ముసల్ది " అ ముండకుప్పుడు

ఆయిగున్నాది. నానా పైనున్నానని గొప్పలు పోతాంది సూద్దాం. ఎన్నాళ్లుంటాదో! దాన్ని కిందకి దించే రోజొత్తాది' అంటూ తిడుతాంటే' కూతురు రాంగువేపు చూసి తల్లిని మోసేత్తో పొడిచి "ఏటమ్మా ఎవల్నీ అంటన్నావ్? అనడిగింది నంగనాచిలాగ. తల్లి సదురుకుని "నిన్నే తిడతన్నానే. ఇ కెవుల్నీ తిడితే ఎవులూరుకుంటారమ్మా?" అని దీర్గాలు తీసింది" అంటూ తన కష్టగాధ ముగించింది లీకీ-లాన్

ఇదంతా విని కువో జనాన్ని తోసుకుని ముందుకొచ్చి. ముసిల్దాన్ని రెట్టిస్తూ "దాన్ని కిందికి దించే రోజొత్తాది అన్నావుకదా, అంటే ఏటో యిడమరిసి సెప్పదూ" అన్నాడు

ముసల్ది తల పైకెత్తిచూసింది. అంతమంది జనాన్ని చుట్టూచూసేసరికి గుండె ఆగినంత పనయింది. లేచి నిల్చుని "నువ్వొస్తేరా, నేనింటికి పోతున్నా" నని చల్లగా జారుకోబోయింది కువో అడ్డుకుని "ఈవిడని మయిలా సంగం క్లాసుకి తీసుకుపో అక్కడ వాళ్లని యీవిడని బాగా సోదా సెయ్యమను. కనిపించేటంత అమాయకురాలు కాదీయమ్మ" అని చాంగ్ చింగ్-మీకి కన్ను గీటాడు కువో.

క్లాసు రూంలో పాయిభార్య, లీకీ-లాన్. ఇంకా చాలా మంది ఆడ వాళ్ళు 'తు' భార్యని చుట్టుముట్టేరు వాళ్ళని చూస్తూనే 'తు' భార్య హడలి పోయింది వాళ్ళామెమీద ప్రశ్నల వర్షం కురిపించేరు ఆమె రాజకీయ భావాల గురించి అడిగేరు. ఏవన్నా తుపాకులు దాచిందేమోనని అడిగేరు.

"తుపాకులా? ముసల్దాన్ని. నాకు తుపాకులెందుకు?" ఆమెమాట తడబడేసరికి "మరి ఏటున్నాయి?" అని అందరూ ఒక్కసారి అరిచేరు.

"మరి...నా దగ్గర..." అని దగ్గడం మొదలెట్టింది

"ఊం బేగి సెప్పు"

"గుప్తత్రయంలోని 'తు' నాకు రెండుంగరాలిచ్చి దాయమన్నాడు

"ఏవి ?"

ముసల్ది పాయి భార్య చెవిలో ఏదోవూదింది.

"మొగోల్లంతా పైకిపోండి" అని వాళ్ళువెళ్ళేక 'తు' భార్య తొడుక్కున్న షరాయి వెదికితే వుంగరాలు దొరికాయి. తిరిగొచ్చిన మగాళ్ళలో ముందు షె ఓల్డ్ సన్ వుంగరాలు చూసి బుర్రాడిస్తూ,

మనకెందుకు, జీతగాళ్ళం!

జనార్దన్. ఎస్

"ఎత్తినాం విరసం జెండా!" ఏమిటయ్యా ఇది! పది పేజీల చిట్టాబట్టు కొచ్చినవ్. ఏదో విరసం సభలు మన వూళ్ళో జరుగుతున్నాయి. చూసి వస్తానంటే సరే నన్నంత మాత్రాన మూడురోజులు అయిపూరా తూ లేకుండా పోయింది కాక, పది పేజీల చిట్టా పట్టు కొస్తావా? ఇది ప్రచురించామంటే మన నౌకరీలు వుండేటట్టేనా? ఇదిగో ఇప్పుడేదో చేశావుగాని మరెప్పుడైనా ఆవైపు వెళ్ళక, ఒక వేళ వెళ్ళావే అనుకో చివరి పేజీలోనో, ఆ ముందు పేజీలోనో (ఎవరి కీదుర్భిణీవేసి చూసినా కన్పడకుండా) చివరి కాలంలో మూలో. నాలుగో లైనులువేసి మన మొక్కుబడి తీర్చుకోవాలి (అదీ ఎందుకంటావో. ఏదో పత్రికా స్వాతంత్ర్యం వున్నట్లు కన్పడాలి కదా!) అంతేగాని దారినపోయేవంత నెత్తిన రాసుకొని పత్రికలో వేస్తే, అసలే జీతమ్ముండా కొడుకులం, పెళ్ళాం పిల్లలున్నోళ్ళం. ఉన్న ఉద్యోగం ఊడబీకి రోడ్డుమీదికి విసిరేస్తే. ఈ విరసాలు, అరసాలు, పరసాలు అడ్డం రావుకదా! ఏదో కుర్రకుంకవి కాబట్టి ఇంత ఇదిగా చెబుతున్నా.

పోయినేడు అర పేజీరాశాన టావా. అవును రాశాము. ఎందుకు రాశినం? ఆ రోజది అవసరం. ఎవరికి నీకు నాకు కాదు జనాలకి అసలే కాదు మనకి కోలంవిచ్చిందు చూశావా ఆడికి ఆడి దోస్తులకి. అసల్కి నీకిది తెలుసా. ఎవడైన బిజినెసు ఎందుకు చేస్తాడంటావ్? ప్రజాసేవకు కాదు కదా! ఏదో నాలుగు డబ్బులు కూడబెడదామనేగా కనుక డబ్బులు వచ్చేటట్టుంటే దేంట్లోనైనా పెట్టుబడి పెట్టానికి రెడీనే మనోడు. కిరసనాయిలు బ్లాకులో రేటు పలుకుతుంటే కిరోసిన్ ఏజెన్సీనే తీసుకొంటాం ఇంవై వైపలచాయ్, కాఫీలు ఎవళ్ళైకమ్మినా సర్కారు పట్టించుకోకపోతే హోటలే పెట్టేస్తాం. లాడ్జింగు లెట్టి కేబరేలు పేకాట జోరుగ నడపొచ్చంటే, క్లబ్బులే తెరుస్తాం. బ్లూ ఫిలిం డిమాండు పెరి

" 'తు' పెద్దకోడలు పెళ్ళిలో పెట్టుకుంది. ముసల్ది ఏడదాసిందీటిని?" అని ఆదుర్దాగా అడిగేడు

'తు' భార్యతో "నువ్వింక ఇంటికిపో నిన్నేటిసేయం. కాని నువ్వు మంచికి మారాల. కాంవందుల మాటలు ఇనక'' అనిచెప్పి. చావో భార్య పంపేసింది

(ఇంకా వుంది)

గితే సినిమా హాలుగట్టి న్యూడ్ ఫిలిమ్స్ చూపిస్తాం. జనంలో రేసుల పిచ్చి ఎక్కువయ్యి మనకు నాలుగు పైసలు కుమ్ముకోవచ్చనుకొంటే రేసులే నడుపుతాం. అంతదాకా ఎందుకు ఆఫ్టరాల్ పిడకలకు, పచ్చళ్ళకు export మార్కెటు వుంటే అఖిలాంధ్ర అప్పడాల, పిడకల, పచ్చళ్ళ ఎక్స్పోర్టింగ్ ఏజెన్సీ తెరుస్తాం మనక్కావలసింది లాభం. అది వచ్చేటట్టయితే మార్క్స్ ఎవరో చెప్పినట్లు శవాలకు పాడికట్టి మార్కెటులో అమ్మేస్తాం. తప్పేమీ లేదంటాను. Serve the need. అంటే వాడికి అవసరమైంది చేస్తేనేకదా నాలుగుపైసలొచ్చేది. ఈ పాలసీ మీద మనోడు అంటే మన సేఠు పేపరు పెడితే మంచి సేల్సు, లాభం వస్తుందని పేపరు పెట్టేశాడు. పెళ్లాం బిడ్డల్ని మనం సాకుకోవాలిగా, అందుకే నేను ఎడిటరుగా నువ్వు విలేఖరిగా చేరినాం. అంతేనంటావా? వాడికి లాభం కావాలి. మనకు జీతం కావాలి. ఆడు బిజినెస్సుమేన్. మనం గుమస్తా గాళ్ళం. (మరీ అంత అధ్వాన్నంగాకుండా నాలుగుపైసలు, వైట్ కాలరు వేసుకొని తిరుగుతుంటామనుకో).మరి అటువంటప్పుడు ఆడు చెప్పినట్లు మనం వినుకోవాలి కదా. అడికి, ఆడి దోస్తులకు, చుట్టాలకి, పక్కాలకి, ఆడి ముఠాకి చీమ కుట్టకుండా, వళ్లు కందకుండాచేసి నాలుగు పేజీలు నింపి, జనాలమీదికి వదిలి, నాలుగుపైసలు మిగిలేటట్లుచేసి వాడి జేబునింపాల. ఏది వేస్తే పేపరు సేల్సు పెరుగుతుందో (అసలికి మోసం వచ్చే వార్తలు వేయకూడదు సుమా!) చూడ్డానికే గదా మనల్ని పెట్టుకొంది. లేకపోతే మనమెందుకంటా.

మంగలి షాపునుంచి, ఐక్య రాజ్య సమితి జనరల్ సెక్రీదాక ఏదో ఒక ప్రారంభ ఉపన్యాసము ఏదో ఒక మంత్రి వెధవది వుంటూనే వుంటుంది గదా. వాడి ఫోటో, ఉపన్యాసము వేస్తే మొకటి పేజీ నిండిపోయె. ఇంకా జాగా వుంటే ఫలానా మంత్రి దిగబోతున్నాడనో, ఫలానా వాడు మంత్రి అవబోతున్నాడనో, ఫలానా మంత్రి వేలువిడిచిన బామ్మరిది రాజకీయాల్లో చేరుతున్నాడనో, రోజుకొక రకంగా మన పైత్యం కొంత కలిపి కొట్టొచ్చుగదా! రెండో పేజీఅంటావా పెడర్లు advertisement Rentals వుండనేవున్నై చివరిపేజీ ఆటలకి, బాబాగారి వుపన్యాసానికి వదిలేసెయ్యి లోపలి పేజీల్లో రెండు పేజీలు సినిమా ఎడ్సేకదా! ఎడిటోరియల్ పేజీ నేనే చూసుకొంటానాయే. ఇక మీకు మిగిలేది ఒకటో, అరో నేకదయ్యా. రేడియో ప్రోగ్రాం, T. V. ప్రోగ్రాం, రైళ్ళు, విమానాల రాకపోకలు, బొంబే షోరూమ్ advertisements- ఇవన్నీ నింపగా ఏతావాతా ఎంత మిగులుతుందంటావ్. లేకపోతే భజన సమాజాలు, లయన్ క్లబ్బు ప్రోగ్రాములు, సంఘాల ఎన్నికలు - వీటితో నింపు జాగాకు జాగా నిండుతుంది. సేల్సుకు సేల్సు పెరుగుతాయి - లేకపోతే ఒకటి రెండు బాక్సు కాలమ్సు కట్టి ఫలానావూళ్ళో పందిపాలు కుక్కతాగుతోందనో.

లేక ఫలానా బాబాగారు నీళ్ళ మీద నడిచారనో, లేక సినీతార విడాకులు ఇవ్వటంలేదనో, మంత్రిగారు కాళ్ళతో నడచి పాదయాత్రలు చేస్తున్నారనో- రాసెయ్ - ఫినిష్ - నీపని అయిపోతుంది.

అంతేగాని మన ఇళ్లు, ఒళ్ళు, కొలువు బాగావుండాలంటే- జనం అని, ప్రజాస్వామ్యం, పత్రికా స్వాతంత్ర్యం అని, కళ కాకరకాయ అని, కుర్రాళ్ళు, స్టూడెంట్సు, యూనియన్లు, పాలిటిక్సు - ఇవి ఏమీ పట్టించుకోకు. మరీ అంత ఇదిగావుంటే రవీంద్ర భారతిలో ఏ "ఆస్థాన కవి" ప్రోగ్రామో, ఏ "నటరత్న" సన్మాన మో, ఏ "గాన కోకిల" పాటలనో రాయి. నీ దురద తీరిపోతుంది.

కనుక మన పాలసీ ఏమిట టావే. పత్రిక నింపటం. జనంమీద వదలటం నాలుగు డబ్బులు చేసుకోటం. అంతేగాని దేశంలో జరిగే ప్రతిదాన్ని (ప్రత్యేకంగా ఈ విరసం వాళ్ళను, స్టూడెంట్సు, హక్కుల సంఘాలవాళ్ళను) పట్టించుకుంటే మనం బతికి బట్టకట్టినట్టే. మనం వీళ్ళ గురించి ఎంత పట్టించుకోకుండా వుంటే అంతమంచిది. (అయినా ఖర్మగాలి వాళ్ళు పెరుగుతూ వుంటారనుకో.)

కాని ఇందులో చిన్న కిటుకుంది మనోడు చెప్పాడు ఓసారి ఏమిటంటే, మొదటి పాయింటు. ఒకోసారి వీళ్ళ గురించికూడా రాస్తేనే (ఎన్నిసార్లు అరెస్టులుచేసినా, ఎదురు కాల్పులనిచెప్పి మనుషుల్ని గల్లంతు చేసినా, పుస్తకాలను నిషేధించినా, లాఠీలను, రౌడీలను, మీదకుతోలినా) వీళ్ళ ప్రభావం పెరుగుతూనే వుంటోంది) మన పేపరు సేల్సు పెరగదు. ఇక రెండో పాయింటు కాస్త మనదికూడ ప్రోగెసివ్ పేపరని నలుగురు చెప్పుకోరు. అంటే నలుగురు చెప్పుకోటం ద్వారా సేల్సు మరల పెరుగుతాయి అన్నిటికన్నా ముఖ్యంగా మూడో పాయింటు ఏమిటంటే మనోళ్ళు - అంటే మన సేటు, వాడి దోస్తులు, బంధుగులు, వాడి వర్గమే అనుకో-అప్పుడప్పుడు నేను గొప్పంటే నేను గొప్పని అమెరికావోడు, రష్యావోడు గుద్దు కొంటున్నట్లు - దేశానికి నేను సేవ చేయాలంటే నేను సేవజేయాలని, జనాల్ని నేను ఉద్ధరించాలంటే నేను వుద్ధరించాలని తమలో తాము గుద్దుకొంటూ వీళ్ళ సంగతి అంటే ఈ విరసం వోళ్ళనుకో, హక్కుల సంఘాలనుకో, కమ్యూనిస్టులనుకో, ఎవరైనాగాని మనకి, మన లాభాలకి ప్రమాదం తెచ్చేవాళ్ళ గురించి మరిచిపోతారు కొద్ది రోజులు. అటువంటప్పుడు వీళ్ళ గురించి, వాళ్ళ ఆటలు పాటలు గురించి తాటికాయంత అక్షరాలతో, (జరా మసాల గలిపికూడ) ఫుల్ పేజీ రాయాలన్నమాట. అంటే ఏమిటంటే- "ఒరే బాబుల్లారా! జనాలు కమ్యూనిస్టోళ్ళ పక్కన బెల్లం చుట్టూ ఈగలు చేరినట్లు చేరిపోతున్నార్రా. మీరు కాస్త కళ్ళు తెరచి సరంజామానంత (తుపాకులు, పోలీసులు సోదాలు, జైళ్ళు, కోర్టులు, కేసులు, బాబాలు, గుళ్ళు, గోపురాలు, దేవుళ్ళు

రిపోర్టు :

విప్లవ రచయితల సంఘం దశాబ్ది (8వ మహాసభ) ఉత్సవాలు

కె ఆర్ ఎం.

భారతీయ సాహిత్య చరిత్రలోనే మొట్టమొదటి సారిగా ప్రజల పక్షం వహించి ప్రజాయుద్ధ పల్లవిని పాడుతున్న విప్లవ రచయితల సంఘం దశాబ్ది ఉత్సవాలు కొడవటిగంటి కుటుంబరావు నగర్ (లాల్ బజార్) సికింద్రాబాద్‌లో 1980 అక్టోబర్ 17,18,19 తేదీల్లో ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి.

అనేకమంది విప్లవ సాహిత్యాభిమానుల, విరసం సభ్యుల విప్లవాకాంక్షల మధ్య 17వ తేదీ ఉదయం 9 30 గం॥లకు విరసం పతాకావిష్కరణ జరిగింది. "ఎత్తినాం విరసం జెండా" 'ఎర్రజెండెర్రజెండెన్నియ్యలో', 'కష్టజీవులం, మేము కమ్యూనిస్టులం' పాటలు సభ్యులు పాడగా అనేకమంది గొంతెత్తి ఆ పాటల్ని ఆలపించారు. 'విప్లవ రచయితల సంఘం వర్ధిల్లాలి', 'ప్రజాకళలు

సినిమాలు, సెక్సుపుస్తకాలు, డిటెక్టివ్ నవలలు, తెలుగు మహాసభలు, సోషలిజం వాగ్దానాలు, అవతరణ మహోత్సవాలు, food for workలు, మొసలి కన్నీళ్ళు, గాంధీ టోపీలు, కంకి కొడవళ్ళు ... ...) తయారు చేయండోరె'' అని మేల్కొలపటం అన్నమాట. వాళ్ళు చల్లగుంటేనే కదా. మనంగూడ చల్లగుండేది.

మిగిలిన సమయాల్లో మనవాళ్ళు పహారాహుషార్‌గా వుంటారనుకో. ఎప్పుడూ నిఘా వేసే వుంటారు. చీమ చిటుక్కుమంటే చాలు జైళ్ళు తుపాకులు, నోళ్ళు తెరుస్తాయి. ఎదురుదాడులని వార్తలొస్తుంటాయి. మళ్ళీ చెపుతున్నా వాటి వివరాల్లోకి వెళ్ళక వాటి గురించి ఈ విరసం, నక్సలైట్ల గురించి, నోరెత్తిన జనం గురించి ఎంత తక్కువరాస్తే అంత మంచిది మన పేపరులో ఎంత తక్కువ జాగా ఇస్తే అంత మంచిది-" అని ఎడిటరు ఎల్లారెడ్డిగారు విలేఖరి వెంకట్రావు తెచ్చిన 10 పేజీల విరసం దశాబ్ది వుత్సవాల సభల వ్యాసాన్ని చించిబుట్టదాఖలు చేశారు. "నీ దగ్గరున్న కాడినుంచి గుండె రెప రెప కొట్టుకొంటుంది. కష్టపడి రాశావేమో మరే పేపరుకైనా పంపించకుండా వుంటావా! (పంపినా వాడూ వేసుకోడనుకో. ఆడు మనలాటోడేగదా) అని కళ్ళజోడు సరిజేసుకొన్నాడు.

వర్ధిల్లాలి' అని నినాదాలు చేస్తూ ప్రతినిధులు మహాసభ ప్రాంగణంలోనికి ప్రవేశించారు. సభంతా విప్లవోత్తేజంతో కలకలలాడింది, పెద్ద సంఖ్యలో విప్లవం పట్ల ఆకాంక్ష వున్న రచయితలు కవులు సాహిత్యాభిమానులు హాజరయ్యారు. సభ ప్రారంభానికి ముందుగా ఆహ్వాన సంఘం తరఫున కె. శివారెడ్డి, చేకూరి రామారావు గార్లు ప్రతినిధులకు స్వాగతవచనాలు పలికారు. తర్వాత సభకు విరసం కార్యదర్శి కె.వి. రమణారెడ్డి అధ్యక్షత వహించారు. బెంగాల్ నుంచి విప్లవ రచయితల, కళాకారుల, మేధావుల సమన్వయ సంఘం తరఫున వచ్చిన సౌహార్ద ప్రతినిధులు ఉత్పల్ దాస్, అరుణ్ సన్యాల్, దేవవ్రత పాండాలను సురా సభకు పరిచయం చేశారు. వీరే కాక ఢిల్లీ, బొంబాయి, మద్రాసు మొదలైన పలుచోట్ల నుండి ప్రతినిధులు సభకి హాజరయారు. సుప్రసిద్ధ తెలుగు కథకులు రావిశాస్త్రి, కాళీపట్నం రామారావు ఈ సభల్లో పాల్గొన్నారు. తన ప్రసంగంలో రావిశాస్త్రిగారు— 'జీవితంలో సంఘర్షణలని పరిశీలించి చెప్పాను. దానివల్లనే నాకేమైనా మార్క్సిజం అలవడవచ్చున'న్నారు. పిదప కాళీపట్నం రామారావుగారు కూడా విరసం పట్ల తన మద్దతు ప్రకటిస్తూ మాట్లాడారు

ఈ సందర్భంగా వెలువడిన 15 కొత్త పుస్తకాలు ఆవిష్కరించబడ్డాయి. వానిలో మరో ఝంఝ-విరసం కవితా సంకలనం, కళలు- శాస్త్రవిజ్ఞానం- కొకు వ్యాసాలు, మరో ప్రస్థానం - శ్రీశ్రీ విరసం దశాబ్ది కవితలు-విరసం ప్రచురణలు. రష్యన్ భల్లూకప్పట్టులో ఆఫ్ఘనిస్తాన్-క్రాంతి ప్రచురణ ఈశాన్య భారత్ రాజకీయ, ఆర్థిక చరిత్ర-యుగప్రచురణ కవితా విప్లవాల స్వరూపం, కళలు-సాహిత్యం ఎవరికోసం?- సృజన ప్రచురణలు. రుద్రజ్వాల 'జనం కదిలింది జాగ్రత్త' నాటిక, భూపాల్ ''పేకోల పోచమ్మ'' బతుకమ్మపాట, చెరబండరాజు కవితా సంకలనం 'పల్లవి' కూడా ఉన్నాయి. కార్యక్రమం ముగిసిన తర్వాత కార్యదర్శి నివేదిక చదివారు. విరసం ఏర్పడ్డ నాటి నుంచీ నేటివరకు చేసిన కృషినీ, దాని జయాపజయాలనూ ఆయన వివరించారు.

17 మధ్యాహ్న విరామానంతరం ప్రారంభమైన విరసం పదేళ్ళ కృషి సభకు త్రిపురనేని మధుసూదనరావు అధ్యక్షత వహించారు. విరసం పదేళ్ళ కృషిలో కవితా సృజన గూర్చి కె. హనుమంతరెడ్డి, సాహిత్య విమర్శపై వి. చెంచయ్య, పాటలగూర్చి హిమజ్వాల ప్రసంగించారు. తర్వాత రాత్రిచాలా పొద్దుపోయేవరకు సాంస్కృతిక కార్యక్రమాలు సాగాయి.

రెండవ రోజు సభలో "సాహిత్యంలో మార్క్సిస్టు దృక్పథం'' అనే అంశం మీద కె. వి. ఆర్. ప్రసంగించారు.

మధ్యాహ్న విరామం తర్వాత సమావేశమైన సభకు వంగపండు ప్రసాదరావు అధ్యక్షత వహించారు. "ప్రజాపోరాట సాధనాలుగా కథ నవల" అన్న విషయం మీద అల్లం రాజయ్య మాట్లాడారు 'పాట ఇతర కళారూపాలు' అన్న అంశం మీద వర్గీస్ ప్రసంగించారు. తర్వాత 'నాటకం-సినిమా' గూర్చి కాకరాల గారు వివరించారు. ఆర్థిక రంగం సృజనాత్మక రంగాన్ని ఆక్రమించడం 1960 వరకు జరిగిపోయిందని ఇది జరగకుండా బెంగాల్‌లో రుత్విక్ ఘటక్, తెలుగులో రాజారావు ప్రయత్నించారనీ ఆయన అన్నారు ప్రస్తుత నాటక రంగం - ట్రెడిషనల్ థియేటర్, ఎక్స్‌పరిమెంటల్ థియేటర్, ప్రొటెస్ట్ థియేటర్‌లుగా వుందనీ ఫ్యూచర్ థియేటర్ (భావినాటక రంగం) ఇంకా ఏర్పడవలసివుందనీ ఆయన సూచించారు.

తర్వాత రాత్రి 60 మంది పైగా కవులు పాల్గొన్న 'కవి సమ్మేళనం' జరిగింది. కవి సమ్మేళనం ప్రారంభానికి ముందు మధుసూదనరావు మాట్లాడుతూ సంప్రదాయ వాదుల్ని దుయ్యబట్టారు. అభ్యుదయం, విప్లవం ముసుగుల్లో వస్తున్న అనేక సిద్ధాంతాలను ఆయన ఖండించి వాటిపట్ల జాగ్రత్తగా వుండాలని హెచ్చరించారు. విశేషం ఏమిటంటే అరుణ్ సన్యాల్, ఉత్పల్ దాస్, శ్రీమతి సశిపాండాలు బెంగాలీ కవితల్ని, పాటల్ని వినిపించారు. కవి సమ్మేళనం తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి

మూడవరోజు ఉదయ సమావేశానికి నమ్మ్మ అధ్యక్షత వహించారు త్రిపురనేని మధుసూదనరావు కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యం గూర్చి మాట్లాడారు కొ. కు శాస్త్రీయ దృక్పథం ఉన్న విప్లవమేధావి అనీ ఆయన ప్రజల్లో శాస్త్రీయ దృష్టిని పెంపొందింపచేయడానికి తన జీవితకాలాన్నంతా వెచ్చించారనీ ఆయన అన్నారు. తర్వాత టి. కృష్ణాబాయి కుటుంబరావు సతీమణి శ్రీమతి వరూధినిగారిని సభకు పరిచయంచేశారు సభ ఆ క్షణంలో ముక్తకంఠంతో కుటుంబరావుకు జోహార్లర్పించింది. ఆ తర్వాత శ్రీశ్రీ సాహిత్యం మీద సి రామచంద్రారెడ్డి, దామెర రాములు మాట్లాడారు. మధ్యాహ్నం రెండు గంటలకు విరసం సర్వసభ్య సమావేశంతో మూడు రోజుల సభాకార్యక్రమాలు ముగిసాయి.

సాయంత్రం 6-30 గంటలకు కాచిగూడ స్టేషన్ నుండి విరసం ఆధ్వర్యంలో ఊరేగింపు గౌలిగూడ బస్‌డిపో దాకా సాగింది. బస్ డిపో దగ్గరున్న వి పి కన్యా పాఠశాలలో చెరబండరాజు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది సభాస్థలానికి 'జ్ఞానేశ్వర్ కీర్తినగర్' అని పేరుపెట్టారు. (అమరుడు కామ్రేడ్ జ్ఞానేశ్వర్ కీర్తి గత సంవత్సరం కృష్ణాది కొండయ్య అనే దుండగుని

చేత హత్యచేయబడ్డ విరసం సభ్యుడు.) సభకు అధిక సంఖ్యలో జనం హాజరయ్యారు. ఆ సభలో బెంగాల్ కవి దేవవ్రతపాండా ప్రసంగించారు తర్వాత కె. వి. రమణారెడ్డి మాట్లాడుతూ విరసం ప్రజల ప్రయోజనాలకోసం పని చేస్తున్నదనీ తమిళనాడు, కర్నాటక రైతుల పోరానికి మద్దతు ప్రకటిస్తుందనీ అన్నారు. వరవర రావు మాట్లాడుతూ విప్లవం ఇవాళ నిత్యజీవితంలో అనివార్యమైన విషయమైపోయిందని అన్నారు. నక్సల్బరీలో అంటుకున్న నిప్పురవ్వ అక్కడ ఎంతసేపు వెలిగిందో గానీ ఇవాళ తూర్పుతీరప్రాంతమంతా, దేశంలోని అత్యధిక భాగం దాని ప్రభావానికి లోనైందనీ, ఇక విప్లవాన్ని ఆపడం ఎవరి తరమూ కాదనీ అన్నారు. కె. హనుమంతరెడ్డి మాట్లాడుతూ విప్లవోద్యమానికీ, విప్లవ సాంస్కృతికోద్యమానికి వున్న అవినాభావ అనుబంధాన్ని వివరించారు. తర్వాత కాశీపతి మాట్లాడుతూ కొందరు ప్రభుత్వ కిరాయి కవుల వలె కాక విరసం ప్రజలపక్షం వహించిన నిజమైన ప్రజాసంస్థ అని అన్నారు. ఎంగిలి కూటికి పాలకుల కమ్ముడుబోయిన కవుల్ని ఆయన నిరసించాడు విరసం నూతన కార్యదర్శి త్రిపురనేని మధుసూదనరావు - విరసం పదేళ్ళలో ఎన్నో నిర్బంధాలకు, హింసలకూ గురైందనీ అయినా అది ప్రజలకోసం అవిరామంగా కృషి చేస్తున్నదనీ అన్నారు.

బహిరంగ సభలో కొ. కు. సతీమణి శ్రీమతి వరూధిని గారు ప్రతి సంవత్సరం ఎన్నికైన ఒక 'ఉత్తమ విప్లవ కథ'కు 500 రూపాయల కొ. కు. అవార్డు వుంటుందని ప్రకటించారు. న్యాయనిర్ణేతలుగా రావిశాస్త్రి, కా. రా. వ్యవహరిస్తారు.

ఉపన్యాసాల తర్వాత గద్దర్ 'నక్సల్బరీ బిడ్డలు' ఒగ్గు కథ, అరుణోదయ రామారావు 'నీలం రామచంద్రయ్య బుర్రకథ', చీరాల జననాట్య మండలి 'పంట' నాటకం మొదలైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

అవ్వ భయం

మద్దూరు శ్రీనివాసులు

కట్టేస్తే ఎద్దు
పొడవ బోతోంది
కాళ్ళకాడి కుక్క
కరవ బోతోంది
ఇదేందిరో నాయనో ?!
కలికాల మిట్టా కాలిపోతోంది.

అడవి

పాపినేని శివశంకర్

అలిసిపోయిన అడవి నిద్రపోతోంది
ఆదమరచిన అడవి నిద్రపోతోంది
అర్థరాత్రి—
ఎక్కడో గాయపడ్డ లేడి అరుపులు తప్ప
ఏవో కీచురాళ్ల వేదనా సంగీతం తప్ప
అంతా నిశ్శబ్దం.
సర్పానికి కబళమయ్యే కప్ప గొంతులో గుర గుర తప్ప
కూటికీ గూటికీ దూరమైన వెర్రి పిట్ట ఏడుపు తప్ప
ఎంతో నిశ్శబ్దం.
పొదమాటున పులి ఎరకోసం కదులుతోంది.
ఎర మింగిన కొండ చిలువ మత్తుగా మెదులుతోంది.
సింహ పంజా కంటిన నెత్తుటి జీర ఆరుతోంది.
రక్తం తాగిన హైనా గర్రున తేన్చుతోంది.
ఆద మరచిన అడవి నిద్రపోతోంది.
ఆకులాడని అడవి నిద్రపోతోంది.
పహారా హుషార్ !
కానీ ఉన్నట్టుండి
ఇవేమిటీ కారు మేఘాలు ?
అడవి చీకటిని చీలుస్తూ ఒక మెరుపు.
అడవి నిద్రను వదిలిస్తూ చలి పిడుగు.
అడవి కూకటి వేళ్లను పెకలిస్తూ పెను తుఫాను.
దెబ్బతిన్న లేడి గొంతుకలో చేతనా హుంకారం !
దిగులు పడే కుందేలు గుండెల్లో విప్లవాహంకారం !
చెట్టు చెట్టుకూ గుట్ట గుట్టకూ నూతనోచ్ఛ్వాసం !
పొద చాటున పులి వెన్నులో చలి.
అజగరావస్థలో అలజడి.
సింహానికి శరభ స్వప్నం.
ఆకులాడని అడవి నిద్రలేచింది !
ఆకలెత్తిన అడవి నిద్రలేచింది !!

పిలుపు

సి.సి.

తెలంగాణం తిరిగి రాజుకుంది
ఈశాన్యం నుండి ఉత్తరార్కాట్
వరకు మంటలంటుకున్నాయ్ ...

యిప్పటికే ఎంతో ఆలస్యమైంది
మంటల్ని ఆర్పే
ఫైరింజన్లు మాస్కోనుంచి రావాలి !

మళ్ళీ నిన్ను, నన్ను బోనుల్లో
బంధించడానికి సన్నాహాలు జరుగుతున్నయ్ !
మనగొంతులు నులిమేసి
'సంఘర్షణ'ల జపం చేస్తారు.

"జీవితాన్ని దర్శించకు
కలాన్ని కదిలించకు
నోరు మెదపకు
కళ్ళకు చూపులెందుకు ?
ఈ శాసనాన్నుల్లంఘించకు
ఉరితాడుకు బలికాకు !!"

యంత్రం కోర్కెలడగదు
యంత్రం సమ్మెచేయదు
యంత్రం తిరగబడదు
మనిషికి యంత్రానికి తేడాలేదా ?
'ఖాకీ'కి 'ఖద్దరు' కూ తేడాఏదీ !!

దిక్కులు చూడకు
సమయం ఆసన్నమైందని యుద్ధరంగం
లోని వాస్తవాలు కేకలేస్తున్నాయి !
అరణ్యాలు కంచుదుర్గాలైనాయి.

(మిగతా 57వ పేజీలో)

గెరిల్లా

సూరి

పిక్కిలి పిట్టలు
కిల, కిల ధ్వనులు చేస్తూ
గూడు చేరుకొంటున్నాయి
జింకలు, కుందేళ్ళు
స్వేచ్ఛగా
నీరు తాగి
ఆనందంతో
గంతులు వేస్తూ
అడవిలోకి పరిగెడుతున్నాయి
చీకటి కమ్మిన
ఆకాశం
తొడుక్కున్న ఎరుపు కాంతులు
నా
ప్రయాణాన్ని
గుర్తు చేస్తున్నాయి
పసుల గాసే పిల్లగాడు
పాట పాడుతూ
పోతున్నాడు
రేపు వస్తానంటూ-
ఈ అడవి
చెట్లు, గుట్టలు
నాకు
'ఉక్కుకోట'గా
ఉంటా నంటున్నాయి
రాలిపోతున్న
ఈ ఆకులు
నా అడుగు జాడలు
శత్రువుకు
తెలియనీయవు
హోరుగా
వీచేగాలి
నా
తుపాకి మీద
సంగీతం మీటుతూ
ముందుకు నడుపుతుంది-నన్ను.
నేనంటే
మండు ఎండలకు
దాహం వేస్తుంది
తుఫాను గాలులు
నా ఊపిర్లుగా
మారుతాయి
చీకటి
నా కాళ్ళకు దారి చూపుతూ
వెలుగు కోసం నాతో పయనిస్తుంది.
ఎక్కడో
దూరంగా
సాంస్కృతిక దళం
'జైత్రయాత్ర, జైత్రయాత్ర
దోపిడిపై దండయాత్ర' అని
పాడుతున్న
గొంతు
సన్నగా వినపడుతూ ఉంది
ఆ పాటలో...
నా
అడుగుల చప్పుడు
కదులుతూ ఉంది.

ఏతులెంకటి
(కలుపుపాట)
భూపాల్

ఎడమసేతి గడియారం
ఎన్ని ఱేములాయెరో   ఏతుల ఎంకాటిగా ॥
ఏడూర్ల ముంచెటోడ
ఎన్నడు సస్తావురో   ,,   ,,
గోట్లే కాయ ముక్కోడ
గోళీ నెగ జెక్కరో   ,,   ,,
దోతి అంచు దుక్కిదున్నె
సైకిలెక్కి పోరో   ,,   ,,
గట్టేంట వోయెటోడ
గిత్తలు కుమ్మేనురో   ,,   ,,   ॥ఎడమసేతి॥
కష్టమేది శాతగాక
తెల్లబట్ట లేస్తివా   ,,   ,,
ఏలిముద్ర గాళ్ళనంత
ఎలుగు జేస్త నంటివా   ,,   ,,
పేదోళ్ళ ఇంట్లపుట్టి
పాటేలు నన్నావురో   ,,   ,,   ॥ఎడమ॥
అంగిసెమట తోని తడిసె
ఆగన్నా పోరో   ,,   ,,

(55వ పేజీ తరువాయి)

పల్లెల్లో వెన్నెల పంటలకు
పొలాలు సాగుచేయబడ్డాయి.
నేడు పసిపిల్లల కేరింతలు కూడ
శత్రువు గుండెను దిగజార్చుతాయి

మనందరిని ఎర్రబావుటాలు
పిలుస్తున్నాయి యుద్ధరంగంలోకి.

తాలూకాపీసుకింక
శానచేమె వుందిరో ,, ,,
సోపతోళ్ళు లుచ్ఛగాళ్ళు
ఏం సిన్నావోరురో ,, ,,
బలిసిన సేపతి పట్టి
బతుకే మరిశావురో ,, ,, ॥ఎడమ సేతి॥
ఓటల్లా పొంటిమెక్కి
ఒలపటి దునైన్నతివా ,, ,,
మంది సత్క దినుకుంట
మదపు ఏన్గ వై తివా ,, ,,
ఊరికి ఉపకారంగా
చెందాలన్నావురో ,, ,,
చందాలు దిగమింగీ
చెయ్యాూ జూపి స్తివా ,, ,,
దగాకోరు దలాలోడ
దమ్మిడి గొరగావురో ,, ,, ॥ఎడమ సేతి॥
అయ్యకొడుకు కయ్యమొస్తె
కోరటు తిప్పావురో ,, ,,
అచ్చరమూరాంది జూసి
కచ్చీరన్నావురో ,, ,,
అంజిమాను అప్పానీ
ఆరొందలు తింటివా ,, ,,
ఎలెంబి అప్పానీ
ఏడొందలు తింటివా ,, ,,
బ్రరె గొర్రె కప్పులాని
బత్తల జేశావురో ,, ,, ॥ఎడమ సేతి॥
పేదోళ్ళ ఇంట్ల పుట్టి
పేదల సంపేవురో ,, ,,
నెత్తు రొడిసి పంట దిసె
నీ వోళ్ళను జూడరో ,, ,,

చెమట కార్చి చేలు పెంచె
నీ తమ్ముళ్ల జూడరో ,, ,,
తనువు మాగి దుక్కి దున్నె
నీ తండ్రుల జూడరో ,, ,,
పల్లెటూరి చీడపురుగ
పక్కలిరుగుతాయిరో ,, ,, ॥ఎడమసేతి॥

కంటి వెలుగు

విమల

మూసుకు పోతున్న కళ్ళను తెరచి
నీ రెప్పలకి వాస్తవాల ప్లాస్టర్లేసి
లోకాన్ని చూడమంటున్నాం మేము-
చుట్టూ పచ్చటి పంటలు మాత్రమేకాదు
గాదెలకూ కష్టం చేసిన కడుపులకూ మధ్యన
అగాధంలాంటి "కరువు"న్నది
చుట్టూ వెన్నెల్లాంటి వెలుగేకాదు
ఎర్రటి ఎండలాంటి వేడున్నది.
చూడు-
ఇంత కాలం
పువ్వుల పరిమళాల్ని,
చిరునవ్వుల విలాసాల్ని,
బలిసిన దేహాల్ని మాత్రమే
చూసే కళ్ళని
కలల కావ్యాలు పఠించే
కళ్ళని
విప్పార్చి
పూలచెట్ల పాదుల్ని చేసే
చేతుల్ని చూడమంటున్నాం.
చిద్విలాసాల కింద

చితికి పోయిన బతుకుల్ని
చూడమంటున్నాం.
బతుకోసం రగులుతున్న
పల్లెల్ని, పల్లె పల్లవిని
మీటుతున్న అడవుల్ని
చూడమంటున్నాం.

ఒక గీతం

జూకంటి జగన్నాథం

ఈ రాత్రి
నేనో చెరవీడుతున్న నేలని.
ఈ రాత్రి
నేనో జీవనదిని.
ఈ రాత్రి
నేనో రగుల్కొంటున్న అడవిని.
ఈ రాత్రి
నేనో అలజడి సముద్రాన్ని.
ఈ రాత్రి
నేనో స్పందిస్తున్న హృదయాన్ని.
ఈ రాత్రి
నేనో గురిపెట్టబడ్డ తుపాకిని.
నేను
ఈ రాత్రి అంచున
తలెత్తి నిలిచే
తెల్లని జొన్నకంకిలాంటి
లైట్ హౌస్ ఉదయాన్ని
మరుగుతున్న గుండె కొలిమిలోంచి తీసి
సానబట్టి
నా జాతి చేతుల్లో ఉంచిన
సాయుధ గీతాన్ని

మార్క్సిజం-సాహిత్యం-చర్చ :

పెట్టుబడిదారీ వ్యవస్థ - కళలు

(ఆగస్టు/సెప్టెంబర్ సంచిక తరువాయి)

మార్క్స్ థియరీస్ ఆఫ్ సర్ ప్లస్ వాల్యూ మొదటి వాల్యూంలో "పెట్టుబడిదారీ వ్యవస్థలో భౌతిక ఉత్పత్తి కొన్నిరకాల మేధాగతమైన (Spiritual) ఉత్పత్తికి ప్రతికూలంగా వుంటుంది. ఉదా : కళలకూ, కవిత్వానికీ''16 అన్నాడు.

పెట్టుబడి దారీ వ్యవస్థలో కళలు వృద్ధి చెందవని మార్క్స్ అంటున్నాడంటే దానికి కారణం—మనిషి కృత్రిమ విలువల్ని పాటించేవాడుగా, పరాధీనుడుగా, ఓ శకలంగా, ఏకాకిగా, అసాహిత్యాన్ని, నీచ సంస్కృతిని ఆనందించేవాడుగా మారినందువల్ల ఆ వ్యవస్థ పాలకవర్గ భావాలు సాంస్కృతిక రూపాల్లో ప్రచారం చేయబడతాయి కనుక విచక్షణ, వివేచన లేని సామాన్యులు అర్ధరహితంగా, సారహీనమైన జీవితాల్ని గడుపుతుంటారు.

ఉత్తమ సాహిత్యాన్ని, కళల్ని ఆనందించగల శక్తి వారికుండదు. అయితే ఎంతటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా ఎవరో కొందరు పాఠకులుంటారు కనుక వారి కోసం నిజమైన సాహిత్యం ఉత్పత్తి అవుతుంది. 19వ శతాబ్దంలో బాల్జాక్, విట్మన్, టాల్ స్టాయ్ లు, 20వ శతాబ్దంలో పికాసో, థామస్ మన్, ఫాల్ కనర్, ఛాప్లిన్ లను అందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

కాపిటలిజం కళలకు వ్యతిరేకి అంటే దానర్థం ఆ నాటి వ్యవస్థకు వ్యతిరేకంగా రాయబడే సాహిత్యమని కాదు. ఎటువంటి కళలైనా (విషయపరంగా, సిద్ధాంతపరంగా) ఆ వ్యవస్థలో ఆదరణ పొందవని మాత్రమే అర్థం చేసుకోవాలి. తిరోగమన వాదులు, యథాతథ వాదులు (విశ్వనాథ సత్యనారాయణ ఒక ఉదా :) మత వాదులు తప్ప ఆ వ్యవస్థలో ఇతరులు ఆదరింపబడ్డానికి వీల్లేదు. ఆ పైన ఆ సాహిత్యం ఒక విప్లవ సిద్ధాంతాన్ని (ఉదా : మార్క్సిజం) ఆధారం చేసుకుని వ్యవస్థను కూల దోసేదిగా వున్నప్పుడు అట్టి సాహిత్యానికి కర్తలయిన రచయితల పట్ల ఆ వ్యవస్థ అమానుషంగా వ్యవహరిస్తుంది. అంతమాత్రాన సిద్ధాంతపరంగా (Ideological basis) మాత్రమే కళలను కాపిటలిజం నిరోధిస్తుందనుకుంటే మనం మార్క్స్ ను తప్పుగా అర్థం చేసుకున్న వాళ్ళ మవుతాం.

సిద్ధాంతపరమైన రచనల్ని బహిరంగంగా నిరోధించి, సిద్ధాంతం లేని అభ్యుదయ రచనల్ని కళాత్మకరచనల్ని ఉపేక్షించి (indifference) పెట్టుబడిదారీ వ్యవస్థ మొత్తం సాహిత్యాన్నే వ్యతిరేకిస్తుంది.

అయితే కమ్యూనిస్టు సాహిత్యాన్ని, రచయితల్ని మాత్రమే ప్రభుత్వం నిర్బంధిస్తుంది కనుక ఒక్క కమ్యూనిస్టు సాహిత్యం తప్ప మిగిలిన సాహిత్యమంతా ప్రభుత్వానికి అనుకూలమైనదిగా నిర్ణయిస్తారు మార్క్సిస్టు విమర్శకులు. ఇది వారి దురవగాహనను ప్రతిబింబిస్తుంది. చలం గారి రచనల్ని ఈనాటికీ సభ్య (సాహితీ) ప్రపంచం అంగీకరించడం లేదు. ప్రభుత్వానికి ఒక్క సిద్ధాంత పరమైన సాహిత్యం తప్ప ఇతర సాహిత్యం తన ఉనికికి భంగం కల్గిస్తుందని తెలీనంత మాత్రాన- ప్రభుత్వ దృష్టినే మనం అంగీకరించడం శోచనీయం.

తర్వాత అదే పెట్టుబడిదారీ వ్యవస్థ శాస్త్ర పరిశోధనల్ని (sciences) ప్రోత్సహించడం గమనార్హం. ఎందుకంటే సైన్సు భౌతిక ఉత్పత్తికి వెన్నెముక లాంటిది- నిజానికి శాస్త్ర ప్రగతి పెట్టుబడిదారీ వ్యవస్థలోనే పరాకాష్ఠ నొందింది.

పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా 19వ శతాబ్దారంభంలోనే- యూరప్‌లో తిరుగుబాటు చెలరేగింది. కాల్పనిక కవులు బూర్జువా విలువల్ని గర్హిస్తూ, తమ వ్యక్తిత్వాన్ని, స్వేచ్ఛను ప్రతిపాదించి ఆనాటి వ్యవస్థను చాలా బలంగా నిరసించారు.

కాల్పనిక కవి ఆ వ్యవస్థలో జీవించలేక ఏకాంతాన్ని ఆశ్రయించాడు. బూర్జువా విలువల్ని కాల్పనికులు తిరస్కరించినంతగా మరొకరు తిరస్కరించ లేదంటే ఆశ్చర్యం లేదు. వాస్తవాన్ని మార్చాలన్న జిజ్ఞాస వారికి లేకపోవడం వల్ల జీవితం పట్ల, సంఘం పట్ల ఉదాసీనత వ్యక్తమయింది వారి కవిత్వంలో. 1850 ప్రాంతాల్లో బాల్జాక్, స్టెంథాల్ (Stendhal)లు రియలిజాన్ని ఆవిష్కరించారు. దాంతో వాస్తవ జీవితాన్నుండి పారిపోవడం మాని, జీవిత చిత్రణకు ప్రాముఖ్యత పెరిగింది.

తర్వాత 'కళ కళ కోసమే' అని ప్రవచించిన వుద్యమం తమ కళను అర్థం చేసుకోగల పాఠకులు లేరనే నిస్పృహ, నిరాశల వల్ల వ్యాప్తి చెందింది. తాను సృష్టించిన కవిత్వాన్ని ఆనందించడానికి బయట లోకంలో పాఠకుడు లేనందువల్ల తన కవిత్వానికి తానే పాఠకుడిగా మారాల్సి వస్తుంది కవి. కవిది ఆనాడు అంతటి దుర్భర స్థితి. "ప్రపంచంలో అన్నిటికన్నా అందరికన్నా కవి ఎక్కువ అకవి. దాని క్కారణం అతడు ఇతరులను గుర్తిస్తుంటాడు కాని అతనికి గుర్తింపు వుండదు. సూర్యుడు, చంద్రుడు, సముద్రం, పురుషులు, స్త్రీలు ఎవరైతే వుత్తేజానికి బానిసలో వారి జీవితం కవితాత్మకంగా వుంది. వాటికి ఓ చెదరని గుణం వుంది. కాని కవికి ఏ గొప్ప లక్షణమూ లేదు.

ఏ గుర్తింపూ లేదు. కవితప్పనిసరి దేవుడి సృష్టిలో ఒకే ఒక కవితాత్మకంగా బతకని జీవి.''[88]—కీట్స్

—రిచర్డ్ వుడ్ హౌస్‌కు 27 Oct' 1818 నాడు రాసిన వుత్తరంలో కీట్సు ఇలా రాశాడు. ఈ వుత్తరంలోని వాక్యాలు పెట్టుబడిదారీ వ్యవస్థలోని కవి దుర్దశను, అనామకతను తెలియచేస్తాయి 150 సంవత్సరాల క్రితమే కవి వ్యక్తిత్వం లేని తన జీవితాన్ని చూసి అలా విలపించాడు.

"కవికీ సామాజిక స్థితిగతులకీ మధ్య ఐకమత్యం లోపించినప్పుడే కళకళ కోసమే' అనే సిద్ధాంతంలో కవికి నమ్మక మేర్పడుతుంది.[17] అని ప్లెఖనోవ్ అన్నాడు. ఈనాడు కూడా కొందరు కవులు తమ కవిత్వానికే ప్రాముఖ్యత నిస్తున్నారంటే దానిక్కారణం ఆ కవికీ, సమాజానికి సఖ్యత లేదనుకోవాలి. దీనిని బట్టి ఏ సమాజంలోనైనా ద్రష్టమైన కవి ఏదో విధంగా తాను, జీవిస్తున్న సమాజానికి వ్యతిరేకంగా పోరాడడాన్ని రుజువవుతుంది

సృజనాత్మకత_ఇంద్రియగ్రహణశక్తి

మనిషి మనిషిగా అత్యున్నత స్థాయిలో జీవించడానికి సున్నితత్వం, బలంగా, ఉద్రేకంగా ప్రతిస్పందించగల శక్తి, దుఃఖాన్ని ఆనందంగా స్వీకరించ గల శక్తి, అనుభూతి ప్రధానమని మార్క్స్ భావించాడు

"To be sensuous is to suffer, Man as an objective sensuous being is therefore a suffering being — and because he feels what he suffers a passionate being. Passion is the essential force of man energetically bent on its object"[18] అని మార్క్స్ రాశాడు

దేన్ని గురించైనా అనుభూతి చెందకుండా ఉద్రేకించడం జరగదు. ఉద్రేకాన్ని పొందినవాడు మాత్రమే సున్నితుడు. సున్నితత్వం లేకుండా బాధపడడం అసాధ్యం బాధపడకుండా ఏ మనిషైనా ఏమీ చెయ్యలేడు.

"మనిషిగా బాధ పడ్డప్పుడు, ఆవేదనకు లోనైనప్పుడు ఆ బాధ, ఆవేదన అంతరాత్మకు ఆనందాన్నిస్తాయి"[19] అని మార్క్స్ రాశాడు. ఈ భావన ఎపిక్యూరస్‌కు దగ్గరగా వుండడం గమనార్హం.

ఇంద్రియానుభూతికి మార్క్స్ ఎంతో ప్రాధాన్యత నిచ్చాడు. ఇంద్రియానుభూతి కొరవడిననాడు మనిషి సంపూర్ణంగా జీవించలేడు. కవిత్వాన్ని గాని కళలను గాని ఆనందించడానికి ఇంద్రియానుభూతి అవసరం.

అనుభూతికన్నా ఆలోచన ఉన్నతమైనదని భావించేవారికి సమాధానంగా మార్క్స్ "మనిషి తన వునికిని బాహ్య ప్రపంచంలో ఒక్క ఆలోచించడం ద్వారానే కాక అన్ని ఇంద్రియాలతో నిర్ధారిస్తాడు"[20] అని రాశాడు. కవిత్వాన్ని, సంగీతాన్ని, ఇతర కళల్ని ఆనందించడానికి మనిషికి అవసరమైన ప్రాథమిక లక్షణాల్ని గురించి మార్క్స్ వివరించాడు.

జంతువు (జంతుస్థాయిలో వున్న మనిషి కూడా)కూ, మనిషికీ-గుణాత్మకంగా గల తేడాను గూర్చి కూడా మార్క్స్ చర్చించాడు.

"ఒక వస్తువును ఆనందించడంలో మనుష్యస్థాయిలోని కన్ను, చెవీ, జంతు స్థాయిలోని కన్ను, చెవి లకన్న వేరుగా, ఉన్నతంగా ఆనందిస్తాయనేది అందరూ ఎరిగినదే"[21]

"జంతువులు కూడా ఉత్పత్తిచేస్తాయి. పక్షులు గూళ్ళు కట్టుకుంటాయి. తేనెటీగలు, చీమలు తమ నివాసాల్ని నిర్మించుకుంటాయి. అయితే జంతువులు తమ తక్షణ అవసరాలకోసం మాత్రమే నిర్మించుకుంటాయి జంతువు ఏకపక్షంగా నిర్మించుకుంటుంది. కాని మనిషి సార్వజనీనంగా వుత్పత్తి చేస్తాడు. జంతువు తన తక్షణ అవసరాల ఒత్తిడికి లోనైనప్పుడు మాత్రమే ఉత్పత్తి చేస్తుంది. కాని మనిషి తక్షణ అవసరాలుండనప్పుడు కూడా ఉత్పత్తిచేస్తాడు. నిజానికి అతను భౌతికావశ్యకత నుండి స్వేచ్ఛ పొందినప్పుడు మాత్రమే సృష్టిస్తాడు. జంతువు తన జాతి ననుసరించి మాత్రమే నిర్మిస్తుంది. కాని మనిషి అన్ని జాతుల ననుసరించి ఉత్పత్తిచేస్తాడు. అతనికి అంతర్గత ప్రమాణాన్ని వస్తువులకు ఎలా అనువర్తింపచెయ్యాలో కూడా తెలుసు మనిషి అందువల్ల వస్తువుల్ని సౌందర్య సూత్రాల కనుగుణంగా తయారు చేస్తాడు."[22]

దీన్నిబట్టి తక్షణ భౌతికావసరాల కతీతంగా దృష్టి నిలపగలిగిన వాడు మాత్రమే సాహిత్యాన్ని సృష్టించగలడు, ఆనందించ గలడని తెలుస్తుంది.

భౌతికావసరాల పరిధిలో జీవించే మనిషి కళల్ని అందుకే ఆనందించలేడు.

"స్వత ఆస్తిని రద్దుచెయ్యడం ద్వారా మానవేంద్రియాలకు పూర్తి స్వేచ్ఛ లభిస్తుంది"[23] అని మార్క్స్ రాశాడు. మానవేంద్రియాలకు స్వేచ్ఛ లభిస్తేనే నిజమైన మనిషి ఉద్భవిస్తాడని మార్క్స్ గాఢంగా నమ్మినట్లు మనకు తెలుస్తుంది.

"సంగీతం మాత్రమే మనిషిలో నిద్రాణమైవున్న సంగీతాభిరుచిని

మేల్కొలుపుతుంది......ఎంతో అందమైన సంగీతం కూడా సంగీతాన్నానందించలేని వాడిలో ఎట్టి చలనాన్ని కల్గించలేదు. ఎందుకంటే ఆ మనిషి శ్రవణేంద్రియానికి అది లక్ష్యంకాదు. దీనికి కారణంగా- ప్రధానమైన(essential) శక్తిని ధృవీకరించడం ద్వారా మాత్రమే నా లక్ష్యాన్ని చేరుకోగలను. నా వ్యక్తిగతశక్తి (Subjective capacity) ఇందులో ప్రముఖ పాత్ర వహిస్తుంది. కనుక ఒక వస్తువును ఆనందించగల నా ఇంద్రియగ్రహణశక్తి నా ఇంద్రియాలు చేరుకోగలంత దూరం మాత్రమే వెళ్లగల్గుతుంది".[24]

పై వాక్యాల్ని బట్టి కళాభిరుచి, సాహిత్యాభిలాష గల మనిషి మాత్రమే కళల్ని, సాహిత్యాన్ని ఆదరించగలడని, స్పృశించగలడని తెలుస్తుంది. అవిలేని వాళ్లు సాహిత్యం బాగోగుల్ని నిర్ణయించడం వల్లే ఇవ్వాళ సాహిత్య అవగాహన లోపించడానికి గల కారణం సాహిత్యాన్ని ఆనందించాలనుకునేవాడికి సాహిత్యానికి చెందిన ఇంద్రియాలుంటే తప్ప లాభం లేదు.

"మనిషి తన మొత్తం సారాన్ని సంపూర్ణరీతిలో సంపూర్ణ మానవుడిగా తీర్చి దిద్దు కుంటాడు"[25] అని మార్క్స్ నమ్మాడు. అలా సంపూర్ణ మానవుడు కావడానికి సాహిత్యం తోడ్పడుతుంది.

"ఇంతవరకూ చరిత్ర సాగించిన శ్రమ వల్లే పంచేంద్రియాలను సాధించ గల్గింది"[26] అని మార్క్స్ రాశాడు.

దీని వల్ల వుత్త తెలుసు కోవడానికి, అనుభూతి, అనుభవం ద్వారా తెలుసుకోవడానికి గల తేడాను మార్క్స్ స్పష్టంగా గుర్తించినట్లు తెలుస్తుంది.

నిరుద్యోగ సమస్య, వేశ్యావృత్తి సమాజంలో వున్నట్లు అందరికీ తెలుసు. అయితే వాటికి వ్యతిరేకంగా పోరాడాలంటే అలా తెలిసి వుండడం చాలదు. తెలిసిన వేలాది జనం అది అనారోగ్యకరమని తెలిసికూడా వాటికి వ్యతిరేకంగా పోరాడ్డం అలా వుంచి వాటిని వినియోగపర్చుకుంటున్నారు -ఉద్యోగం కోసం లంచమిచ్చి, తమ కామాన్ని చల్లార్చుకోవడం కోసం వేశ్యనాశ్రయించి.

నిజమైన సాహిత్య పాఠకుడు సంఘం ఆమోదించిన ఆ పనుల్ని విరోధించి వాటికి వ్యతిరేకంగా జీవిస్తాడు, జీవించడానికి ప్రయత్నిస్తాడు. సునీల్ గంగోపాధ్యాయ 'ప్రతిద్వంది' (తర్వాత సత్యజిత్ రే తీసిన అదే 'ప్రతి ద్వంది' సినిమా), కుప్రిన్ 'యామా ది పిట్' చదివిన వాడి జీవితానికి, చదవని వాడి జీవితానికి వుండే తేడాను మనం గమనించొచ్చు. శ్రమ శక్తి విలువ గ్రహించి మొదటిసారిగా మార్క్స్ శ్రమ ప్రపంచాన్ని, మనిషిని మార్చినట్లే

సృజనాత్మక క్రమకూడ అదే విధంగా, అంతకన్నా ఉన్నతమైన స్థాయిలో మనిషినీ, మనిషి జీవిస్తున్న సమాజాన్ని ప్రభావితం చేస్తుంది.

కాల్పనికులకు (శుద్ధ కళావాదులు కూడా) మార్క్సిస్టు రచయితలకు మధ్య గల అభేధం లేదా ఏకత్వం :

కాల్పనికులకు, మార్క్సిస్టు రచయితలకు మధ్య ఏకత్వమేమిటని మామూలుగా ఎవరైనా ఆశ్చర్యపడతారు. అయితే రెండు విషయాల్లో నాకు వారి మధ్య పోలికలు, ఏకత్వం కనిపించాయి. వాటిని నిరూపించడం కూడా ఏమంత కష్టమైన పనికాదు

1. ఏ రచయితైనా మానవుడి ఔన్నత్యం కోసం నిబద్ధుడవుతున్నాడా, లేదా అన్నది మనం ముఖ్యంగా చూస్తాం. ఇది ప్రాథమిక నిబద్ధత. మార్క్సిస్టు రచయితలకు ఈ నిబద్ధత అత్యంత ప్రధానమైనది. అయితే తోటిమానవుడి కోసం నిబద్ధుడైన పిదప తన నిబద్ధత సఫలం కావడానికి ఏ ప్రాపంచిక దృక్పథం తోడ్పడుతుందో ఆ దృక్పథానికి కూడా నిబద్ధుడౌతాడు ఏ రచయితైనా. అలా నిబద్ధుడవడం వల్ల ప్రజల్ని జాగరూకుల్ని చెయ్యడంతో పాటు వాళ్ళకు మార్గదర్శి కూడా కాగలుగుతాడు.

అయితే ఇవ్వాళ మార్క్సిస్టు రచయిత తన ప్రాపంచిక దృక్పథానికి మాత్రమే నిబద్ధుడవడం మనం చూస్తున్నాం. తమ ప్రాపంచిక దృక్పథమే (Ideology) మానవుడి క్షేమాన్ని కోరేది కనుక ఇంక వేరే ప్రత్యేకంగా మానవుడి కోసం నిబద్ధుడవడమేమిటని ఏ మార్క్సిస్టు అయినా ప్రశ్నించొచ్చు.

జీవితాన్ని బలంగా, గాఢంగా శ్వాసించకుండా, జీవితంతో తీవ్రంగా రియాక్ట్ కాకుండా సిద్ధాంతానికి బద్ధుడైన వ్యక్తి (రచయిత) జీవితాన్ని గురించి మాట్లాడ్డానికి అనర్హుడు.

'కళ కళకోసమే' అని నమ్మే కవి కవితా విలువలకీ, శిల్పానికీ మాత్రమే బద్ధుడవడానికి మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథానికి ఏ భేదమూ లేదు. ఇద్దరిలో లోపిస్తున్నది జీవితం పట్ల, మొత్తం మానవ జాతి పట్ల అవసరమైన నిబద్ధత. కనుక వ్యతిరేకుల్లా కనిపించే వీరికి ఈ విషయంలో ఏ తేడా లేదు.

ఈ విషయాన్ని గూర్చి ఎంగెల్స్ వ్యాఖ్యలిలా వున్నాయి.

28 నవంబరు 1885 నాడు మిన్నాకాట్స్కి అనే రచయిత్రికి రాసిన ఉత్తరంలో సామ్యవాద నవల తన ఆశయాన్ని పూర్తిగా సాధించాలంటే రచయిత వాస్తవ జీవిత చిత్రణ చెయ్యాలి. అలా చెయ్యడం ఆనాటి కృత్రిమమైన,

అసత్యమైన విలువల్ని ధ్వంసం చేసి బూర్జువా పాఠకుల ఆశావాదాన్ని నిర్మూలిస్తుంది. తమ విలువలు శాశ్వతం అనుకుంటున్న వారి నమ్మకాల్ని బద్దలు చేస్తుంది. ఈ పని చెయ్యడానికి రచయిత ఎటువంటి సమాధానం ఇవ్వాల్సిన అవసరం గాని, ఏ వర్గం వైపు వుండాల్సిన అవసరంగాని లేదు."27

ఎంగెల్స్ ఏప్రిల్ 1888లో మార్గరెట్ హార్క్‌నెస్ అనే రచయిత్రికి రాసిన మరో వుత్తరంలో "రచయిత తన సామాజిక, రాజకీయ అభిప్రాయాల్ని వెలిబుచ్చుతూ రాసే సోషలిస్టు నవల రాయనందుకు కాదు నిన్ను విమర్శించడం. నా ఉద్దేశ్యం అది కానేకాదు. రచయిత తన అభిప్రాయాల్ని ఎంత దాచివుంచితే రచనకు అంత మేలుచేకూరుతుంది"30 అని రాశాడు. అదే వుత్తరంలో "రచయిత అభిప్రాయాలు ఎలా వున్నప్పటికీ అవి అతని రచనకు భంగం కలగించని రీతిగా వెలువడే సాహిత్యమే రియలిజం అని నా వుద్దేశ్యం దానికి వుదాహరణగా నేను బాల్జాక్‌ను తీసుకుంటాను. బాల్జాక్ నా దృష్టిలో భూత, భవిష్యత్, వర్తమాన కాలాలకు చెందిన అనేక మంది జోలాల (Zola) కన్నా గొప్పవాడు."28

కనక రచయిత ఏ ఐడియాలజీని నమ్మకపోయినప్పటికీ వాస్తవికతను, సంక్లిష్టమైన జీవిత వైరుధ్యాల్ని తన రచనల్లో చిత్రిస్తాడు కనుక తప్పనిసరిగా ఆనాటి వ్యవస్థకు చెందిన కృత్రిమ విలువల్నిధ్వంసం చెయ్యగలడని తెలుస్తుంది. మన దగ్గర చలం, కొ.కు, దాసో, గోపీచంద్‌లను ఉదాహరణగా చెప్పవచ్చు.

బాల్జాక్ ప్రగతి నిరోధకుడు, జోలా ప్రజాస్వామ్య, అభ్యుదయ వాది అయినా ఎంగెల్స్ బాల్జాక్‌నే ఎన్నుకోవడాన్ని బట్టి రచనా పటిమ వున్న వాస్తవిక వాది రచనలు, రచనా శక్తి లేని అభ్యుదయ, విప్లవవాది రచనల కన్నా గొప్పవనే ఎంగెల్స్ అభిప్రాయమని తెలుస్తుంది.

తర్వాత సిద్ధాంతాల్ని రచనల్లో వెలిబుచ్చితే రచనలు కళాపరంగా క్షీణిస్తాయని ఎంగెల్స్ అభిప్రాయం. మనం ఈనాడు అదే చూస్తున్నాం.

2. యూరప్‌లో 19వ శతాబ్దారంభంలో ప్రబలిన రొమాంటిక్ కవిత గతాన్ని తల్చుకుని దుఃఖిస్తుంది. వర్తమాన జీవితాన్ని భరించలేక గతం గొప్పగా వుండేదని నమ్మి ఆ గతంలోకి పారిపోయేవారు—మానసికంగా వూరట చెందడం కోసం. రొమాంటిక్ కవిత ఏ దేశంలోనైనాసరే తర్వాత కాలంలో అదే లక్షణాలతో వెలువడింది. వాస్తవ జీవితంపై ఆధారపడని వారి కవిత్వం ఆ విధంగా గతంలోకి పయనించింది.

అదే విధంగా నేటి మార్క్సిస్టు కవులు భవిష్యత్తులోకి పరుగెత్తుతున్నారు. వాస్తవ జీవితాన్నుండి ఉత్తేజం పొందడం మాని, సమస్యకు తమకు తెలిసిన సమాధానాన్ని గురించి రాస్తున్నారు. భవిష్యత్ జీవితం పడ్డానికి ఏ సిద్ధాంతాన్ని నమ్మడం మంచిదో ప్రవచించడంలో నిమగ్నులయ్యారు. సమస్యల చిత్రీకరణకి ప్రాధాన్యత తగ్గి వారి దగ్గర వున్న రెడీమేడ్ సమాధానాల్ని ప్రచారం చెయ్యడం మాత్రమే వారి లక్ష్యంగా మారింది. కనుక వీరి రచనలకి కూడా వాస్తవ జీవితం భూమిక కాకుండా పోయింది. కాల్పనిక కవులు వాస్తవాన్నుండి గతంలోకి, ఊహాలోకాల్లోకి పారిపోతే విప్లవ కవులు అదే వాస్తవం నుండి భవిష్యత్ లోకాలకి పారిపోతున్నారు. ఊహాజనిత లోకాలకి (utopia) తమ సిద్ధాంతంలో చోటు లేదని ఓ ప్రక్క నమ్ముతూనే మరో ప్రక్క ఇలా స్వైర విహారాలు. దీనికి కారణం వాస్తవాన్ని నగ్నంగా, ఏ ఆచ్ఛాదనలు లేకుండా స్వీకరించే స్థైర్యం లేకపోవడం.

ఏ సిద్ధాంతాన్ని జోడించకుండా చూసినప్పుడు భయానకంగా కనిపించి వాస్తవం సిద్ధాంతాల కళ్ళజోడు గుండా చూడగానే ఆశాజనకంగా, భరించడానికి అనువుగా మారుతుంది వీరికి.

వాస్తవం సున్నితుడైన వ్యక్తిలో సృష్టించే ఆందోళనను, కసిని, కాల్చివేసే తపననూ, దుఃఖాన్నీ, నిరాశను, ఆనందంతో స్వీకరించ గల ధైర్యం లేని బలహీనులు ఈ విధంగా ఓ శుభ దినాన పేచీ లేకుండా సిద్ధాంత జంధ్యాన్ని ధరించి రంగప్రవేశం చేస్తారు.

ప్రతి రచనలో నియమం తప్పకుండా సిద్ధాంతాన్ని ఏదో రూపంలో సరఫరా చేస్తుండడం సాధారణమై పోయింది. ఈ పదేళ్ళలో విరసం ప్రచురించిన, ఆదరించిన కవిత్వం, పాటలు, ఇతర రచనలు ఈ కోవకు చెందినవే.

సమస్యకు సమాధానం చెప్పకుండా పాఠకుడ్ని సందిగ్ధావస్థలో వదిలి పెడుతున్నారన్న పేరిట ఎందరో రచయితల్ని (ఉదా; చలం) వీరు విమర్శించడం అందరూ ఎరిగినదే.

కనుక ఈ విషయంలో కూడా భావకవులకూ, విప్లవ కవులకూ పైకి శత్రువుల్లా కనిపించినా నిజానికి ఏ తేడా లేదు.

ఈ విషయాన్ని గురించి మిన్నా కాట్స్కీకి రాసిన అదే ఉత్తరంలో "రచయిత అభిప్రాయాలు, సమస్య పట్ల అవగాహన సహజంగా రచనలో వ్యక్తం కావాలి తప్ప రచయిత తానుగా వ్యక్తం చెయ్యకూడదు. అయినా అసలు రచయిత తాను చిత్రీకరిస్తున్న సామాజిక సమస్యలకు భవిష్యత్ చారిత్రక సమాధానాల్ని ఇవ్వకూడదు"[29] అని రాశాడు.

దీన్ని బట్టి జీవితంతో గాఢపరిచయం గల రచయిత సిద్ధాంత పరిజ్ఞానం లేకున్నా పాఠకుడ్ని చైతన్యవంతుణ్ని చెయ్యగలడని, జీవితంతో పరిచయం లేని రచయితకు సిద్ధాంత పరిజ్ఞానం ఏ విధంగానూ ఉపకరించదనీ ఎంగెల్స్ అభిప్రాయంగా తెలుస్తుంది.

తర్వాత, రచనల్లో రచయిత సిద్ధాంతాల్ని పాఠకులపై రుద్ద కూడదని కూడా తెలుస్తుంది. సమస్యకు పరిష్కార మివ్వడం కూడా అసంగతమైన పనిగా తెలుస్తుంది. అలా చెయ్యడం పాఠకుడికి ఏమీ వుపయోగ పడదని ఎంగెల్స్ అభిప్రాయం. కాని ఇవ్వాళ మనం ప్రతి మార్క్సిస్టు రచనలో ఎంగెల్స్ ఏదైతే కూడదన్నాడో అదే చూస్తున్నాం.

పతనమైన (శిథిలమైన) చైతన్యం—వివరణ

20వ శతాబ్దం మొదలుకొని పాశ్చాత్య సాహిత్యంలో వెలువడ్డ అనేకానేక సాహిత్యోద్యమాల్ని, సాహిత్యాన్ని మార్క్సిస్టు విమర్శకులు బూర్జువా సాహిత్యం. క్షీణసాహిత్యం అనే పేరిట విమర్శిస్తుంటారు. ఈ క్షీణ సాహిత్యానికిచెందిన రచయితల్లో డి. హెచ్. లారెన్స్, జాయిస్, కాఫ్కా, కామూ, బెకెట్ (Becket) సర్రియలిస్టులు ఇంకా కొందరు వస్తారు. వీళ్ళంతా తమ రచనా విషయాన్ని బట్టిచూస్తే బూర్జువా విలువలకు వ్యతిరేకంగా సాహిత్య వ్యాసంగాన్ని కొనసాగించిన వాళ్ళే.

మన భాషలో ఆ సాహిత్యం ఇంతవరకూ చెప్పుకోదగినంత రాలేదు కనుక మన దగ్గర ఆ విమర్శ పెద్దగా కనిపించదు. మనకూ ఆ కోవకు చెందిన రచయితలు లేకపోలేదు వారిలో అజంతా, బైరాగి, బెల్లంకొండ రామదాసు-చెప్పుకోదగ్గ వాళ్ళు. ఈ ముగ్గురిపై మార్క్సిస్టుల విమర్శ అందరూ ఎరిగినదే. ఈ మధ్య రామదాసుగారి 'పునర్జన్మ' నాటకాన్ని పాశ్చాత్య భావాలను అరువు తెచ్చుకున్న నాటకంగా కె.వి. రమణారెడ్డి గారు విమర్శిస్తూ ఓ పత్రికలో రాశారు.[30] అస్తిత్వవాద రచనల్ని విమర్శించే 'సాంప్రదాయ' రచయిత, విమర్శకుడు కానా సుబ్రహ్మణ్యానికి, విప్లవ రచయిత, విమర్శకుడు కె.వి. రమణారెడ్డిగారికి ఈ విషయంలో ఏకతాభావం తప్పలేదు.

ఈ రచనలు మనిషిని ఏకాకిగా, అనామకుడిగా, విధ్వంసవాదిగా, నిరాశావాదిగా చిత్రీకరిస్తాయని చెప్పి మార్క్సిస్టుల విమర్శ.

అయితే మార్క్సుకు 18వ శతాబ్దం ఫ్రెంచి భౌతికవాది, అరాచకవాది అయిన డిడ్రో (Diderot) అభిమాన గద్యరచయిత. 'Ramean's nephew' అనే అతని రచన మార్క్సుకు ఎంతగానో నచ్చిన రచన. హెగెల్

ఆ రచనను గురించి తన "ఫినామినాలజీ ఆఫ్ మైండ్" (Phenomenology of mind)లో చర్చిస్తాడు. 15వ ఏప్రిల్ 1869 నాడు డిడ్రో రచనను ఎంగెల్స్‌కు పంపిస్తూ రాసిన వుత్తరంలో ఆ రచనను గూర్చి మార్క్స్ చర్చిస్తాడు [31]

విప్లవానికి ముందు కాలంలో కృత్రిమ విలువలు చలామణీ అయ్యే ఓ సమాజంలో మనిషి నైతికంగా, మానసికంగా ఎలా పతనమైపొయ్యేది వివరిస్తుందీ రచన. ఇలా పతనమైన మనిషి తన పతనావస్థను అంగీకరించి దొంగ విలువల్ని పోషిస్తూ పైకి సజ్జనుడిలా నటించే పెద్దమనుషుల్ని పరిహసిస్తాడు. ప్రపంచాన్ని నిరసిస్తాడు.

నైతిక విలువలు పూర్తిగా క్షీణించి, అరాచకత్వాన్ని సహజంగా, ఆరోగ్యవంతంగా స్వీకరించే సమాజంలో—ఇలా వాస్తవాన్ని ఎలాంటిముసుగు లేకుండా అంగీకరించి తన పతనావస్థను, అరాచకత్వాన్ని విలువలలేమిని ధైర్యంగా ప్రకటించే వ్యక్తి క్రమంగా ఆ దుర్భరస్థితిని మానసికంగా కొంత వరకు అధిగమిస్తాడు. అలా కాకుండా సమాజం, తాను చాలా ఆరోగ్యంగా వున్నట్లు నమ్మి-భ్రమల్లో జీవితాన్ని గడిపేవాడు నిజానికి ఎంతో అల్పుడు. మతాన్ని, అంధ నమ్మకాల్ని కూడా అతను నిరసిస్తాడు. డిడ్రో ఇట్టి అరాచకవాదిని అభినందిస్తూ రాసిన రచన ఇది. ఈ రచన మార్క్స్ ఎంగెల్స్‌లను ఎంతో ప్రభావితుల్ని చేసింది. ఈ రచనతోపాటు డిడ్రోదే మరో రచన 'Jacques the Fatalist' ను కూడా ఉత్తమ రచనగా పరిగణించారు [32]

డిడ్రో, రూసో, వోల్టేర్‌లకు ముందు సమాజంలో మనిషికి తన జీవితంలో ఏదో ఓ అర్థం, విలువ గోచరించేవి క్రైస్తవ మతం కూడా బలంగా వుండేది. కనుక మనిషి ఏదో ఒక అతీతశక్తిని నమ్మి ఆశావాదంతో జీవించేవాడు. యాంత్రికనాగరికత వ్యాపిస్తున్న కాలంలో, బూర్జువా వ్యవస్థ బలపడుతున్న ఆ కాలంలో సమాజంలో వస్తున్న నూతన మార్పులకు ప్రతినిధి ఈ డిడ్రోపాత్ర. అటువంటి పాత్ర సాహిత్యంలో (తత్వశాస్త్రంలో) సృష్టించబడ్డం అదే మొదటి సారి గెథె, షిల్లర్‌లు కూడా ఈ రచనను గొప్ప రచనగా స్వీకరించారు. హెగెల్ తన 'Phenomenology of Mind'లో ఆనందంగా లేని మనిషిమానసిక స్థితికి చిహ్నంగా ఈ రచనను చర్చించాడు.[33] ఆ తర్వాత 19 వ శతాబ్దంలో ఈ విషయాన్ని ఆధారంచేసుకుని సాహిత్యం వెలువడడం ప్రారంభమైంది. డాస్టవిస్కీ, టర్జనీవ్‌లు ఈ సాహిత్యంలో ప్రముఖులు. వీరి సాహిత్యంలో జార్ కాలంలో రష్యన్ జీవితం ఎంతగా పతనమైందో తెలుస్తుంది. డాస్టవిస్కీకి కూడా డిడ్రో అభిమాన రచయిత.

ఇవ్వాళ బహురూపాల్లో వ్యక్తమవుతున్న ఈ సాహిత్యాన్ని మార్క్స్ బీజరూపంలో వున్ననాడే అవగాహన చేసుకోగల్గాడు.

"ప్యూపిల్స్ పేపర్" వార్షికోత్సవ ఉపన్యాసంలో మార్క్స్ "ఒక వైపు యాంత్రిక, శాస్త్రీయ పురోగతివల్ల క్రొత్త, సామాజిక శక్తులు రంగ ప్రవేశం చేశాయి. మరోవైపు రోమన్ రాజ్యం కూడా ఎరగనంత భయంకర మైన మార్పులు - క్షీణిస్తున్న, పతనమౌతున్న మానవ విలువలు, మనిషి ప్రకృతిపై విజయాన్ని సాధిస్తూనే మరోవైపు మరోమనిషికి బానిసగా లేదా తనలోని కించత్వానికి బానిసగా మారుతున్నాడు. సైన్సు వెదజల్లే కొత్త కాంతులు కూడా అజ్ఞానాన్ని వెలిగించలేక పోతున్నాయి"[84] అన్నాడు.

ఇలా సమాజంలో శాస్త్రప్రగతి పొందుతూ కూడా మనిషి దిగజారి పోవడాన్ని మార్క్స్ గమనించాడు. అట్టి తీవ్ర వైరుధ్యాలున్న సమాజంలో మనిషి డిడ్రో సృష్టించిన పాత్రమాదిరిగా మారక తప్పదు.

తాను చూసిన ఈ విబేధాలకు, వైరుధ్యాలకు మార్క్స్ తన మార్క్సిస్టు తత్వశాస్త్రం ద్వారా సమాధానాన్ని ఇచ్చాడు. ముఖ్యంగా కాపిటల్‌లో. అదే వుపన్యాసంలో మార్క్స్ "సాహిత్య, కళారంగాల్లో విజయాల్ని కళాకారుడు నైతికంగా పతనమైతే తప్ప సాధించడం లేదు"[85] అని కూడా అన్నాడు. ఇక్కడ మార్క్స్ పతనమై తమ పతనావస్థను అధిగమించాలని ప్రయత్నించే రచయితలను, కవులను గూర్చి చెపుతున్నాడు. 19వ శతాబ్దం చివరి భాగం నుండి (డాస్టవిస్కీ) ఈ తరహా సాహిత్యం మొదలైంది. అంతకు పూర్వం గెథె, లెస్సింగ్, షిల్లర్, నొవాలిస్, ఇంకా అంతకు పూర్వం రెబెలయిస్, డావిన్సి లాంటి వాళ్ళు 19వ శతాబ్దం రచయిత ఎదుర్కొన్న స్థితిని ఎరగరు-కనుక వారి జీవితంలో ఓ విధమైన శాంతి, ఆనందం, సంపూర్ణత వుండేవి. 19వ శతాబ్దం నుండి సాహిత్యంలో అశాంతి, దుఃఖం, నిరాశ, కృత్రిమ విలువలపై- పోరాటం మాత్రమే కనిపిస్తాయి. ఆ సాహిత్యమే నేడు కాఫ్కా, కామూ, బెకె, సెలిన్ మొదలగు రచయితల రచనల్లో కూడా మరింత సంక్లిష్టంగా చోటుచేసుకొంది.

అదే ఉపన్యాసంలో మార్క్స్ ఇట్లా కొత్తగా జన్మిస్తున్న సమస్యలను గుర్తెరగనట్లు నటించే వాళ్ళనుద్దేశిస్తూ "కొందరు ఈ ఆధునిక వైరుధ్యాల్ని వదిలించుకోవడానికి, ఆధునిక కళల్ని వదిలించుకునే ప్రయత్నం చెయ్యవచ్చు"[86] అన్నాడు. ఆధునిక కళలు ఈ వైరుధ్యాల్ని ప్రతిబింబిస్తున్నాయి కనుక వాటిని చదవకపోతే ఆ సమస్యల బారినుండి తప్పించుకోవచ్చుననుకునేవారిని ఉద్దేశించి విమర్శించిన సందర్భమది.

మార్క్సిస్టులు ఇన్నేళ్ళుగా చేసింది కూడా అదే ఆధునిక మానవుడి జీవిత వైరుధ్యాల్ని చూడ్డం ఇష్టం లేక ఆ వైరుధ్యాల్ని గురించి వచ్చిన ఆధునిక సాహిత్యాన్ని నిరసించారు రకరకాల పేర్లు పెట్టి.

మార్క్సు విమర్శ వారికి చక్కగా వర్తిస్తుంది.

తెలుగు దేశంలో మార్క్సిస్టు సాహిత్యాన్ని గురించి చర్చించిన ఈ వ్యాసాన్ని ముగిస్తూ విప్లవ సాహిత్యంలో సాహిత్య విలువలు కొరవడడానికి గల ప్రధాన కారణాన్ని చెప్పుకొందాం.

"మనుషులు విప్లవకారుల్లా ఆలోచిస్తారు, కాని సామాన్యుల్లా, సంస్కార హీనుల్లా అనుభూతినొందుతారు" (ట్రాట్స్కీ)[37]

సామాన్యుల్లా అనుభూతి (Feeling) చెందుతూ, విప్లవకారుల్లా ఆలోచించడం వృథా. విప్లవకారుల్లా ఫీలై విప్లవకారుల్లా ఆలోచించిన్నాడు మాత్రమే విప్లవం సాధ్యం.

సురేంద్రరాజు

* * * *

Notes

16. Karl Marx, 'Theories of Surplus Value', P. 285, Progress Publishers Moscow, 1963

17. G. Plekhanov, 'On Arts for Art's Sake' – Marxists on Literature—An Anthology, Penguin 1975

18. Karl Marx, Economic & Philosophical Manuscripts of 1844 P. 146, Progress, Moscow, 1977

19. Ibid P. 101

20. Ibid P. 102

21. Ibid P. 102

22. Ibid pp 73, 74

23. Ibid P. 101

24. Ibid pp. 102, 103

25. Ibid p. 100

26. Ibid p. 103

27. Marx-Engels, Selected Correspondence, p. 263

28. Ibid p. 270

29. Penguin Edition, p. 268

30. కె. వి. రమణారెడ్డిగారి ఈ వ్యాసం పూర్వం ఓ పుస్తకంలో ప్రచురించబడింది. అయితే అదే వ్యాసాన్ని తిరిగి ఈ మధ్య 'మోహన జ్యోతి'లో అచ్చువేశారు.

31. Marx-Engels, Selected Correspondence, Marxist Library Publication.

32. Ibid

33. Hegel, phenomenology of Mind, pp. 516, 543 George Allen & Unwin, London, 1971.

34. From Speach at the anniversary of the People's Paper by Marx. April 14, 1856, Marx & Engels-selected works. Vol. I, p. 500 Progress, Moscow, 1973,

35. Ibid p. 500

36. Ibid p. 501

37. Marxism & Literary Criticism-Eagleton p. 1.

38. The Letters of John Keats, Vol. I. p. 387 Horward University Press, Cambridge, 1958.

సవరణ : సృజన నవంబరు 1980 సంచిక 104వ పేజీలో ప్రచురించబడిన కొడవటిగంటి కుటుంబరావు గారి సాహిత్యలేఖ ('ఇజాల గురించి, అనుకరణల గురించి') సృజన ఫిబ్రవరి 1968 (సంచిక-6)లో నుండి పునర్ముద్రితం. కొ. కు. ఫిబ్రవరి '68లో ఆ లేఖ రాశారు.

ఇది ఎలిజీ కాదు

— గోదారి

1

మొన్న సూర్యోదయంలో నిలుచున్న... వాడెవడో రవివర్మ సూర్యోదయం కాదది... బాణాల్లా దూసుక పోతూ ఎగిరే పక్షులు- నెత్తురు రంగులో తానమాడిన కల్లోల డార్జిలింగ్ సూర్యోదయమది... బువ్వ తినడం - గాలి పీల్చడం లాగే గన్ను పేల్చడం కూడా మన దినచర్య - మనకు టూ- అక్షరాల సిరా మరకల వెనుక మానవుల మాంసం, చీము, నెత్తురు సంస్పందన వి టూ బస్ స్టాండు కేసి నడిచిన...

2

పాచి ముఖ తో కమిలిపోయిన గోడ ముఖాలు చూసిన... ఎవడో పసి పిల్లవాడు తన మురికి లేత చేతులల్లో ఒక చేత్తో కన్నీరు తుడుచుకుంటూ- ఇంకొక చేత్తో తన ఎదురు బొచ్చె చీల్చి అందులో వేలు ముంచి వొంకర టింకరగా రాసిన రాతలు... నరాలు మెలి తిరిగిపోయి- కడుపు అవిసిపోయి వెధవ దుఃఖం రానన్నా రాదు... కాసేపు ఏడ్చి ఈ బరువును దించుకుందామంటే- చిల్లర మల్లర దినమంతా, బతుకంతా ఏడ్చి కన్నీరెప్పుడో ఇగిరి పోయింది జనానికి...

3

పోసీ దబ్బనంతో నా కళ్ళు పెకిలించి ఆ నెత్తురుతో కవిత్వం రాద్దామని మూడు దినాల నుంచి పిచ్చెత్తినట్టు తిరుగుతున్న... దొంగ కవులు మాటలన్నిటిని మురికి చేశారు... నేను ఈ అక్షరాలను అ ఖ్యాకంగానే తినేసిన .. నేనిప్పుడు ఈ క్షణం దాకా కుంపటి మీద కూర్చుండి అచ్చంగా ఒక ఎలిజీ రాద్దామని గింజుకుంటున్న...

4

కంక పొదలు సుడిగాలిలో జువ్వున వంగిపోతూ కుమిలి కుమిలి ఏడుస్తున్నాయి... జొన్నంబలి, కారం కాసిపెట్టిన తొడసం జంగుమట్టిలో పొర్లుతున్నాడు ఏడుస్తూ... ఇంతకు ముందే ఒళ్ళంతా తడిమిన రుక్కా బాయి గుండెలు బాదుకుంటూ పరుగులు పెడుతోంది. కంజుపిట్ట తన చికిలి కళ్ళు మూస్తూ, తెరుస్తూ ఏడుస్తోంది. మందు నూరిన పరధామ భిక్యా తుపాకి గుండు తొలిచిన గుండె కాయ వేపు వెర్రెత్తినట్టు చూస్తున్నాడు...

మానవతా విలువలు

హత్యలు చేసి...

భార్గవా కమీషన్ జరుగకుండా కుట్ర చేసినపుడే చెన్నారెడ్డి కూడా ఎదురు కాల్పుల పేరుతో రాజకీయ ప్రత్యర్థులను నోరు నొక్కదల్చుకున్నాడని స్పష్టమైంది. 78 జులై 25న గిరాయిపల్లి మృతవీరులసభలో మాట్లాడుతూ ప్రజాకవి కాళోజి ఈ విషయాన్నే వెంగళరావు కన్నా చెన్నారెడ్డి రెండు ఆకులు ఎక్కువే చదివాడని చెప్పాడు. 'తండ్రి తంతెల మీద ఎరిగితే కొడుకు కొనేట్లో ఎరిగాడ'నే కథతో వీళ్ళ స్వభావాలను వివరించాడు.

నక్సలైట్లను, వాళ్ళ సానుభూతిపరులను పట్టుకొని వెంగళరావు ఏ అడవుల్లోనో కాల్చివేసి 'ఎదురు కాల్పుల్లో...' మరణించారని ప్రకటిస్తే, చెన్నారెడ్డి హయాం లో పోలీసులు పట్టణాల్లో, జన సమ్మర్దం గల ప్రాంతాల్లో పట్టుకొని పట్టణ శివార్లలోనే కాల్చివేసారు.

5

1979 ఇంకా సూర్యోదయమన్న కాకముందే నిద్ర మొహాల బొగ్గు మనుష్యుల ముందు హక్కుల గురించి అరుస్తున్న అకీచు గొంతు వేలాది ఎర్ర మందారాల తోట నడుమ మాసియాంగ్ ఎర్ర బ్యాడ్జి పొందిన ఆ యువ మందారపు మందహాసం- దిక్కులకు ఎర్రడాలు కమ్మిస్తోంది. పర్వతాల లోయల్లో కంకర్రాళ్ళ మీద- అడవి కడుపు అగ్నిగుండంలో అతను వీర యోధుని పాత్ర ధరించి చిందులు వేయడం...

6

కవిత్వంలో ఇవన్నీ ఎట్లా ఒదుగుతాయి... ఓ కవులారా గాయకులారా మీరైనా రాయరా? మీరైనా పాడరా? నా వేళ్ళ కొసలు చిట్లి నెత్తురు కారుతోంది నేనింకా ఎలిజీ రాయలేదు... ఓనా అక్షరాల్లారా మీరైనా గొలుసులు రండి...ఓ అడివి పిట్టలారా మీరైనా పాడండి ఈ చరిత్ర నిర్మాతలు ఈ తొలి పొద్దు కిరణాలు- ఈ ఎన్నెల కూనలు- ఈ వెలుతురు పిట్టలు- ఈ చిర జీవుల గురించి- ఓనా ప్రజా కవులారా మీరైనా రాయరా?

7

"పెద్ది శంకర్ అమర్ హై"

ఎవరినైనా చంపాలంటే ఏం పేరు పెట్టాలో, ఏం కథ సృష్టించాలో ఎదురు కాల్పులు - ఫిర్యాదు, విచారణ, సాక్ష్యం లేని ఎంత సులువైన ఏకపక్ష రాజకీయ వెసులుబాటో అటు తమిళనాడుకు, ఇటు మహారాష్ట్రకు కూడ ఆంధ్ర పోలీసులే శిక్షణ యిచ్చి వచ్చారు.

ఆంధ్రప్రదేశ్ నూతన పోలీసు మంత్రి మహారాష్ట్ర ప్రభుత్వానికి గోదావరి దాటుతున్న ఆదిలాబాద్ కరీంనగర్ రైతాంగ పోరాటాలను 'ఎదురు కాల్పుల'తో మొగ్గలోనే తుంచవలసిందిగా స్వయంగా సలహా యిచ్చాడట. ఫలితమే చంద్రపూర్ జిల్లా సిరొంచ తాలూకా మొయిన్‌బిన్ పేటలో ఏరివేత కార్యకలాపాల్లో తిరుగుతున్న మహారాష్ట్ర పోలీసుల కాల్పులు. నవంబర్ 2వ తేదీన ఈ గ్రామంలోని రైతాంగంతో మాట్లాడి తిరిగి వస్తున్న రాడికల్ యువజన సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పెద్ది శంకర్‌ను పోలీసులు పట్టుకొని కాల్చివేసి 'ఎదురు కాల్పుల్లో' మరణించాడని ప్రకటించారు.

కామ్రేడ్ పెద్ది శంకర్ ఆదిలాబాద్ జిల్లా బెల్లంపల్లి కార్మిక కుటుంబంలో పుట్టాడు. ఆర్ ఎస్ యు విద్యార్థిగా, ఆర్ వై ఎల్ పూర్తి కాలం కార్యకర్తగా బొగ్గుగని కార్మికుల్లో పనిచేస్తూ ఖమ్మం రాడికల్ యువజన మహాసభల్లో మావో బ్యాడ్జిని పొందాడు సి పి ఐ ఎం ఎల్ (పీపుల్స్ వార్) నాయకత్వంలో ప్రజాయుద్ధ కర్తవ్యాన్ని మోసుకొని గోదావరికి ఆ తీరాన గల మహారాష్ట్ర గ్రామాల్లో ప్రవేశించాడు. ఓటు కెదిగిన యువకుడు (23 సంవత్సరాలు) ఈ ఓటు (ఓటి) రాజ్యం బుల్లెట్ స్వభావాన్ని బుల్లెట్‌తో ఎదుర్కోవాలని చెప్తూ పోలీసు బుల్లెట్లకు బలయ్యాడు.

'ఆంధ్ర ప్రదేశ్‌లో ఇందిరా వెంగళరావులతో ఆరంభించబడి తమిళనాడులో ఇందిరా రామచంద్రన్‌లతో పునఃప్రారంభమై ఇవ్వాళ మహారాష్ట్రకు ఇందిరా ప్రభాకర్ రెడ్డి, అంతులే కుట్రగా సోకిన ఈ ఎన్‌కౌంటర్ల పేర హత్యల మహమ్మారికి' కారణమేమిటి?

నక్సలైట్ల మీద, వాళ్ళ సానుభూతిపరుల మీద, ఇందిరా రాజకీయ ప్రత్యర్థుల మీద పోలీసులు మోపుతున్న కుట్రకేసులు, హత్య, దొమ్మి, దోపిడీ మొదలైన కేసులు దాదాపు అన్నీ అబద్ధాలని రుజువవుతున్నాయి. ప్రజలు

తీవ్రవాదులకు వ్యతిరేకంగా కోర్టులో సాక్ష్యం చెప్పడానికి భయపడుతున్నారని ఈ మధ్యనే పాపం ఒక సెషన్స్ జడ్జి వాపోయాడు కూడ. అంటే తప్పుడు కేసులు, బనాయింపు సాక్ష్యాలు, బెదిరింపులు, హింస, అప్రూవర్లను చేయడానికి ప్రయత్నాలు, డబ్బు, ఇన్‌ఫార్మెంట్ ఉద్యోగాలు ఏవీ పోలీసులకు వాళ్ళ పథకాలు పారడానికి పనికి రాలేదు. కనుక దాదూఫిర్యాదు లేని ఈ 'ఎదురుకాల్పుల' పేరుతో పోలీసుల హత్యలు తిరిగి ప్రారంభమయ్యాయి. భగల్పూరు ఖైదీలను గుడ్డివాళ్ళుగా మార్చిన పోలీసుల చర్య దేశమంతా గర్హించబడుతుంటే ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ ఒకసారి డిఐజితోనూ ఎస్‌పితోనూ అందుకే "పీళ్ళను ఎన్‌కౌంటర్ల పేరు మీద చంపడం సులభమైన సురక్షితమైన పని. ఎందువల్లనంటే ఇప్పడయితే సాక్ష్యం మిగిలిపోతూ వున్నది" అన్నాడని తెలుస్తున్నది.

అయితే మరి ఎన్‌కౌంటర్లు, ఎమర్జెన్సీ, నల్లచట్టాలు, తిరిగి ఎన్‌కౌంటర్లు ఈ పది పన్నెండేళ్ళుగా ప్రజల ఎదురుతిరిగే స్వభావాన్ని అణిచేయగలిగాయా! కళ్ళ ముందరి చరిత్రకు వ్యాఖ్యానమవసరమా!

... అంధుల్ని చేసి ...

ఈ సంవత్సరం ఫిబ్రవరి 17న బీహార్ పోలీసులు ఒక కొత్తతరహా హింసను అమల్లో పెట్టడం ప్రారంభించారు. ఉమేష్‌యాదవ్ అనే 25 సంవత్సరాల యువకుడు ఈ హింసాప్రారంభానికి బలయ్యాడు. ఈయన ఒక ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ప్యూన్ కొడుకు. ఈయన 1978లో ఒక సంఘటనలో స్థానిక దాదాను గాయ పర్చడంతో తొమ్మిది నెలలపాటు జైల్లో వున్నాడు. ఇక దానితో పోలీసుల "బ్లాక్ లిస్టు"లో ఆయన పేరు చేర్చబడింది. అతర్వాత ఆయనపై రెండు మూడు కేసులు బనాయించారు. ఆ తర్వాత ఆయనను అరెస్టు చేయడానికి వచ్చిన ఒక హవల్దార్‌తో గొడవ పెట్టుకున్నాడు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 17 న ఆయనను పోలీసులు రోడ్డుపై పట్టుకున్నారు. రోడ్డు మీదనే పోలీసులచేతిలో 50,60 లాఠీ దెబ్బలు తిన్నాడాయన. అక్కణ్ణించి మొజాహిద్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకుపోబడ్డాడు. అక్కడి పోలీసులు ఆయనను విపరీతంగాకొట్టి చేతులకు సంకెళ్ళువేసి వరండాలోపడేసి వెళ్ళిపో

యారు. డి ఎస్ పి సైకిల్ మోటార్‌పై ఎటో వెళ్ళిపోయి కొంతసేపటికి చేతిలో ఏదో పట్టుకొనివచ్చాడు. కొంతసేపు తన సహాయకులతో మాట్లాడాడు. ఆ తర్వాత ఉమేష్‌ను ఒక గదిలోకి లాగారు. అక్కడ కొంతమంది పోలీసులు ఆయన శరీరంపై ఎక్కి కూచున్నారు. కొందరుపోలీసులు ఆయన తలనుగట్టిగాపట్టుకున్నారు. డి.ఎస్.పి తనచేతిలోని ఒక చిన్న సీసాలోంచి ఉమేష్ కళ్ళలోకి ఆసిడ్ పోశాడు. ఉమేష్ స్పృహ తప్పి పడిపోయాడు. నాలుగు రోజుల తర్వాత స్పృహ వచ్చేసరికి ఉమేష్ శాశ్వతంగా గుడ్డివాడైపోయాడు. ఆ తర్వాత రెండు నెలలు ఆస్పత్రిలోనూ, మూడు నెలలు జైల్లోనూ ఉంచబడి ఆగస్టు 10న బెయిల్‌పై విడుదలయ్యాడు.

ఇక అప్పట్నుంచి ఈ రకమైన హింసా పరంపర మొదలయింది. కనీసం 31 మంది 'నేరస్తుల'ని ఆరోపించబడ్డ వాళ్ళ కళ్ళు పెరికి వేయబడ్డాయని బీహార్ ముఖ్యమంత్రి జగన్నాథ్‌మిశ్రా ప్రకటించాడు. వీళ్ళందరూ 18–35 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు.

ఈ సంవత్సరం జూలై 30న పదకొండు మంది ఖైదీలు భగల్‌పూర్ జిల్లా మెజిస్ట్రేటుకు తమ కళ్ళు పొడిచేసిన పోలీసు అధికారులపై కేసు పెట్టడానికి తమకు ఉచిత న్యాయసహాయం కలిపించవలసిందిగా దరఖాస్తు పెట్టుకున్నారు.

"భారత శిక్షాస్మృతి పోలీసులకు ప్రజల్ని గుడ్డివాళ్ళని చేసే అధికారాలివ్వదు. ఆర్థిక కారణాల వల్ల మేం పోలీసులపై కేసుపెట్టలేక పోతున్నాం. కనుక మాకు ఒక న్యాయవాదిని ఏర్పాటు చేయవలసిందిగా మిమ్మల్ని కోరుతున్నాం" అని వాళ్ళా దరఖాస్తులో రాశారు. ఈ విధంగా న్యాయ సహాయం ఇవ్వగలిగే అవకాశాలేవీ నేరశిక్షాస్మృతిలో లేని కారణం తో సెషన్స్ జడ్జి ఈ దరఖాస్తును తిరస్కరించాడు. భగల్‌పూర్‌కు చెందిన యువన్యాయవాది రామ్‌కుమార్ మిశ్రా దీనితో ఈ వివరాలన్నిటినీ శ్రీమతి కపిలాహింగోరానీకి పంపి సుప్రీంకోర్టులో ఈ విచారణ ప్రారంభమయ్యేలా చూడగలిగాడు. శ్రీమతి కపిలా హింగోరానీ గతంలో బీహార్‌లో విచారణలో మగ్గిపోతున్న ఖైదీల విషయాన్ని వెలుగులోకి తెచ్చింది. ఆమె అక్టోబర్ 10న సుప్రీంకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేసింది. ఈ ఆరోపణకు తగిన సంజాయిషీని నాలుగు వారాలలోపుగా అందజేయాలని సుప్రీకోర్టు ప్రధాన

న్యాయమూర్తి బీహార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాడు.

ఐతే అక్టోబర్ 6న కూడా భగల్‌పూర్ పోలీసులు మరి తొమ్మిది మంది "బందిపోట్ల"ని చెప్పబడుతున్న ఖైదీల కళ్ళు పొడిచేశారు.

సుప్రీం కోర్టు నవంబర్ 10 లోపుగా సంజాయిషీ ఇమ్మని బీహార్ ప్రభుత్వాన్ని ఆదేశించినప్పటికీ అక్టోబర్ 23 వరకూ భగల్‌పూర్ జిల్లా పోలీసు అధికారులకు ఈ విషయమై ఏ ఆదేశమూ అందలేదు.

ఇక ఇది కోర్టుల్లోనూ, ఫైళ్ళలోనూ మగ్గిపోతూ ఆలస్యానికీ చివరికి ఏ పరిష్కారమూ జరగపోవడానికీ దారి తీస్తున్న సమయంలో నవంబర్ 28న 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' తరఫున అరుణ్ సిన్హా ఈ అంశాన్ని వెలుగులోకి తెచ్చాడు. అప్పటినుంచి అమానుష కాండ విపరీతంగా ప్రచారంలోకి వచ్చింది.

"దొంగతనానికి శిక్షగా చేతులు నరకడమూ, వ్యభిచారానికి శిక్షగా స్త్రీల తలలు నరకడమూ చేసే దేశాలను ఖండించడం మన హక్కుగా మనం ముందుకు వస్తాం. నేరస్తులకు ఇలాంటి శిక్షలివ్వడం ఆటవికమే - కాని, మన దేశంలో నిత్యమూ కొనసాగుతున్న, అలవాటైపోయిన క్రౌర్యంతో ఇవి పోల్చరానివే" అని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సంపాదకీయం రాసింది

"పదునైన సూదిలాంటి సాధనంతో కనుగుడ్డు పగలగొట్టబడడం వల్ల, తినివేసే స్వభావం వున్న ద్రవం చల్లడం వల్ల వీళ్ళు గుడ్డి వాళ్ళుగా చేయబడ్డారు" అని భగల్‌పూర్ సెంట్రల్ జైల్ డాక్టర్ నివేదిక తెలిపింది.

నవంబర్ 30 నాటికి ఒక డి ఎస్ పి, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, పన్నెండు మంది సబ్ ఇనస్పెక్టర్లు సస్పెండ్ చేయబడ్డారు. సంవత్సరం నుండి నడుస్తున్న ఈ చిత్రహింసల గురించి పత్రికలు రాసే వరకూ ఎవరూ ఎందుకు మాట్లాడలేదో ఆశ్చర్యంగా వున్నదని బీహార్ ముఖ్యమంత్రి అన్నాడు. "రేప్ కేసును కూడా (!) వెలుగులోకి తెస్తున్న ప్రతిపక్షాలు, పత్రికలు ఈ విషయాన్ని ఎక్కడా, ఎప్పుడూ ఎందుకెత్త లేదు?" అని ప్రశ్నించాడు. ఈ సంఘటనకు "సాంఘిక అనుమతి" ఉండి ఉండవచ్చని కూడా అన్నాడాయన.

పోలీసులకు వ్యతిరేకంగా "ఈ రకమైన అర్థరహితమైన పనులను ఎవరూ

సహించరు" అని చెప్పిన భగల్‌పూర్ జైలు సూపరింటెండెంట్ కూడా సస్పెండ్ చేయబడ్డాడు.

ఇక ఇంత జరిగిన తరువాత కళ్ళు పొడిచేసింది తాము కాదనీ, ప్రజలనీ ప్రచారం మొదలు పెట్టారు పోలీసులు. కాని ఈ ప్రచారాన్ని కళ్లు పోగొట్టుకున్న ఖైదీలందరూ ఖండించారు.

ఇట్లా చేయడం వల్ల నేరాల సంఖ్య తగ్గించగలిగామన్న పోలీసుల వాదన కూడా వీగిపోయింది. ఎలాగంటే గత ఐదు సంవత్సరాలుగా భగల్‌పూర్ జిల్లాలో సంవత్సరానికి సగటున 82 హత్యలు నమోదవుతున్నాయి. కళ్ళు పీకేయడం ప్రారంభమైన ఈ సంవత్సరం అక్టోబర్ వరకే 86 హత్యలు నమోదయ్యాయి. అట్లాగే గత సంవత్సరం మొత్తం మీద 100 బందిపోట్లు, 64 దొంగతనాలు నమోదు కాగా ఈ సంవత్సరం అక్టోబర్ వరకే 100 బందిపోట్లు 59 దొంగతనాలు నమోదయ్యాయి.

ఐతే చాలా విచిత్రంగా కళ్ళు పీకేయడం వల్ల నేరాలు తగ్గాయి అనే ప్రచారంతో ప్రజాభిప్రాయం పోలీసులకు అనుకూలంగా తయారవుతున్నది.

సుప్రీం కోర్టుకు హాజరయిన సందర్భంగా బల్జిత్‌సింగ్ తండ్రి బలవంత సింగ్ "నా కొడుకుకు జరిగిందేదో జరిగిపోయింది. కాని నేను నా కొడుకును ఢిల్లీకి తీసుకొచ్చిందెందుకంటే అతనికి జరిగింది ఇంకే భారతదేశపు కొడుకుకూ జరగగూడదని" అన్నాడు.

బల్జిత్ కాకపోతే మానె, సాలిగ్రాం సావు కాకపోతె మానె, ఉమేష్ యాదవ్ కాకపోతె మానె కనీసం చూపున్నందుకు, మెదడున్నందుకు, మన చుట్టూ జరుగుతున్న అన్యాయాలను చూస్తున్నందుకు మనమైనా కదలకపోతే బలవంతసింగ్ మాటలు నిజం కావు. ఆ మాటలు నిజం చేయడానికి ఈ అంధక వ్యవస్థను కూల్చకపోతే చూపు లేని బల్జిత్‌కూ చూపున్న మనకూ తేడా లేదు...

* * * *

హత్యలు చేసీ, అంధుల్ని చేసీ ప్రజలను, ఒకవేళ వాళ్ళలో ఒకరో ఇద్దరో నేరస్థులు ఉన్నప్పటికీ 'సంస్కరించే' పనికి పూనుకున్న పోలీసు వ్యవస్థ అలహాబాదు హైకోర్టు ఒక తీర్పులో చెప్పినట్లు ఈ దేశంలో 'వ్యవస్థిత గూండా బలం' అని మరొక మారు రుజువయ్యింది. వ్యవస్థిత ప్రజాసంఘటన మాత్రమే దీన్ని అరికట్టగలదు.

5.12.80

విప్లవ రచయితల రిట్ పిటీషన్‌లో
ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పు.

"ప్రభుత్వోద్యోగి అయినంత మాత్రాన పౌరుడు తన సొంత భావాలను కలిగివుంటూ వాటిని ప్రచారం చేసుకొనే ప్రాథమిక హక్కును కోల్పోడు"

ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న విప్లవరచయితలు చెరబండరాజు (బి. భాస్కరరెడ్డి) లోచన్ (జి. రాజలోచన్)లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజ్యాంగ చట్టంలోని ఆర్టికల్ 311 (2) ప్రొవిజన్ (సి) క్రింద ఉద్యోగాల నుండి తొలగించుతూ ఉత్తరువులు జారీచేసింది. తమపై ఎలాంటి విచారణ జరపకుండా ఉద్యోగాలనుండి తొలగించడం చెల్లనేరదని చెరబండరాజు, లోచన్‌లు హైకోర్టులో రిట్ పిటీషన్లు దాఖలు చేసుకున్నారు.

ప్రభుత్వం తరపున చేసిన వాదంలో పిటీషన్‌దారులు తమ రచనలతో, ఉద్విగ్నపూరితమయిన ప్రసంగాలతో ఒక పథకం ప్రకారం ప్రచారం సాగిస్తూ ప్రజల్ని ప్రత్యేకించి విద్యార్థుల్ని సాయుధ విప్లవం ద్వారా ప్రభుత్వాన్ని కూలదోయటానికి హింసాయుత చర్యలకు తలపడవలసిందిగా రెచ్చగొడుతున్నారనీ, నగ్జలైట్ కార్యకర్తలతో చేతులు కలుపుతున్నారనీ, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు), అలాగే విప్లవ రచయితల సంఘంలో సభ్యులనీ, వారు సికింద్రాబాదు కుట్రకేసులో నిందితులనీ ఆరోపించారు. అందుచేత వారు ఉద్యోగంలో కొనసాగటం రాజ్యాంగ ప్రయోజనాలకు (Interest of state) అనుగుణ్యం కాదనీ, ఈ విషయాలపై ఎలాంటి విచారణ జరిపినా అది రాజ్యాంగ భద్రతా ప్రయోజనాలకు విరుద్ధమనీ గవర్నరు భావించి, సంతృప్తిచెంది చర్యతీసుకున్నారనీ, కనుక ఆర్టికల్ 311 (2) (సి) క్రింద గవర్నరు జారీచేసిన ఉత్తరువులను ప్రశ్నించకూడదనీ ప్రభుత్వం తరపున వాదించారు.

పిటీషనర్ల తరపున ప్రముఖ న్యాయవాది శ్రీ కె. జి. కన్నబిరన్ వాదిస్తూ ఆర్టికల్ 311 (2) ప్రకారం ఆరోపణలపైన విచారణ జరిపించవలసిన కనీసరక్షణను నిరాకరించే హక్కు ప్రభుత్వానికి లేదని నొక్కిచెప్పారు.

సరిగ్గా ఇవే ఆరోపణలను గురించి సెషన్స్‌కోర్టు కేసులో బహిరంగవిచారణ జరుగుతుండగా వాటిని గురించి డిపార్టుమెంటల్ ఎంక్వయిరీ జరపడం దేశ అంతరంగిక భద్రతకు ఎలా విరుద్ధమో అర్థం కాని విషయమన్నారు. ఎలాంటి విచారణ జరపకుండానే ఉద్యోగం నుండి తొలగించటం సరికాదన్నారు.

జస్టిస్ మాధవరెడ్డి, జస్టిస్ ముక్తాదార్లతో కూడిన హైకోర్టు డివిజన్ బెంచి పై రెండు పిటీషన్లలో తీర్పుచెబుతూ కేబినెట్ పద్ధతిననుసరించే ప్రభుత్వంలో రాష్ట్రి గవర్నరు, లేదా రాష్ట్రపతి ఏవిషయమునైనా పొందే సంతృప్తి వ్యక్తిగతమయిన సంతృప్తి కాదన్నారు. అది మంత్రిమండలి పొందే సంతృప్తి అని పేర్కొన్నారు. ఎందుకంటే రాష్ట్రపతి లేదా గవర్నరే మంత్రిమండలి సలహాసహకారాలపైన తమ అధికారాలు, కర్తవ్యాలు నిర్వహిస్తారు. అందుచేత రాష్ట్రపతిగాని, గవర్నరుగానీ తీసుకొనే చర్యపై తీర్పుచెప్పే అధికారం న్యాయస్థానాలకుంటుందని న్యాయమూర్తులు తమ తీర్పులో పేర్కొన్నారు. తమ తీర్పులో ఇంకా ఇలా పేర్కొన్నారు.

"ప్రభుత్వోద్యోగియొక్క ఉద్యోగ గడువు రాష్ట్రపతి లేదా గవర్నరుయొక్క యిష్టాయిష్టాలపైన ఆధారపడి యుండేది ఇంకెంత మాత్రము కాదు. అందుచేత పిటీషనర్లపైన వచ్చిన ఆరోపణలపైన విచారణ జరపవలసిన అవసరంలేదని చేసిన వుత్తరువూ, వారిని సర్వీసు నుండి తొలగిస్తూ చేసిన ఉత్తరువూ చెల్లనేరవు. రచనలు, గేయాలు, ప్రసంగాలు మాత్రమే ప్రభుత్వోద్యోగిని సర్వీసు నుండి తొలగించటానికి తగిన ఆధారం కాజాలవని మేము సూచిస్తున్నాం. ప్రభుత్వోద్యోగి అయినంత మాత్రాన ఒక పౌరుడు తన సొంతభావాలు కలిగియుండి వాటిని పుస్తక ప్రచురణల ద్వారా, గేయాలు, ప్రసంగాలు ద్వారా ప్రచారం చేసుకొనే ప్రాథమిక హక్కును కోల్పోడు. ఆ కారణం చేత ప్రభుత్వోద్యోగిపైన కఠిన సాధింపుచర్య తీసుకొనడం గానీ, లేదా, సర్వీసు నుండి తొలగించడం గానీ చేయకూడదు."

ఆ విధంగా తీర్పుచెబుతూ విప్లవ రచయితలపైన గవర్నరు జారీచేసిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది.

("ఉద్యోగ క్రాంతి" పత్రిక ఆధారంగా)

"లిబరేషన్" ఆంగ్ల చిత్రం గురించి

జనార్దన్ యస్.

ప్రోగ్రెసివ్ ఫిలింస్ రిలీజ్ వారి Sovi Export ఫిలిం "లిబరేషన్" రెండవ ప్రపంచ యుద్ధ సంఘటనలను చక్కగా చూపింది సామ్రాజ్యవాద దాడి నుండి తొలి సోషలిస్టు వ్యవస్థ పునాదులు వేసుకొంటున్న దశలో రష్యా సేనలను, ప్రజలను అత్యంత ధైర్యం, చతురతతో నడిపి సవాళ్ళను ఎదుర్కొంటున్న స్టాలిన్‌ను, ఫాసిస్టు నియంతలు హిట్లరు, ముసోలినీలను వాస్తవంలో చూపించింది. హిట్లరు, ముసోలినీ ఫాసిజాన్ని, వాళ్ళసైన్యం, నిర్వీర్యత యుద్ధమంటే సైన్యంలో వచ్చిన నిస్తబ్ధత. అలాగే ఎర్రసేనలు ప్రతి అంగుళం కోసం వీరోచితంగా పోరాడడం, బాంబుల వర్షం మధ్య గాయపడిన సోదరులకు వైద్యం చేస్తున్న రష్యన్ సోదరీమణుల ధైర్యం, నిస్వార్థత కళ్ళకు కట్టినట్లు చూపించారు. అలాగే హిట్లరు, వాడితొత్తులు జర్మనుసైన్యానికి పట్టుబడిన ఖైదీలను సైన్యంలో చేరమని చేసే ఫాసిస్టు అహంకార ఉపన్యాసాలు, వాళ్ళ నాజీ ఉన్మాదాన్ని చక్కగా తెలుపుతాయి. ఇంటర్నేషనల్ రెడ్ క్రాస్ వారినుండి "జర్మన్ సైన్యాలకు పట్టుబడిన తన కొడుకును తిరిగి ఇస్తాం రష్యా వారికి పట్టుబడిన జర్మన్ మార్షల్‌ను తిరిగి ఇచ్చినట్లయితే"నని స్టాలిన్‌కు రాయభారం పంపితే—స్టాలిన్ "నా కొడుకు సామాన్య సైనికుడు మాత్రమే, సైనికునికి బదులుగా మార్షల్‌ను ఎలా వదులుకుంటాం" అని చాలా నిస్వార్థంతో హుందాగా జవాబిస్తాడు.

తన కొడుకును ప్రధానిగా చేసుకోవాలని, వాడు చస్తే వాడిపేర ఊరూరా స్మారక నిధులు జనాల గోళ్ళూడకొట్టి వసూలు చేసి (లేక ప్రజా ధనంతో) స్మారక చిహ్నాలు కట్టాలని, ఆమె, ఆమె భజన పరులు, భజనలు చేస్తున్న ఈ భూస్వామ్య పెట్టుబడిదారీ సంస్కృతికీ—కమ్యూనిస్టు సమాజంలోని వ్యక్తుల నిస్వార్థతకు ఎంత వ్యత్యాసమో-వాళ్ళు ఎంత ఉన్నతులో ఈ ఒక్క చిన్న ఉదాహరణ చాలు.

రెండవ ప్రపంచ యుద్ధ సంఘటనలను చిత్రించిన ఈ ఫిలిం అందరూ చూడదగినట్టిది.

★ ★ ★ ★

బ్రెజ్నేవ్ తేకాదు రష్యా జోక్యానికే ఆహ్వానం పలుకుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి

భారత దేశానికి వ్యతిరేకమైన విదేశీశక్తులు ఆఫ్ఘనిస్తాన్‌లోవలె ఇక్కడ కూడా అరాచక పరిస్థితిని సృష్టింప జూస్తున్నాయని...భారత దేశంలో విదేశీ శక్తుల ఆటలు ఇలాగే కొనసాగినట్టయితే ఆఫ్ఘనిస్తాన్‌లోని పరిణామలే ఇక్కడ కూడ సంభవిస్తాయని ఆయన (రాష్ట్ర ముఖ్య మంత్రి శ్రీ టి. అంజయ్య) హెచ్చరించారు (ఆంధ్రప్రభ 9-12-80)

ఇదే సందర్భంలో ఆర్.ఎస్.యు., పి డి ఎస్ యు., ఆర్.వై.ఎల్., ఇఫ్టు లోహియా విచార్ మంచ్ కలిసి వేసిన కరపత్రాన్ని యదాతథంగా కింద ప్రచురిస్తున్నాం.

ఇండియాని యుద్ధరంగంగా మార్చాలనుకుంటున్న బ్రెజ్నేవ్ వెనక్కి పో!

ప్రియమైన ప్రజలారా!

ఒక చేత్తో ఆయుధాలుపట్టుకుని ప్రపంచ ప్రజల్ని చంపుతూ, మరో చేత్తో శాంతి కపోతాల్ని ఎగిరేస్తున్న సామ్రాజ్యవాద రష్యా పాత్ర మీకు తెలిసిందే.

నేడు రష్యా సోషలిస్టు బురఖా కప్పుకుని చిన్న చిన్న దేశాల్ని కబళిస్తూ ప్రపంచ శాంతికి ప్రమాదంగా పరిణమించింది. అంతేకాకుండా అంతర్జాతీయస్థాయిలో అణ్వస్త్రాల పోటీని పెంచి యివాళ మూడవ ప్రపంచ యుద్ధ ప్రమాదకారిగా మన ముందుకొస్తున్నది.

ఈ పరిస్థితుల మధ్యమళ్ళీ రివిజనిస్టు రష్యా అధినేత లియోనిద్ బ్రెజ్నేవ్ మన దేశానికి ఈ నెల 8న వస్తున్నాడు.

<u>రష్యా స్నేహం ఖరీదు -</u> 1953-54లో ఆర్థిక, వాణిజ్య సంబంధాల పేరిట భారతదేశంలో రష్యా తన దోపిడీని ప్రారంభించింది. స్నేహం, సహకారం పరస్పర సహజీవనాల పేరిట రష్యా మన దేశంలోని ఆర్థికరంగం మీద ముఖ్యంగా ప్రైవేటుసెక్టరు మీద చేస్తున్న దోపిడీ యింతఅంత కాదు.

—యిప్పటికే రూ॥ 20,000 కోట్ల అప్పుతో కృంగిపోతున్న మన ఆర్థిక వ్యవస్థపై అదనంగా రూ॥ 2,500 కోట్ల పూర్తిఅప్పుతో విశాఖలో ఉక్కు కర్మాగారాన్ని నిర్మించి మనపై తలకు మించిన భారాన్ని మోపి తన కబందహస్తాలలో బంధించటానికి ప్రయత్నిస్తుంది.

—1900 నుంచి 1975 వరకు మన దేశానికి 1875 మిలియన్ల అమెరికన్ డాలర్ల విలువగల ఆయుధాలు యిచ్చి మన మిలిటరీ పెత్తనం పూర్తి పట్టును సంపాయించింది.

—సాంకేతిక సహాయం పేరుతో ఆర్య భట్ట, భాస్కర, రోహిణి ఉపగ్రహాల పేరుతో తమ దగ్గర ఒకసారి ఉపయోగించి దాదాపు విలువలేని సరు-

కుని అసలు ధరకంటే ఎక్కువ అమ్ముకుంటుంది. విజ్ఞాన ఫలితాన్ని సంగ్రహించేది, అనుభవించేది రష్యాయే ఖర్చులు మాత్రం భరించేది మనం.

— స్నేహం, సహకారం, సోషలిజం పేరుతో 9-8-1971న "భారత-రష్యా ఒడంబడిక" జరిగింది

ఈ ఒడంబడిక 9వ క్లాజు ప్రకారం ఈ రెండు దేశాలలో దేనికైనా యితర దేశాల నుండి ప్రమాదం ఏర్పడినప్పుడు ఒక దేశంలో యింకో దేశం సైనికంగా జోక్యం కలిగించుకుని పరస్పరంగా సహకరించుకోవచ్చును.

ఇలాంటి ఒడంబడికల పేరిట అఫ్ఘానిస్తాన్, ఇథియోపియా, అంగోలా, దక్షిణ ఏమెన్‌లను కబళించింది. ప్రమాదాల పేరిట ఒడంబడిక కుదుర్చుకున్న దేశాన్ని ఆక్రమించడమే దీని లక్ష్యం.

<u>బ్రెజ్నేవ్ ఎందుకు వస్తున్నట్లు ?</u>: 1955 జనరల్ ఎన్నికలలో ఆనాటి రష్యా నేత కృశ్చేవ్ నెహ్రూ ప్రభుత్వాన్ని 'శాంతికాముకం అయింది' అని అంటే, ఈనాడు బ్రెజ్నేవ్ యింకా కొంత ముందుకు పోయి ఇందిరా ప్రభుత్వాన్ని సోషలిస్టు ప్రభుత్వం అని పొగుడుతున్నారు.

లక్షలాది మందిని జైళ్ళలో కుక్కి, వేలాది మంది విప్లవ కారులను "ఎన్‌కౌంటర్ల" పేరిట హత్యచేయడాన్ని, యింకా మొత్తం దేశాన్ని NSO తో జైలుగా మార్చగలిగిన ఇందిరా ప్రభుత్వంలో "సోషలిజం" చూడగలిగిన ఘనత బ్రెజ్నేవ్ కే దక్కింది.

అటువంటి ఇందిరా ప్రభుత్వాన్ని అడుగడుగున సమర్థించే CPI-CPM వంటి రివిజనిస్టులే రష్యా నుండి మాస్కో బ్రాండ్ విప్లవాన్ని మనదేశానికి దిగుమతి చేయడానికి బ్రెజ్నేవ్ గొడుగుకింద ప్రయత్నాలు చేస్తున్నారు

కంపూచియాలో, అఫ్ఘనిస్తాన్‌లో రష్యా సృష్టించిన ప్రజల పీనుగుల పెంటలు యింకా పూడ్చకముందే మధ్యప్రాచ్య, యూరప్ యింకా యిటు పశ్చిమ ఆసియాని మింగేయాలన్న ప్రయత్నమే ఇండియాకి బ్రెజ్నేవ్ రావడం.

రష్యా చేస్తున్న ఈ కుట్రకి మన దేశం భౌగోళికంగా ఎంతో అనుకూలంగా వుండగలదు. అందుకే రష్యా కాబూల్‌ని దాటి, ఢిల్లీకి రావాలని ప్రయత్నిస్తున్నది మన పాలకులు కూడా అఫ్ఘానిస్తాన్‌లో బబ్రాక్ కర్మాల్‌ని, కంపూచియాలో హెంగ్ సమారిన్‌ని గుర్తించి, పోల్‌పాట్ సైన్యాలని, ప్రజలని చంపడానికి, వియత్నాం సైన్యాలు తినడానికి బియ్యం మన దేశం నుండే ఎగుమతి చేసి రష్యా సామ్రాజ్యవాద తొత్తులమేనన్న విషయాన్ని మన పాలకులు చాలా నిజాయితీగానే చాటుకున్నారు.

ఈ కుట్రలు-కుహకాలతో మన దేశానికి 'ప్రపంచ శాంతి' పేరిట వస్తున్న లియోనిద్ బ్రెజ్నేవ్ రాకని వ్యతిరేకిస్తూ విద్యార్థులు, ప్రజలందరు కూడ నల్ల బ్యాడ్జీలు ధరించి, ఊరేగింపులు, ప్రదర్శనల ద్వారా తమ నిరసనను తెలియజేయాలని కోరుతున్నాము.

8-12-80

SRJANA, Telugu Monthly Dec. '80 H/WL-10
Regd. No. with Registrar of Newspapers 10953/67

అచ్చులో

కరీంనగర్ - ఆదిలాబాద్ రైతాంగ వీరోచిత పోరాట గాథలు

(ఫోటోలతో)

వివరాలకు :

1. పీస్ బుక్ సెంటర్,
3-4-74/3
లింగంపల్లి,
హైదరాబాద్ - 500 027

2. సృజన
హనుమకొండ
వరంగల్
506 001.

ఉద్యోగులు చదవవలసిన పత్రిక
ఉద్యమోపజీవులైన ఉద్యోగులు తప్పక చదవాల్సిన పత్రిక
ఉద్యోగ క్రాంతి

అడ్రసు : సి. ప్రకాశరావు
M. C. 268, మలక్ పేట
హైదరాబాద్ - 500 036

చందా ; రు. 9-00 లు
విడిప్రతి : 0.75 పై.

సృజన దగ్గర కొత్త పుస్తకాలు

1. కళలూ - శాస్త్రీయ విజ్ఞానం - కొ. కు. - విరసం ప్రచురణ రు. 6-00
2. మరో ప్రస్థానం - శ్రీశ్రీ - ,, 5-00
3. మరో ఝంఝ - కవితా సంకలనం ,, 3-00
4. రగులుకొనే రాక్షసిబొగ్గు - సురా - యుగ ప్రచురణ 5-00
5. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం -
కవిసేన కు సమాధానం - టి. ఎమ్. ఎస్. సృజన ప్రచురణ 1-00
6. జనం కదిలింది - జాగ్రత్త, పెన్మెటాంగ్ టింగి
నాటికలు - రుద్రజ్వాల, నరసింహారావు-రాడికల్ ప్రచురణ 2-00
7. పల్లవి - చెరబండరాజు పాటలు - — 2-00
8. రష్యన్ ఛల్లూకప్పట్టులో ఆఫ్ఘనిస్తాన్ - కె.వి.ఆర్. - క్రాంతి ప్రచురణ 4-00

ఈ పుస్తకాలు సృజన వద్దనే కాక పీస్ బుక్ సెంటర్ లో కూడా లభిస్తాయి.

SRJANA Rs. 2-00
Hanumakonda-506 001